


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★


ఇందిరమ్మ ఆశయాలే ప్రజాపాలనకు మార్గదర్శకం

03



సంపుటి 09, సంచిక: 331 | ఆదివారం | 01-11-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# కారు చీకట్లో కాంతిరేఖ ఎర్రజెండా

**కార్మికులకు అండగా ఎఐటియుసి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రజాపక్షం/పాల్వంచ

'కారుచీకట్లో కాంతిరేఖ ఎర్రజెండా' అని సమస్యల పరిష్కారం కోసం కార్మికులకు 106 సంవత్సరాల నుండి ఎఐటియుసి అండగా నిలబడి పోరాడుతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌సి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎఐటియుసి 107వ, ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పాల్వంచ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పట్టణంలో కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మిక అడ్డాలు, పలు సెంటర్లలో ఎర్రజెండాలను ఎగురవేశారు. పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ఎఐటియుసి పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం ఆవిష్కరించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం 1920 అక్టోబర్ 31వ, తేదీన ముంబైలోని ఎంపైర్ థియేటర్‌లో ఎఐటియుసిని స్థాపించారని దీనికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, స్వాతంత్ర సమరయోధుడు లాలా లజపతిరాయ్ వ్యవహరించారని, అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వివి.గిరి లాంటి జాతీయ నాయకులు సైతం అధ్యక్షులుగా కొనసాగినట్లు చెప్పారు. బ్రిటీష్ పలస పాలకుల వ్యతిరేకంగా నిలబడి కొట్లాడింది, స్వాతంత్ర్య సమరంలో, కార్మికుల హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలు దేశ చరిత్రలో ఓమైలురాయిగా నిలిచాయన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం శతాబ్దానికి పైగా సాగిన అలుపెరుగని పోరాటాలు, లెక్కలేనన్ని రక్త తర్పణలు, వీరోచిత త్యాగాల పునాదులపై నిర్మితమైన ఎఐటియుసి మాత్రమే కార్మిక లోకానికి కొండంత అండగా నిలుస్తోందన్నారు. దేశంలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు అనుభవిస్తున్న హక్కులు ఏఐటియుసి పోరాట ఫలితమేనన్నారు. తెల్ల దొరల నిరంకుశ పాలన కాలం నుండి స్వాతంత్ర్యోద్యమం వరకూ దేశ

తరువాయి 12లో

# సిఇసి అభిశంసన ఏకగ్రీవం

**తీర్మానం ఆమోదించిన ఇండియా కూటమి**

**2024 ఎన్నికల చట్టబద్ధతను అణచివేశారు : రాహుల్ గాంధీ**

**ప్రధాని, హోం మంత్రి ఆదేశాలతో పని చేస్తోన్న సిఇసి : ఖర్గే**





## 'సర్' పేరుతో ప్రభుత్వమే ఓటర్లను ఎన్నుకుంటోంది

సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు సందోష్‌కుమార్

ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రజలు ఎన్నుకుంటారని, కానీ సర్ పేరుతో ప్రభుత్వమే తమ ఓటర్లను ఎన్నుకుంటోందని సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ అన్నారు. ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో శనివారం సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై నిర్వహించిన 'ప్రజా అభిశంసన' మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన

తరువాయి 8లో


**న్యూఢిల్లీ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలనే తీర్మానాన్ని ఇండియా కూటమి ఏకగ్రీవంగా ఆమోదించింది.రాజ్యాంగ ఉల్లంఘనలు, ఓటర్ల జాబితాల తారుమారు ఆరోపణలపై తక్షణమే ఆయనను పదవి నుంచి తొలగించాలని తీర్మానంలో డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు తమ నిరసనను తీవ్రతరం చేస్తున్న తరుణంలో శనివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున నివాసంలో సిఇసిపై ప్రతీకాత్మక 'ప్రజా అభిశంసన'ను నిర్వహించారు. ఈ సందర్భంగా లాన్‌లో పార్లమెంట్ సమావేశ మందిరం తరహాలో ఏర్పాట్లు చేశారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై 'ప్రజా అభిశంసన' కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే తొలుత సిఇసిపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 కింద హామీ ఇవ్వబడిన సార్వత్రిక వయోజన ఓటు హక్కుకు సిఇసి చర్యలు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని ఇండియా కూటమి పార్టీలు, ప్రజలు రూపొందించిన ఆ తీర్మానంలో పేర్కొన్నారు. ప్రజా అభిశంసన కార్యక్రమానికి ఇండియా కూటమికి చెందిన 21 పార్టీల ఎంపిలు, రాజ్యసభలో విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సిపిపి చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎస్‌పి ఎంపి ధర్మేంద్ర యాదవ్, సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోష్ కుమార్, పి.పి.సునీర్, సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్, టిఎంసి ఎంపిలు

తరువాయి 8లో

జిఎస్ఎల్‌విఎఫ్ –18

## ప్రయోగం విజయవంతం

భారత నావిగేషన్ వ్యవస్థ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మరో ముందడుగు



**శ్రీహరికోట:** భారత్ తన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మరో కీలక ముందడుగు వేసింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జిఎస్ఎల్‌విఎఫ్ 18 రాకెట్‌ను శనివారం విజయవంతంగా ప్రయోగించి, ఎన్వీఎస్03 (ఎన్‌విఎస్ 03) నావిగేషన్ ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జిటిఒ)లో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్ సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరిగింది. భారత జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్ఎల్‌వి)కు ఇది 20వ ప్రయోగం. దేశంలో ప్రస్తుతం అమలవుతున్న ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (ఐఆర్ఎన్ఎస్ఎస్) అందిస్తున్న నావిగేషన్ సేవల్లో నిరంతరాయతను కొనసాగించడంతో పాటు, వాటి సామర్థ్యాలను

తరువాయి 12లో


## ఇండియా కూటమి భారీ ర్యాలీ నేడు



**సిఇసి రాజీనామాకు డిమాండ్... రామ్‌లీలా మైదాన్‌లో ఏర్పాట్లు పూర్తి.. ఢిల్లీకి చేరుకుంటున్న ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు**

న్యూఢిల్లీ : ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఆదివారం ఇండియా కూటమి భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన వ్యక్తం చేయడంతోపాటు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు ఈ ర్యాలీకి సిద్ధమయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిపక్ష నేతలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి చేరుకుంటున్నారు. ప్రధాన వేదికపై భారీ త్రివర్ణ పతాకం ఆకృతిలో పందిరి ఏర్పాటు చేశారు. ఇండియా కూటమిలోని వివిధ పార్టీల ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రతా చర్యలను కూడా చేపట్టారు. తొలుత మింటో రోడ్ నుంచి రామ్‌లీలా మైదాన్ వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం భారీ బహిరంగ సభ జరపాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఈ సభకు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సంస్థలు హాజరవుతాయని అంచనా వేస్తున్నారు. కాగా, ఈ కార్యక్రమం ఇండియా కూటమి రాజకీయ పార్టీలకే పరిమితం కావడం లేదు. విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, పౌర సమాజ ప్రతినిధులు కూడా ఆందోళనలో పాల్గొనాలని ఇండియా కూటమి పిలుపునిచ్చింది. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), పలు విద్యార్థి సంఘాలు కూడా ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల కోసం

తరువాయి 12లో



## బంగాళాఖాతంలో మరో తుఫాను

నవంబర్ 3న ఎపి తీరాన్ని తాకే అవకాశం

**భువనేశ్వర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన బలమైన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది క్రమంగా తుఫానుగా తీవ్రరూపం దాల్చి నవంబర్ 3న ఆంధ్రప్రదేశ్ (ఎపి) తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అధికారులు శనివారం వెల్లడించారు. ఈనెల 28న అర్ణబ్ తుఫాను ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. ఆ తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. కాగా, ప్రస్తుతం ఏర్పడుతున్న తుఫాను వల్ల గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, అప్పుడప్పుడు గాలి వేగం గంటకు 100 కిలోమీటర్ల వరకు చేరవచ్చని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. 'ఈ తుఫాను మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరంలో తీరం దాటే అవకాశం ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ నికోబార్ దీవులు, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో ఏర్పడిన బలమైన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ, శనివారం ఉదయం 11.30 గంటలకు

తరువాయి 12లో

## నేటి నుంచి హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్ల సేవలు

**నిర్మాణాలు, ల్యాండ్‌స్కేపింగ్, శుభ్రత తదితర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటి సరఫరా**

**నవంబర్ 15 నాటికి మిషన్ భగీరథ అదనపు 40 ఎంజిడి నీటి పథకం పూర్తి**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించడంతో పాటు అందుబాటులో ఉన్న మంచినీటి, భూగర్భ జల వనరులను సంరక్షించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు అందుబాటులో ఉన్న వనరులను సుస్థిరంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ శాఖలలో తాగునీటితో సంబంధం లేని నిర్మాణ పనులు, ల్యాండ్ స్కేపింగ్, శుభ్రత తదితర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం

తరువాయి 8లో

వైద్యుల నిర్లక్ష్యం

## గర్భిణి, శిశువు మృతి


**షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఘటన**


**అటెండర్లు, ఆయాలతో లేబర్ రూంలో డెలివరీలు**

**ఐదుగురు గైనకాలజిస్టులు ఉన్నా.. డ్యూటీలో కనిపించరు**

**ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరుపై బంధువుల మండిపాటు**

**పోలీసుల అదుపులో మృతురాలి భర్త రమేశ్**





ప్రజాపక్షం/రంగారెడ్డి/షాద్‌నగర్


ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం..రెండు ప్రాణాలను తీసినా..ఏమి తెలియదన్నట్లుగా హైదరాబాద్ ఉస్మానియా వైద్యశాలకు తరలించి చేతులు దులుపుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. 9నెలలు నిండిన గర్భిణీ స్త్రీ ప్రసవం కోసం షాద్‌నగర్

తరువాయి 8లో

కాల్పుల విరమణ తరువాత కూడా

## యుద్ధనేరాలకు, జాతి నిర్మూలనకు పాల్పడిన ఇజ్రాయెల్

**పాలస్తీనాపై ఐక్యరాజ్య సమితికి నివేదిక సమర్పించిన జస్టిస్ మురళీధర్ కమిషన్**




గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తరువాత కూడా ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ బలగాలు యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలనకు పాల్పడుతూనే ఉన్నాయని ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ పేర్కొంది. ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశానికి నివేదిక సమర్పించింది. వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యలు, స్థిర నివాసుల హింస అనేవి, పాలస్తీని వాసులపై జరిగిన ఒక సమన్వయ


తరువాయి 8లో

**సాగునీటి ప్రాజెక్టులపై ఇతర జిల్లాల కుట్ర**

## నల్లగొండకు తీవ్ర నష్టం

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపణ**

**రాచకొండ వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేసి సంస్థాన్ నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలని డిమాండ్**



ప్రజాపక్షం/సంస్థాన్‌నారాయణపురం

సాగునీటి ప్రాజెక్టులపై కుట్ర పన్నుతూ నల్లగొండ జిల్లాకు తీవ్ర నష్టం చేకూర్చేలా ఇతర జిల్లాల నాయకులు వ్యవహరిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. శివన్నగూడెం రిజర్వాయర్ నుండి లిఫ్ట్ ద్వారా రాచకొండ వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేసి సంస్థాన్ నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలోని

తరువాయి 12లో





## కలిసి ఉంటే... కలదు లాభం



వ్యవసాయం అంటేనే అనిశ్చితి. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియదు.. పంట చేతికొస్తుందో లేదో నమ్మకం ఉండదు. దీనికి తోడు పెరుగుతున్న కూలీల ఖర్చులు, పెట్టుబడి భారాలు, అప్పులు రైతులను సతమతం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మహారాష్ట్ర లోని లాతూర్ జిల్లాకు చెందిన 12 మంది రైతులు ఒక కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు కాకుండా, కలిసికట్టుగా సాగుచేస్తే ఖర్చులు తగ్గుతాయని, కష్టాలను పంచుకుంటే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని నిరూపిస్తున్నారు. వీరి ప్రయోగం దేశవ్యాప్తంగా రైతులకు స్ఫూర్తినిచ్చే నమూనాగా నిలుస్తోంది. లాతూర్ జిల్లా జల్కోట్ తాలూకాలోని కేకటొసింద్గి గ్రామానికి చెందిన ఈ రైతులు 'ఛత్రపతి శివాజీ మహారాజ్ రైతు సంఘం'గా ఏర్పడ్డారు. తొలుత ఒక్కొక్కరు రెండెకరాల చొప్పున తమ భూములను కలిపి 24 ఎకరాల్లో సమష్టి వ్యవసాయం ప్రారంభించారు. వచ్చిన ఫలితాలతో ఉత్సాహం పెరగడంతో, మరో 30 ఎకరాలకు తమ కార్యకలాపాలను విస్తరించారు. ప్రస్తుతం మొత్తం 54 ఎకరాల్లో సమన్వయంతో సాగు చేస్తున్నారు. ఈ ఐక్యత వారి జేబులకు మేలు చేయడమే కాకుండా, అప్పుల ఊబిలో పడకుండా కాపాడింది. ఈ సీజన్‌లో సోయాబీన్ పంట కోతను కలిసికట్టుగా నిర్వహించడం ద్వారా సుమారు రూ.2.3లక్షల కూలీ ఖర్చును ఆదాచేశారు. కరువు ముప్పు పొంచి ఉండే మరాఠ్వాడా ప్రాంతంలో నీటి కొరత ఎదురైనప్పుడు అందుబాటులో ఉన్న నీటిని పరస్పరం పంచుకోవడం వీరి మరో ప్రత్యేకత. ప్రతి ఆదివారం సమావేశమై పంటల ఎంపిక, సాగు ప్రణాళికలు, ఖర్చుల నిర్వహణపై చర్చిస్తారు. సోయాబీన్‌తో పాటు కంది, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. చిన్న రైతులు తమ భూముల యాజమాన్యాన్ని వదులుకోకుండానే, పనులు, వనరులను సమష్టిగా నిర్వహించవచ్చని వీరి ప్రయోగం మనకు స్పష్టం చేస్తుంది. గ్రామాల్లో రైతు సంఘాలు ఏర్పడి, వ్యవసాయ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ నమూనాను అమలు చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి, రైతుల బేరసారాల శక్తి పెరిగే అవకాశం ఉంది. అయితే దీర్ఘకాలిక విజయానికి రబీ సీజన్‌తో పాటు తదుపరి సంవత్సరాల్లోనూ ఇదే ఐక్యత కొనసాగాలి. రైతు ఒంటరిగా పోరాడితే కష్టం భారమవుతుంది.. అదే రైతులంతా కలిస్తే కష్టం అవకాశంగా మారుతుంది. లాతూర్ రైతులు చూపిస్తున్న ఈ దారి, భారత వ్యవసాయానికి సమష్టి శక్తి ఎంత అవసరమో గుర్తుచేస్తోంది.

## బెడిసికొట్టిన వ్యూహం..



ఒక్కోసారి ఎంతో ఆలోచించి, సిద్ధం చేసుకున్న వ్యూహం ఎందుకూ పనికిరాకుండా పోతుంది. 70 ఏళ్ల లారెన్స్ జాన్ రిపిల్ విషయంలోనూ అదే జరిగింది. చిన్నాచితకా విషయాలకు కూడా భార్య సూటిపోటీ మాటలు అనడంతో విసిగిపోయాడు. పాడైన హెయిర్ డ్రయర్‌ను బాగు చేయించడం కూడా రాదా? అంటూ భార్య విసుక్కోవడంతో విరక్తి చెందిన రిపిల్, ఆ యాతన నుంచి బయటపడడానికి గొప్ప ప్లాన్ వేశాడు. ఇంట్లో ఉండడం కంటే జైలే నయమనుకున్నాడు. తన ఇంటి పక్కనే ఉన్న బ్యాంకుకి వెళ్లి అక్కడ తుపాకీ చూపించి క్యాషియర్‌కు ఒక స్లిప్ ఇచ్చాడు. అందులో తనకు 3వేల డాలర్లు ఇవ్వమని రాశాడు. భయపడి రిపిల్ మూడు వేల డాలర్లు ఇచ్చాడు.అయితే ఈ డబ్బు తీసుకున్న రిపిల్ అక్కడే బెంచ్‌మీద కూర్చుని 'ధైర్యం ఉంటే పోలీసులను పిలువు' అంటూ రెచ్చగొట్టాడు. బ్యాంకు సిబ్బంది పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసు లు వచ్చి రావడంతోనే వారిని దగ్గరికి పిలిచి 'మీరు వెతుకుతున్న వ్యక్తిని నేనే' అంటూ తనను తాను పరిచయం చేసుకొని తన మీద కేసు పెట్టి జైల్లో వేయమని కోరాడు. రిపిల్ కోరినట్టే కేసు పెట్టిన పోలీసులు అతనిని కోర్టు ముందు హాజరు పరిచారు. కేసు మొత్తం విన్న న్యాయమూర్తి రిపిల్ కు వేసిన శిక్ష ఏమిటో తెలుసా? ఆరు నెలల పాటు ఇంట్లోనే ఉండాలని బయటికి రాకూడదని ఆంక్షలు విధించడం. అంతేకాదు, బయట కు రానీయకుండా ఒక సెక్యూరిటీ గార్డును కాపలాగా పెట్టాలని ఆదేశించాడు. పాపం రిపిల్ కోర్టులోనే బావురుమన్నాడు. తన వ్యూహం తిరిగి తనకే శిక్షగా మారుతుందని ఊహించలేకపోయాడు.

## చనిపోయింది.. మళ్లీ బతికింది...!



సోషల్ మీడియాలో ఇటీవలి కాలంలో నిర్ధారణ లేని కథలు, అర్థాంతర సమాచారంతో కూడిన వ్యక్తిగత అనుభవాల కథనాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. వాటిలో తాజాగా చర్చ కు వచ్చిన ఒక కథ, ఒక మహిళ ఎనిమిది నిమిషా ల పాటు హృదయ స్పందన లేకుండా ఉండిపోయి న సమయంలో కూడా చైతన్యం కొనసాగిందన్న ఆమె వ్యక్తిగత అనుభూతిపై ఆధారపడింది. అయితే ఈ కథను శాస్త్రీయ నిరూపణగా కూడా చెప్పలేం, పూర్తిగా భ్రమగా కొట్టేయలేం అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వైద్య రికార్డుల ప్రకా రం, ఆ సమయంలో బ్రియాన్ లాఫెర్టీ అనే మహిళకు పల్స్ లేదు, హృదయం పనిచేయలేదు, యంత్రాలు స్పందించలేదు. సాంప్రదాయ బయాలజీ ప్రకారం చూస్తే, అప్పుడు చైతన్యం ఉండకూడదు. కానీ ఆమె మాత్రం చీకటి, భయం కాకుండా స్పష్టత, నిశ్శబ్దం, నిరంతరం అనుభవించానని చెబుతోంది. మరణం అనిపించలేదు, మార్పు అనిపించింది అన్న ఆమె మాటలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. ఇక్కడే ఈ కథపై సందేహాలు మొదలవుతున్నాయి. శాస్త్రవేత్తలు, సందేహవాదులు ఈ అనుభూతికి ఆక్సిజన్ లోపం, మెదడులో న్యూరోకెమికల్ మార్పులు, తీవ్రమైన ఒత్తిడి వల్ల వచ్చే హల్యూసినేషన్లు వంటి కారణాలు ఉండవచ్చని చెబుతున్నారు. ఇవన్నీ శాస్త్రీయంగా సాధ్యమైన వివరణలే. అయితే, విభిన్న దేశాలు, సంస్కృతులు, మతాల నుంచి వచ్చిన అనేక సమాన అనుభూతుల కథలు ఒకేలా ఉండటం కూడా పూర్తిగా విస్మరించలేని అంశంగా పేర్కొంటున్నారు. అయినా, ఈ కథ మరణానంతర జీవితం ఉందని లేదా శాస్త్రం తప్పని నిరూపించదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యువ క్రికెటర్‌ను మింగిన దురదృష్టం



ఇప్పుడు దేశవ్యాప్తంగా వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగుతున్నది. అత్యంత పిన్న వయసులోనే అద్భుతాలు సాధిస్తున్నాడని, సచిన్ తెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి మేటి ఆటగాళ్లతో పోల్చదగిన వాడని కీర్తిస్తున్నారు. అయితే, దాదాపు అంతటి ప్రతిభగల ఓ క్రికెటర్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దురదృష్ట సంఘటన ఎక్కువ మందికి తెలియకపోవచ్చు. ఆ క్రికెటర్ పేరు ధ్రువ్ మహేందర్ పాండోవ్. కేవలం 13 ఏళ్ల వయసులోనే అతను పంజాబ్ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 14 ఏళ్లకే సెంచరీ సాధించి ఈ ఘనత అందుకున్న అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. 17 ఏళ్ల వయసులోనే, రంజీ ట్రోఫీలో 1,000 పరుగులు పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. అందరూ అతనిని సచిన్ టెండూల్కర్‌తో పోల్చేవారు. భారత జట్టులో చోటు సంపాదించి సచిన్‌తో కలిసి ఆడాలనే ఆశతో దూసుకెళుతున్న సమయంలోనే విధి అతనిని ఈ లోకం నుంచే దూరం చేసింది. 1992 జనవరి 31న అంబాలా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధ్రువ్ కేవలం 18 ఏళ్ల వయసులోనే కన్నుమూశాడు. భారత క్రికెట్ ఒక గొప్ప బ్యాటింగ్ ప్రతిభను కోల్పోయిన ఈ ఘటన దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత కూడా క్రికెట్ అభిమానులను కలచివేస్తూనే ఉంది.

*– బిఎస్ఎస్ మైత్రేయి*

# క్యాన్సర్ పీడితులకు భారీ ఊరట

సుప్రీం కోర్టు జోక్యంతో క్యాన్సర్ మహమ్మారి ఔషధాల ధరలు తగ్గనున్నాయి. క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన 137 ఔషధాలకు సంబంధించిన 543 బ్రాండ్‌ల ధర తగ్గింపు నవంబర్ 9 నుంచి అమలులోకి రానుంది. ఇకపై నిర్ణీత క్యాన్సర్ ఔషధాల తయారీ ధరపై 30 శాతానికి మించి గరిష్ఠ ధర (ఎంఆర్‌పి) ఉండకూడదని నేషనల్ ఫార్మస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా ప్రైవేటు ఫార్మాధరలతో పాటు, క్యాన్సర్ జెనరిక్ మందుల ధరలు 93 శాతం తగ్గుతాయి. ఈ చర్య ఫలితంగా రిటైర్ ధరలు 70 శాతం వరకు తగ్గి, రోగులకు ఏటా రూ.2,500 కోట్లు ఆదా అవుతాయని అంచనా.

క్యాన్సర్ వ్యాధి పడిన వారి కుటుంబసభ్యుల బాధ వర్ణణాతీతం. ఒకవైపు పీడితులను కుటుంబసభ్యులు ఓదార్చడం, మరోవైపు చికిత్సకు అయ్యే ఖర్చుతో కుదేలవడం కళ్ళకు కనిపిస్తూనే ఉంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు దాని నుంచి బైటపడినా కుటుంబం అప్పుల ఊబిలో చిక్కుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇటీవల భారతదేశంలో క్యాన్సర్ కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది. లక్షమందిలో 60 మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఏటా 15 లక్షల కొత్త కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో క్యాన్సర్ చికిత్స అత్యంత ఖరీదైనది. ఔషధాల ధరలు రూ.38,000 నుంచి రూ.3.80 లక్షల వరకు ఉంటాయి. క్యాన్సర్ థెరపీ వ్యాధి దశను బట్టి ఎన్ని దఫాలో నిర్ణయిస్తారు. ఈ వ్యాధి బారిన పడితే మధ్యతరగతి, పేదల పరిస్థితి అంతే. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ పథకం కింద కుటుంబానికి రూ.5 లక్షల వరకు భీమా వర్తిస్తోంది. ఈ మొత్తం రొమ్ము క్యాన్సర్‌కు చికిత్స చేసే కాడ్సిలా అనే ఒక ఔషధం ఒక్క డోసు కొనుగోలుకు సరిపోతుంది. ఇలాంటివి రోగికి 14 డోసుల వరకు అవసరమంటే ప్రభుత్వ పథకం ఏ మూలకు వస్తుందో అర్థం చేసుకోవచ్చు.

నిజానికి క్యాన్సర్ ఔషధాలు ఖరీదైనవే అయినప్పటికీ, అవి కంపెనీల నుంచి ఆసుపత్రులకు చేరేవరకు పంపిణీదారుల వ్యవస్థ కలుపుకొని దండుకునే లాభాలతో గరిష్ట ధరను అమాంతం అందుకోలేనంత ఎత్తుకు పెంచేస్తారు. అసలు ధరకు ఎంఆర్‌పికి మధ్య 170 శాతం నుంచి 700 శాతం వరకు, కొన్ని మందులకు అంతకంటే ఎక్కువ శాతం ఎంఆర్‌పిని కంపెనీలు నిర్ణయిస్తున్నాయి. అంటే అసలు ధరకంటే వెయ్యి శాతం రోగి నుంచి వసూలు చేసుకోవడం అత్యంత కిరాతకం. ఈ వివరాలను సేకరించి, వెలుగులోకి తీసుకురావడంలో కర్నాటక ప్రభుత్వం కీలక పాత్ర నిర్వహించింది. దాని ఫలితంగానే అసలు ధరపై ఎంఆర్‌పి 30శాతం మాత్రమే ఉండాలనే నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వ ఔషధ సంస్థలు రాగలిగాయి.

క్యాన్సర్ ఔషధాల దోపిడీ ధరలు తెరపైకి రావడం వెనుక ఒక మహిళ న్యాయపోరాటం దాగి ఉంది. కేరళం రాష్ట్రానికి చెందిన సరోజం రాధాకృష్ణన్ అనే రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి 2021లో క్యాన్సర్ బారిన పడ్డా రు. క్యాన్సర్ చికిత్సకు నెల నెలా రూ.63 వేలకు పైగా ఆమె ఖర్చు చేయాల్సి వచ్చింది. ఆ దెబ్బకు వారి కుటుంబం దాచుకున్న పొదుపు మొత్తం, పెన్షన్ డబ్బులు ఆవిరైపోయాయి. తనలాగే చికిత్స కారణంగా వేలాది క్యాన్సర్ బాధితుల కుటుంబాలు వీధుల్లోకి వచ్చే పరిస్థితి వచ్చిందని గుర్తించి, ఆమె 2022లో కేరళ హైకోర్టులో అధిక ధరలపై కేసు దాఖలు చేశారు. దురదృష్టవశాత్తు 2022లో సరోజం రాధాకృష్ణన్ మరణించారు. అయినప్పటికీ, ఆమె దాఖలు చేసిన కేసు నిష్ఫలం కాకుండా, దానిని ప్రజా ప్రయోజన వ్యాజ్యం కింద మార్చి కేరళం హైకోర్టు విచారణను కొనసాగించింది.

2026 జులై 17న సుప్రీం కోర్టు క్యాన్సర్ ఔషధాల భారీ ధరల వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది. రిటైలర్ నిర్ణయించిన ధర (పిటిఆర్), గరిష్ఠ రిటైల్ ధర (ఎంఆర్‌పి) మధ్య 1000 శాతానికి పైగా వ్యత్యాసం చూసి కేసు చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆసుపత్రి ఫార్మసీకి రూ.2,700లకు సరఫరా చేసిన క్యాన్సర్ నిరోధక ఇంజెక్షన్ ఎంఆర్‌పి ధర రూ.27,000గా విక్రయించటంపై విస్మయం వ్యక్తం చేశారు. ఇది పట్టపగలే బరితెగించిన దోపిడి, మారణహోమమనే తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఔషధ తయారీదారుడు పంపిణీ దారునికి ఒక సీసాను సరఫరా చేసే ధర (పిటిఆర్)కు, ప్యాకింగ్‌పై ముద్రించిన ఎంఆర్‌పికి మధ్య అధిక తేడాను కోర్టు గుర్తించింది. అంటే 900శాతం లాభాలు ఆసుపత్రి నెట్‌వర్క్‌లకు, సరఫరా గొలుసుల మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్తున్నాయి. ఫలితంగా చౌక ఔషధాలకు బదులు నిర్దిష్ట బ్రాండ్‌ను మాత్రమే రాసేలా ప్రోత్సహిస్తోంది. దీనిని సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించటంతో కేంద్ర ప్రభుత్వం ధరల తగ్గింపు నిర్ణయాన్ని వెల్లడించింది. విదేశీ కంపెనీల పేటెంట్ ఉన్న 155 క్యాన్సర్ ఔషధాలకు 30శాతం పరిమితి వర్తించదు, కాబట్టి వాటి ధరలు తగ్గవు. కంపెనీలు తయారు చేసే ఒక్కో ఇంజెక్షన్ ధర రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. వీటిని తగ్గించాలంటే, ఆ విదేశీ కంపెనీ ఔషధాలను భారత కంపెనీలతో తక్కువ ధరకు ఉత్పత్తి చేయించేలా చట్టాన్ని తీసుకురావడమే విరుగుడు.

భారీ లాభాలకు అలవాటు పడిన కంపెనీలు, బడా కార్పొరేట్ ఆసుపత్రులు చట్టంలో లొసుగులను తీసుకొని క్యాన్సర్ మందుల ధరపై 30 శాతం పరిమితిని కూడా అధిగమించే ప్రయత్నాలు చేయకమానరు. కర్నాటక ప్రభుత్వం ఇటీవల నవంబర్ 1వ తేదీ లోగా అన్ని ఆసుపత్రులు మందులు సేకరించిన వాస్తవ ధర, ఎంఆర్‌పి ధరలను తెలియజేయాలని సర్క్యులర్ జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా కర్నాటక ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌ల సంఘం, కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యులు హైకోర్టును ఆశ్రయించటమే ధరల తగ్గింపు నిర్ణయం అమలుకు సవాలు విసురుతోంది.

సుప్రీం కోర్టు మరో విషయం కూడా అడిగింది. ఈ తగ్గింపు కేవలం క్యాన్సర్‌కే ఎందుకు పరిమితం చేయాలి, ఇతర ఔషధాలకు ఎందుకు కాదు? అనే ప్రశ్న వేయడం సబబే. సాధారణ సెలైన్ బాటిల్ తయారీకి రూ.11ఖర్చవుతుంటే, దానిని రూ.270కి విక్రయించటం ఆశ్చర్యం కలిగించకమానదు.

నిజానికి ఇది కేవలం ఔషధాల ధరకు మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. మొత్తం వైద్య వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. గడిచిన రెండు దశాబ్దాలుగా కార్పొరేట్ సంస్థలు వైద్య రంగంలో విస్తరిస్తున్నవి. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు, సరిపడ వైద్యులు, సిబ్బంది లేమితో సామాన్యులు ప్రైవేటు ఆసుపత్రులకే క్యూ కడుతున్నారు.

స్వాతంత్య్రం వచ్చి 8 దశాబ్దాలవుతున్నా ప్రభుత్వ వైద్యరంగానికి కేవలం జిడిపిలో 1.8శాతం నిధులను మాత్రమే కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తోంది. ఇది 2025 నాటికి జిడిపిలో 2.5 శాతానికి పెరగాలన్నది జాతీయ ఆరోగ్య విధానం లక్ష్యం. అలాగే అంతర్జాతీయంగా వైద్య, ఆరోగ్య రంగానికి సగటున జిడిపిలో 6 శాతం కేటాయించాలి. దానికి మనం ఎంతో దూరంలో ఉన్నాం. ఔషధాల తయారీలో ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి, ప్రోత్సహించాలి. ప్రభుత్వ ఆసుపత్రులను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టపరచాలి. కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల ఫీజులపై అవినీతికి తావులేని బలమైన నియంత్రణ, నిఘా ఏర్పాటు చేస్తేనే మార్పు సాధ్యం. ఇదంతా చేయాలంటే ప్రభుత్వాలకు చిత్త శుద్ధి అవసరం. మొత్తానికి న్యాయస్థానాల చొరవతో క్యాన్సర్ ఔషధాల ధరలు తగ్గనుండడం ఎంతోమందికి ఊరట కలిగిస్తుంది. ఇది ఇతర ప్రాణ రక్షక ఔషధాలకూ విస్తరించాలి. సంబంధిత అథారిటీ దీనిపై దృష్టి సారించాలి. ●

# గంభీరమైన రాజ్యాంగ ప్రశ్నలను లేవనెత్తుతున్న 'సర్' తీర్పు



బిశ్వజిత్ భట్టాచార్య
సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్

ఓటర్ల జాబితాలలో పేర్లను చేర్చడానికి లేదా తొలగించడానికి పౌరసత్వంపై 'పరిమిత' విచారణ చేపట్టే అధికారాన్ని భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐ) కల్పిస్తూ 2026 మే 27న 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)' పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో పొరపాటు జరిగిందా?

రెండవది, ఒకసారి ఖరారైన ఓటర్ల జాబితాలను తర్వాతి ఎన్నికల సమయంలో కేవలం అనుమానాల ఆధారంగా పేర్లను తొలగించడం ద్వారా మార్చి వేయవచ్చా?

ఈ ప్రశ్నలు బిహార్‌లో 2025 జనవరి 6న ప్రచురించిన ఓటర్ల జాబితాల నేపథ్యంలో తలెత్తాయి. ఇవి ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ సమ్మరీ రివిజన్' (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ తర్వాత తలెత్తాయి.

ఎన్నికల సంఘం 2025 జూన్ 24న బిహార్‌తో మొదలుపెట్టి, కొత్తగా ఎస్ఐఆర్ చేపట్టాలని నిర్ణయించింది. దీంతో 2003 జనవరి 1 (బిహార్‌లో చివరిసారిగా ఎస్ఐఆర్ చేపట్టిన తేదీ) నుంచి 2025 జనవరి 6వ తేదీ (చివరి ఎస్ఎస్ఆర్ తేదీ) వరకు ఉన్న బిహార్ ఓటరు జాబితాలన్నింటినీ ఎన్నికల సంఘం ఒక రకంగా ప్రశ్నార్థకం చేసినట్లయింది. ఇది అనవసరమైన చర్య. ఎందుకంటే ఎన్నికల సంఘం సాధారణంగా నిర్ణీత సమయంలో ఓటరు జాబితాలను సమర్థవంతంగా తాజాపరుస్తూ(అప్‌డేట్) ఉంటుంది.

ఈ అసాధారణ ప్రక్రియ 2003 నుండి 2025 మధ్య బిహార్‌లో జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఉపయోగించిన ఓటరు జాబితాల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసింది. ఫలితంగా, బిహార్‌లో 2025 జనవరి 6 నాటి ఎస్ఎస్ఆర్ స్థానంలో 2025 జూన్ 24న ఆదేశించిన ఎస్ఐఆర్ అమలులోకి వచ్చింది. 2025 జూన్ 24 నాటి ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను కోర్టులో సవాలు చేశారు. అయితే, ఈ సవాలు విఫలమైంది. 2026 మే 27న ఇచ్చిన తీర్పులో కోర్టు ఎన్నికల సంఘం తీసుకున్న వైఖరినే సమర్థించింది.

కోర్టు 2026 మే 27న తీర్పు ఇవ్వకముందే, బిహార్‌లో నవంబర్ 2025లో, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడటం, మరికొందరి పేర్లు ఆశ్చర్యకరంగా చేర్చటం వంటివి జరిగాయి. దీని కారణంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. నిరసనల మధ్య ఇతర రాష్ట్రాల్లో ఇప్పుడు ఎస్ఐఆర్ అమలు చేయబడుతోంది.

### ఇసిఐ అధికారాలు

'కచ్చితమైన అర్థం'లో పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం ఇసిఐకి లేదని కోర్టు తన తీర్పులో వివరణ ఇచ్చింది. ఇసిఐ అధికారం 'ఒక వ్యక్తిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఉన్న అర్హతకు' సంబంధించినదని కోర్టు పేర్కొంది. అదే సందర్భంలో ' ఇది ఒక వ్యక్తికి ఉన్న పౌరసత్వ హక్కులను తొలగించలేదు, అలాగే పౌరసత్వ చట్టం కింద సంబంధిత అధికార వర్గాల ద్వారా ఆ ప్రశ్నపై నిర్ణయాన్ని నిరోధించలేదు' అని కూడా పేర్కొంది.

పౌరసత్వ విచారణ సందర్భంలో కోర్టు ఉపయోగించిన 'పరిమిత', 'కఠినమైన అర్థం' అనే పదాలకు, కోర్టు అప్రస్తుత వ్యాఖ్యలుగా కూడా ఎటువంటి చట్టపరమైన ప్రాముఖ్యత లేదని గౌరవపూర్వంగా మనవి చేసుకుంటున్నాను. 'ఇసిఐ అధికారం' ఒక 'వ్యక్తిని ఓటర్ల జాబితాలో చేర్చే హక్కును' 'ప్రభావితం చేస్తుంది' అనే ప్రకటనకు, ఇప్పటికే ఉన్న ఓటరు ఓటు హక్కును రద్దు చేసే అధికారం ఇసిఐకి ఉంది అనే అర్థం తప్ప మరోలా వ్యాఖ్యానించడానికి ఆస్కారం లేదు.

ఇది ఇసిఐకి సంపూర్ణ స్వేచ్ఛను ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది. అందుకే, ఇసిఐ ఇప్పటికే ఉన్న ఓటర్ల జాబితాలను నిరాటంకంగా మార్చడానికి పూనుకోవడంలో ఆశ్చర్యం లేదు. విచారణ అంటే విచారణే. పౌరసత్వం అంటే పౌరసత్వమే. పౌరసత్వంపై విచారణ జరిపేందుకు ఇసిఐకి ఉన్న రాజ్యాంగబద్ధమైన అధికారం వివాదాస్పదంగానే మిగిలిపోయింది. పరిమితమైన విచారణ కూడా ఇసిఐ ఎన్నికల విధి విధానాలను అతిక్రమించే ప్రమాదం ఉంది. కోర్టు పొరపాటు చేసినట్లుగా కనపడుతోంది.

అయితే, కోర్టు తీర్పులోని 158వ పేరాలో ఇతర విషయాలతో పాటు ఇలా పేర్కొనబడింది. ''పాస్‌పోర్ట్ లేదా జనన ధ్రువీకరణ పత్రంవలె కాకుండా, రేషన్ కార్డు పౌరసత్వానికి కచ్చితమైన రుజువు కాదని గమనించడం సందర్భోచితం''. ఈ విధంగా, పాస్‌పోర్ట్ లేదా జనన ధృవీకరణ పత్రం పౌరసత్వానికి కచ్చితమైన రుజువు అని కోర్టు తీర్పు ఇచ్చింది.

2026 జూన్ 24న పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా జరిగిన పత్రికా సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాస్‌పోర్ట్ కేవలం ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, భారత పౌరసత్వానికి రుజువు కాదని వివాదాస్పద ప్రకటన చేయడానికి ఇదే కారణమా?

కోర్టు తన అధికార పరిధిని ఉపయోగించి, భారత పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలను నిర్దిష్టంగా పేర్కొనజాలదా? లేదా, భారత పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలను నిర్దిష్టంగా పేర్కొనమని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు మాండమస్ రిట్ జారీ చేయజాలదా?

కోర్టు ఈ రెండింటిలో ఏదీ చేయలేదు. తద్వారా ఇసిఐ చేత పౌరసత్వం ప్రశ్నించబడిన ప్రతి భారత పౌరుడి ఆశలను వమ్ము చేసింది.




ఓటర్ల జాబితాను తయారుచేసేటప్పుడు, అందులో చేర్చబడిన ప్రతి వ్యక్తి వయోజన భారత పౌరుడేనని నిర్ధారించుకోవడం వరకే ఇసిఐ విధి పరిమితం.

కనీస వయస్సు (18 సంవత్సరాలు)ను, భారత పౌరసత్వాన్ని పత్రాల ద్వారా నిర్ధారించుకోవాలి. ఇసిఐ పాత్ర కేవలం పరిపాలనాపరమైనది. పౌరసత్వంపై పరిమితమైన లేదా మరేదైనా విచారణ జరిపే అధికారం దానికి లేదు. అయితే, ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వాన్ని కచ్చితంగా నిరూపించేదిగా లేకపోవడంతో సమస్య తలెత్తుతుంది.

మరో మాటలో చెప్పాలంటే, అనుమానాస్పద భారత పౌరసత్వం కారణంగా ఇప్పటికే ఉన్న ఓటర్ల జాబితా నుండి ఒక పేరును తొలగించేందుకు, కోర్టు ఇసిఐకి అనియంత్రిత విచక్షణాధికారాన్ని కల్పించిం ది. దీని ప్రకారం, 2025 జనవరి 6వ తేదీ నాటికి ఓటర్ల జాబితాలో అప్పటికే పేరు ఉండి, భారత పౌరుడిగా భావించబడే ఒక పౌరుడి ఓటు హక్కును, 2025 జూలై 1 తేదీ నుండి అమలులోకి వచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఇసిఐ తొలగిస్తున్నది.

### పత్రాలు, పౌరసత్వం, తొలగింపు

భారత పౌరసత్వానికి రుజువుగా ఉపయోగపడే ఏ ఒక్క పత్రాన్ని కూడా కోర్టు తన తీర్పులో పేర్కొనలేదు.

ఒక వ్యక్తి తన భారత పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలి? ఈ ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లభించలేదు. అయినప్పటికీ, కేవలం వారి భారత పౌరసత్వంపై సందేహాలున్నాయన్న కారణంతో, గత ఎన్నికలలో ఇప్పటికే ఓటు వేసిన వ్యక్తిని ఇసిఐ ఓటు హక్కు లేకుండా చేయగలదు.

1950 జనవరి 26 నుండి భారతదేశంలో ఓటర్ల జాబితాలను ఏ ప్రాతిపదికన తయారు చేస్తున్నారు? ముగిసిపోయిన ఎన్నికలలో వినియోగించిన ఓటర్ల జాబితాను కేవలం అనుమానం అనే కారణంతో ఎలా మార్చగలరు? గత ఎన్నికలలో ఓటు వేసిన తర్వాత ఒక వ్యక్తిని ఓటు హక్కు లేకుండా ఎలా చేయగలరు? ఇప్పటికే ఓటు హక్కు ఉన్న ఓటరును రద్దు చేయడానికి రాజ్యాంగ ప్రమాణం ఏమిటి? ఇవి న్యాయస్థానం పరిగణించి ఉండాల్సిన ప్రశ్నలు. ఆర్టికల్ 32 (రాజ్యాంగ ఉపశమన హక్కు, ప్రాథమిక హక్కుల అమలు కోసం రిట్లను జారీ చేసే కోర్టు అధికారం), ఆర్టికల్ 141 (భారతదేశంలోని అన్ని కోర్టులపై సుప్రీం కోర్టు ప్రకటించిన చట్టానికి కట్టుబడే తత్వం), ఆర్టికల్ 142 (దాని ముందు పెండింగ్‌లో ఉన్న ఏదైనా కేసు లేదా విషయంలో సంపూర్ణ న్యాయం చేయడానికి అవసరమైన ఉత్తర్వులను జారీ చేసే అధికారం), ఆర్టికల్ 144 (కోర్టుకు సహాయంగా వ్యవహరించాల్సిన భారతదేశంలోని అన్ని పౌర, న్యాయ అధికారుల బాధ్యత) కింద సుప్రీం కోర్టు అధికారాలు విస్తృతమైనవి. భారత పౌరసత్వాన్ని నిర్ధారించడానికి ఒక కొలమానాన్ని స్పష్టంగా నిర్దేశించడం ద్వారా కోర్టు ఈ చట్టపరమైన శూన్యతను కచ్చితంగా సరిదిద్దవచ్చు.

ఓటర్ల జాబితాలో చేర్చబడేందుకు వయోజనత్వం, భారత పౌరసత్వం అనే రెండు అర్హతలు మాత్రమే అవసరం. రాజ్యాంగం మూడవ తప్పనిసరి అర్హతను నిర్దేశించలేదు.అర్హతగల ఓటర్లను గుర్తించిన తర్వాత మాత్రమే అనర్హత ప్రశ్న తలెత్తుతుంది. ఇతరత్రా అనర్హత ఉన్న వ్యక్తిని మాత్రమే అనర్హుడిగా ప్రకటించవచ్చు.

ఆర్టికల్ 326 అనర్హతకు గల కారణాలను ఈ విధంగా నిర్దేశించింది. నివాసం లేకపోవడం, మానసిక అస్థిరత, నేరం, లేదా అవినీతి లేదా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326కు అనుగుణంగా ప్రజా ప్రాతినిధ్య చట్టం – 1950, ఓటర్ల నమోదు నియమావళి–1960, ఉండాలి. అర్హత కలిగిన ఓటరును అనర్హుడిగా ప్రకటించేటప్పుడు, సహజ న్యాయ సూత్రాలను కూడా తప్పనిసరిగా పాటించాలి.నిర్ణయానికి ముందు విచారణ జరపకుండా, అర్హత కలిగిన ఓటరు పేరును ఓటర్ల జాబితా నుండి తొలగించడం కుదరదు.

### ఓటు హక్కు పరిరక్షణ

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగం. ఈ పునాది, నిర్మాణం బలహీనపడితే, ప్రపంచ శక్తిగా ఎదగాలన్న భారతదేశ సామర్థ్యాన్ని సాకారం చేసుకోలేము. ఒక భారత పౌరుడు తన ఓటు హక్కు విషయంలో సందిగ్ధంలో ఉంటే, అటువంటి పౌరుడి నుండి మనం ఉత్తమ ఫలితాలను ఎలా ఆశించగలం?

ఓటు హక్కును సాధారణంగా చట్టబద్ధమైన హక్కుగా పరిగణించినప్పటికీ, దాని వినియోగం ప్రజాప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల పట్ల రాజ్యాంగ నిబద్ధతకు కేంద్రబిందువు. ఐ.సి. గోలక్‌నాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ (1967), కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973), ఇందిరా నెహ్రూ గాంధీ వర్సెస్ రాజ్ నారాయణ్ (1975) కేసులలో కోర్టు ఇచ్చిన తీర్పుల నుండి ఇది రూపాంతరం చెందింది, నేటికీ ప్రాధాన్యతను కలిగి ఉంది. ఈ రచయిత వ్యాఖ్యానం ప్రకారం, ఈ మూడు తీర్పులను కలిపి చదివినప్పుడు, అవి ఓటు హక్కును భారత రాజ్యాంగంలోని ఒక మౌలిక లక్షణంగా నిస్సందేహంగా ఉన్నత స్థాయికి తీసుకువెళ్తాయి.రాజ్యాంగాన్ని సవరించే పార్లమెంటు అధికారాన్ని కూడా దాని మౌలిక స్వరూపాన్ని ధ్వంసం చేయటానికి లేదా దెబ్బతీయడానికి ఉపయోగించరాదని కేశవానంద భారతి తీర్పు స్పష్టం చేసింది.ఈ సూత్రం ప్రజాస్వామ్యంతో సహా రాజ్యాంగంలోనిముఖ్యమైన అంశాలను పరిరక్షిస్తూనే ఉంది.

మై లార్డ్స్, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సకాలంలో ఓటు వేసే హక్కును సమర్థించండి.

*(సౌజన్యం: ది హిందూ – తేదీ: 29/10/2026)*


## మొక్కలతో ప్లాస్టిక్ సృష్టి!

ప్రపంచవ్యాప్తంగా మైక్రోప్లాస్టిక్స్ సమస్య వేగంగా తీవ్రమవుతోంది. ఐక్యరాజ్య సమితి చేపట్టిన పర్యావరణ పరిరక్షణ విభాగం విడుదల చేసిన తాజా నివేదికను అనుసరించి 2020లోనే సుమారు 2.7 మిలియన్ టన్నుల మైక్రోప్లాస్టిక్స్ పర్యావరణంలోకి విడుదలయ్యాయి. 2040 నాటికి ఈ పరిమాణం రెట్టింపు కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి సముద్రాలలోనే కాదు, నేలలో, గాలిలో, తాగునీటిలో, ఆహార పదార్థాల్లోనూ కనిపించాయి. కొన్ని అధ్యయనాలు మానవ మెదడులో కూడా మైక్రోప్లాస్టిక్స్ ఆనవాళ్లు కనుగొనడం ఆందోళన కలిగిస్తోంది. ప్లాస్టిక్ విభిన్న వినియోగాలకు అనుకూలంగా ఉండడం వల్ల విస్తృతంగా ఉపయోగంలో ఉంది. అయితే ఇదే లక్షణాలు దాని పర్యావరణ హానిని పెంచుతున్నాయి. ఒక ప్లాస్టిక్ వస్తువు పూర్తిగా క్షీణించడానికి 20 నుండి 500 సంవత్సరాల వరకు పట్టవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన కొత్త ప్లాంట్‌బేస్డ్ ప్లాస్టిక్ గమనార్హమైన పురోగతి. రికెట్ సెంటర్ ఫర్ ఎనర్జీ మ్యాటర్ సైన్స్, యూనివర్సిటీ ఆఫ్ టోక్యో పరిశోధకులు కలసి సెల్యులోజ్ ఆధారిత పదార్థంతో ఈ కొత్త ప్లాస్టిక్‌ను రూపొందించారు. ప్రయోగశాల పరీక్షల్లో ఈ పదార్థం సముద్రజలంలో కలిపిన తర్వాత సుమారు ఒక గంటలోనే పూర్తిగా కరిగిపోయింది.




సాధారణ వినియోగంలో ఇది బలంగా ఉండి, ఉప్పునీటిని ఉద్దేశపూర్వకంగా పరిచయం చేసినప్పుడు మాత్రమే విచ్ఛిన్నమవుతుంది. ఈ పరిశోధన ఫలితాలు 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కెమికల్ సొసైటీ'లో ప్రచురితమయ్యాయి. పరిశోధన బృందానికి టకుజో ఐడా నాయకత్వం వహించారు. సెల్యులోజ్‌ను ఫుడ్ పల్ప్ నుండి తయారు చేసి, పాలిఎథిలీన్‌ఇమైన్ గ్వానిడినియం అయాన్లతో కలిపారు. వ్యతిరేక విద్యుత్ ఛార్జ్‌ల ఆకర్షణ వల్ల బలమైన ఐయానిక్ నెట్‌వర్క్ ఏర్పడింది. ఆపై చోలిన్ క్లోరైడ్ అనే ఆహారసురక్షిత యాజకాన్ని చేర్చడం ద్వారా పదార్థానికి లవచికత, దృఢత్వం పెంచారు. ప్రకృతిలో ప్రతి సంవత్సరం సుమారు 100 బిలియన్ టన్నుల సెల్యులోజ్ ఉత్పత్తి అవుతుందని అంచనా.

# ఇందిరమ్మ ఆశయాలే ప్రజాపాలనకు మార్గదర్శకం





● పేదల సంక్షేమమే ఆమెకు నిజమైన నివాళి : కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సమైక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసి, దేశం కోసమే ప్రాణత్యాగం చేసిన మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న ఇందిరాగాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. శనివారం ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీ లోని శక్తిస్థల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఇందిరా గాంధీకి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, టిపిసిసి ఉపాధ్యక్షులు కుమార్ రావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యురాలు భవానీరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 31 దేశ చరిత్రలో నిలిచిపోయే రోజని, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను స్మరించుకునే సందర్భమని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ దేశ నిర్మాణానికి అందించిన సేవలను గుర్తుచేశారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని, బ్యాంకుల జాతీయీకరణ ద్వారా పేదలకు ఆర్థిక అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. హరిత విప్లవానికి బాటలు వేసి దేశాన్ని వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి దిశగా నడిపించిన మహానేతగా ఆమెను అభివర్ణించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరాగాంధీ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని మధుయాష్కీ పేర్కొన్నారు.

**మంత్రులు నివాళి :**
సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా ఆమె వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. దేశ అభివృద్ధితోపాటు పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఇందిరా గాంధీ విశేష ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ కొనసాగిస్తున్న ప్రజాపాలనకు ఆమె ఆశయాలే స్ఫూర్తి అని తెలిపారు. ఇందిరాగాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఇందిరాగాంధీ విగ్రహానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ తొలి మహిళా ప్రధానిగా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం ఆమె చూపిన నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# సిపిఐ నేత మేకల రవికి కన్నీటి వీడ్కోలు

● నివాళులు అర్పించిన కూనంనేని, తక్కళ్లపల్లి, ఈటి నర్సింహ, ఎమ్మెల్యే నాయిని
● రవి మృతి సిపిఐకి తీరని లోటు : కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/వరంగల్ :** సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవికి శనివారం వరంగల్ నగరంలో కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం మేకల రవి అనారోగ్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందగా శనివారం వరంగల్‌లో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. వరంగల్ నగరంలోని శివనగర్‌లో గల మేకల రవి స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయాన్ని ఉంచగా వందలాది మంది ప్రజలు, సిపిఐ కార్యకర్తలు తరలి వచ్చి నివాళులు అర్పించారు. అంత్యక్రియల సందర్భంగా దారి పొడవునా 'మేకల రవి అమర్ రహే.. మేకల రవి ఆశయాలను కొనసాగిస్తాం' అంటూ నినాదాలు చేశారు. మేకల రవి మృతి వార్త తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు వరంగల్ శివనగర్‌కు చేరుకుని రవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రవి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో సిపిఐ వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు ఎస్‌కే బాషామియా, కర్రె భిక్షపతి, బి. విజయసారథి, సిహెచ్.రాజారెడ్డి, కొరిమి రాజ్ కుమార్, మంద పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి.వెంకట్రాములు, తమ్మెర విశ్వేశ్వరరావు, మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

**మేకల రవి మృతి సిపిఐకి తీరని లోటు : కూనంనేని సాంబశివరావు**
సిపిఐ నాయకులు మేకల రవి అకాల మృతి ప్రజారంగానికి పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మేకల రవి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ మేకల రవి జీవితాంతం పేదల సంక్షేమం, కార్మికుల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే శ్రమించారని అన్నారు. ఆయన ఆశయాలు, చూపిన బాట ఎప్పటికీ ఆదర్శనీయమైనవని, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి కుటుంబానికి సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

**నివాళులు అర్పించిన వివిధ పార్టీల నాయకులు**
వరంగల్ శివనగర్‌లోని మేకల రవి స్వగృహం వద్ద ఆయన భౌతికకాయాన్ని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. సిపిఎం నాయకులు ఎస్. వాసుదేవ రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్ రంగయ్య, రత్నమాల, ఎంసిపిఐ(యూ) నాయకులు ఎన్ రెడ్డి హంసారెడ్డి, పెద్దారపు రమేష్, గడ్డం నాగార్జున, బీఆర్‌ఎస్ నాయకులు జన్ను జకార్య, కాంగ్రెస్ నాయకులు పెరుమాండ్ల రామకృష్ణ, ఎమ్మార్పిఎస్ నాయకులు మంద కుమార్ మాదిగ, డిబిఎఫ్ కార్యదర్శి చుంచు రాజేందర్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# మియాపూర్ ప్రభుత్వ భూములు గద్దలపాలు కాకుండా కాపాడాలి



● పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
● సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్/మియాపూర్:** సర్వే నంబర్లు 100, 101తో పాటు ఇతర సర్వే నంబర్లలో ఉన్న సుమారు 500 ఎకరాల ప్రభుత్వ భూములు గద్దలపాలు కాకుండా ప్రభుత్వం కాపాడాలని, ఆ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, టి.రామకృష్ణ, శేరిలింగంపల్లి మండల కార్యదర్శి చందు యాదవ్, వెంకట్ స్వామి తదితర నాయకులతో కలిసి మియాపూర్‌లోని ప్రభుత్వ భూములను నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా ఈ భూములకు సంబంధించి న్యాయస్థానాల్లో అనేక చర్చలు, వివాదాలు కొనసాగాయని తెలిపారు. 34 సంవత్సరాల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా, ఏ ప్రభుత్వం కూడా ఈ భూములపై తమ హక్కును క్లెయిమ్ చేసుకునేందుకు ప్రయత్నించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఈ భూములు ప్రభుత్వానికి చెందినవని తీర్పు ఇచ్చిన అనంతరం గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పోటీపడి ప్రెస్ మీట్లు నిర్వహిస్తూ తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. మిగిలిన వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించి హక్కు పత్రాలు అందించాలని నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఈ భూములను కేటాయించకపోతే, సిపిఐ ఆధ్వర్యంలో పేదలకు గుడిసెలు వేయించి భూ పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

# అటవీ సంరక్షణకు ప్రాధాన్యం

● అటవీశాఖ పనితీరుపై జయేష్ రంజన్ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంపు, అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ అధికారులకు సూచించారు. అటవీ భూముల ఆక్రమణలను అరికట్టడం, కలప అక్రమ రవాణాను నిరోధించడం, అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నియంత్రణతో పాటు మానవవన్యప్రాణుల సంఘర్షణలను తగ్గించే చర్యలను మరింత సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా అటవీశాఖ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, పిసిసిఎఫ్ (హెచ్‌ఒఎఫ్‌ఎఫ్) వినయ్ కుమార్‌తో కలిసి శాఖ పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణ, ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై చర్చించారు. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంపు, క్షీణించిన అడవుల పునరుద్ధరణ, వనమహోత్సవం ద్వారా మొక్కల పెంపకం, అటవీ భూముల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో పర్యావరణ సున్నిత మండలి (ఈఎస్‌జెడ్) నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని కూడా వివరించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.16.48 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన డీఈటీ పథకం ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సాగు ద్వారా ఉత్పత్తి చేసిన ఎర్రచందనం కలప ఎగుమతికి 280 మెట్రిక్ టన్నుల కోటా కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అటవీ సిబ్బందికి అవసరమైన వాహనాల కొనుగోలు, ఆయుధాల సమకూర్పు, 20 అటవీ స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి సుమారు రూ.65 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. అటవీ సంరక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన వసతులు, ప్రభుత్వ సహకారం అందాల్సిన అంశాలను జయేష్ రంజన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమీక్షలో అధికారులు రత్నాకర్ జౌహరి, శరవణన్, డాక్టర్ ప్రియాంక వర్గీస్, డాక్టర్ ఎస్.జె.ఆశ, సిఎఫ్‌లు ప్రసాద్, సునీల్ హెరామత్, ప్రదీప్ శెట్టి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన విద్యాసాగర్‌రెడ్డి అంత్యక్రియలు

● సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పరామర్శ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లాకు చెందిన ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకుడు, బత్తాయి రైతు సంఘం నాయకుడు, సిపిఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డికి బావమరిది అయిన చిలుక విద్యాసాగర్ రెడ్డి గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన అక్క, బావ, కుమార్తె, కుమారుడు విదేశాల్లో ఉండటంతో వారు పట్టణానికి చేరుకున్న అనంతరం శనివారం నల్లగొండ పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ఆయన నివాసంలో సందర్శనార్థం ఉంచిన పార్థివదేహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లేపల్లి ఆదిరెడ్డిలు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నరసింహారెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కె.ఎస్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు ముద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, సయ్యద్ హాషం, సలీం, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు మాదగోని శ్రీనివాస్ గౌడ్, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కడారి ప్రభాకర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారింగు బిక్షమయ్య గౌడ్, కోశాధికారి విజయలక్ష్మి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పర్తి యాదయ్య, శాంతి సంఘం జిల్లా నాయకులు కట్టా వెంకట్ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, జిల్లా యాదయ్య, శ్యామల, నాగసేనారెడ్డి, మాజీ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు బరిగెల వెంకటేష్, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం

● ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవంలో జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి.యూసుఫ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి.యూసుఫ్ పిలుపునిచ్చారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భావప్రకటనా స్వేచ్ఛ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ, బహుళ సంస్కృతులు, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే హక్కులతో పాటు కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఎఐటియుసి సీనియర్ నాయకుడు వివిఎస్.బోస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేస్తూ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. వీటిని వ్యతిరేకిస్తూ యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు కనీస వేతనాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే కార్మిక వర్గం పెద్దఎత్తున ఉద్యమించాలని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశం మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం, సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఎఐటియుసి అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూ విజయాలు సాధిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని, రాష్ట్ర కోశాధికారి కమతం యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి హసీనా బేగం, ఉపాధ్యక్షుడు మారగోని ప్రవీణ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి కిషన్, రాష్ట్ర నాయకురాలు ఎన్.కరుణకుమారి, నాయకులు భాస్కరాచారి, ఎ.పార్వతి, పి.నళిని, సబ్బు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ పాటలు ఆలపించారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 33/DB/EE-II/ Bowenpally Circle/ MMC/2026-27, తేది: 30.10.2026 | 1. 2026 - ఎంఎంసి దీపావళి దృష్ట్యా బోయిన్‌పల్లి సర్కిల్-03లోని వివిధ స్మశానవాటికలలో జంగిల్‌ని తొలగించి, శిథిలాలను తీసివేయడానికి ఏర్పాట్లు, - 4 పనులు | రూ. 7.22 లక్షలు | 31.10.2026 సా.04.00 గం.లకు | 03.11.2026 సా.04.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.
DIPR R.O. No. : 12852-PP/CL/ADVT/2026-27, Date: 31-10-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**కూకట్‌పల్లి సర్కిల్-52**
Lr.No: 21/CMC/KPC-52/RR/2026-27 తేది: 31.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 21/CMC/ KPC-52/ RR/2026-27, తేది: 31.10.2026 | సిఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-52లో అభివృద్ధి పనులు | రూ. 364.10 లక్షలు | 03.11.2026 మ.01.00గం.ల నుండి, 10.11.2026 మ.02.00గం.ల వరకు | శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-52, సెల్: 8897507674 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-52, సిఎంసి.
DIPR R.O. No. : 12913-PP/CL/ADVT/2026-27, Date: 31-10-2026

# ముంపు సమస్యకు పరిష్కారాలు చూపండి

● మహారాష్ట్ర అభ్యంతరాలపై రాజీ మార్గం అన్వేషించాలి
● మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు పరిష్కారం చూపుతూ, ప్రాజెక్టు సాగునీటి లక్ష్యాలకు విఘాతం కలగకుండా ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ మార్గాలను అన్వేషించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముంపు, పర్యావరణ సమస్యలను సాకుగా చూపి ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతినకుండా, సాంకేతికంగా సాధ్యమైన మార్పులతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల జరిగిన చర్చల నేపథ్యంలో శనివారం తన క్యాంపు కార్యాలయంలో తుమ్మిడిహట్టి బ్యారేజీ ప్రతిపాదిత అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ జలాశయ నీటిమట్టాల వద్ద తెలంగాణ, మహారాష్ట్రల్లో ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణాన్ని కచ్చితంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. నదీగర్భ ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత మండలాలు, సంరక్షిత కోర్ ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను గుర్తిస్తూ సమగ్ర పటాలు రూపొందించాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా మహారాష్ట్ర అభ్యంతరాలకు ఆచరణాత్మక పరిష్కారాలు రూపొందించాలని స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ పూర్తిస్థాయి జలాశయ నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్)ను ప్రస్తుత ప్రతిపాదిత 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచేందుకు గాను అక్టోబర్ 26న ముంబయిలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో జరిపిన సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించారు. సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో అనుసంధానమైన సమగ్ర వ్యవస్థ ద్వారా 77 టిఎంసీల నీటిని మళ్లించి, 7 జిల్లాల్లోని 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర అభ్యంతరాలైన, ముంపు విస్తీర్ణం, ప్రభావిత భూములు, పునరావాస అవసరాలపై సమగ్ర అధ్యయనం చేసి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని మంత్రి సూచించారు.ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఒ.వి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

# ఎపిలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణా ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నోటిఫై చేయగా, వీటిలో ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలను మినహాయించి, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కలిపి మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థల్లో ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 3,942 వార్డులకు గాను 756 వార్డుల్లో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్లలో 118 మంది, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 638 మంది వార్డు సభ్యులతోపాటు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 17 మంది చైర్ పర్సన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 13 మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవులకు 153 మంది అభ్యర్థులు పోటీపడుతుండగా, 70 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ పదవులకు 367 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. అలాగే కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,073 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు కలిపి మొత్తంగా 9,642 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆయా స్థానాల్లో ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడికి తావులేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

**దాదాపు 75వేల మంది పోలింగ్ సిబ్బంది నియామకం**
ఎన్నికల నిర్వహణ కోసం వివిధ స్థాయిల్లో దాదాపు 75వేల మంది సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ వివరించారు. వీరిలో ఆర్‌ఓలు (రిటర్నింగ్ అధికారులు) : 1,449 మంది, ఏఆర్‌ఓలు 2,543 మంది, ప్రిసైడింగ్ అధికారులు 13,504 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 13,504 మంది, ఇతర పోలింగ్ అధికారులు 51,716 మంది, మైక్రో అబ్జర్వర్లు: 3,720 మంది, వెబ్‌కాస్టింగ్ సిబ్బంది 1,835 మందిని నియమించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు.

**వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము, హైదరాబాద్.**
నెం.వ్య.మా.క./హై /Tenders/RBZ/2026-27 **టెండర్ నోటీసు** తేది: 31/10/2026
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, పరిధిలో ఎర్రగడ్డ, మెహిదీపట్నం, ఫలక్‌నుమ రైతు బజార్ల యందు ఒక్క సంవత్సరం కాల వ్యవధికి గాను ఈ దిగువ తెలిపిన పనుల నిర్వహణకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్రమ. సంఖ్య | టెండరు పేరు | టెండరు షెడ్యూలు ధర రూ. | ధరావత్తు (EMD) రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది మరియు సమయము | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది మరియు సమయము | టెండరు తెరువబడు తేదీ మరియు సమయము |
|---|---|---|---|---|---|---|
| 1. | ఫలక్ నుమా రైతు బజార్ : 1) క్యాంటిన్ నిర్వహణ | Rs.2,000/- | 20,000/- | 03-11-2026 మరియు 04-11-2026 ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు | 06-11-2026 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 06-11-2026 రోజున మధ్యాహ్నం 12.30 గంటల వరకు |
| 2. | 2) వాహనముల పార్కింగ్ | Rs.2,000/- | 50,000/- | | | |
| 3. | 3) టాయిలెట్ బ్లాక్ | Rs.2,000/- | 20,000/- | | | |
| 4. | ఎర్రగడ్డ రైతు బజార్ : 1) క్యాంటిన్ నిర్వహణ | Rs.2,000/- | Rs.20,000/- | | | |
| 5. | 2) చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియు చెత్తను బయటకు తరలించుటకు గాను | Rs.2,000/- | Rs.50,000/- | | | |
| 6. | మెహిదిపట్నం రైతు బజార్ : 1) చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియు చెత్తను బయటకు తరలించుటకు గాను | Rs.2,000/- | Rs.50,000/- | | | |

నిబంధనలు:-
1. పై తేలిపిన టెండర్ షెడ్యూలు కొరకు GST రిజిస్ట్రేషన్ ఉన్న కాంట్రాక్టర్లు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు, టెండర్ ఫారం ధర మరియు టెండర్ వారిగా ధరావత్తు (EMD) బాపతు రూపాయలను డి.డి.ల రూపేనా Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad గారి పేరున తీసిన వారికి మరియు ఈ క్రింద తెలిపిన అర్హత పత్రములు సమర్పించిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూల్ ఫారం ఇవ్వబడును. DDల పై టెండర్ వేయువారి పేరున మాత్రమే ఉండవలెను, చెక్కులను తిరస్కరించబడును.
I) 1. చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుటకు గాను సొంత / లీజుకు తీసుకొనబడిన డంపింగ్ యార్డు ఉండవలెయును. దాని ధృవీకరించిన పత్రములు దరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
2. బుల్ గార్బేజ్ లిఫ్టింగ్, 200 సి.సి.టి.కి. తక్కువ కాని చెత్త తరలింపుకు రెండు వాహనములు ఉండవలెయును వాటి ఆర్.సి కాపీలు దరఖాస్తుతో పాటు జత పరచవలెను.
3. 10 మందికి తక్కువ కాకుండా లేబర్ కలిగియుండవలెను మరియు లేబర్ లైసెన్స్ కలిగి ఉండవలెను వారి యొక్క వివరాములు, ఆధార్ కార్డు Xerox copy లను దరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
II) 1. క్యాంటీన్ నిర్వహణకు FSSAI లైసెన్స్ కల్గియుండవలెను.
2. టాయిలెట్ బ్లాక్ సంబంధించి రిజిస్టర్ ఫారమ్ లేదా సొసైటీ ఫరమ్స్ మాత్రమే అనుమతించబడును.
అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు గాని చెక్కులు సమర్పించిన టెండర్ గాని, టెండర్ దారు పేరున DD లేని వాటిని తిరస్కరించబడును మరియు ఎలాంటి కారణము చూపకుండా టెండర్ రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు దినములలో ఉదయము 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, మలక్ పేట్ కార్యాలయము నందు సంప్రదించవచ్చును.
సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి (FAC) వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్
DIPR R.O. No. : 12870-PP/CL/ADVT/2026-27, Date: 31-10-2026

## తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు: ఎంపిడిఒ



ప్రజాపక్షం/అలంపూర్: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం అన్ని గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ రాఘవ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఎల్ నినో సన్నద్ధత, తాగునీటి కార్యాచరణ ప్రణాళిక, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణల పురోగతిపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని గ్రామ పంచాయతీల్లో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ సూచించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల ద్వారా ఈ సమీక్ష సమావేశంలో పం చాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

భారతీయ కిసాన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్



ప్రజాపక్షం / పానుగల్ : వనపర్తి జిల్లాలో ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారంగా ఎకరాకు 40 వేల రూపాయలను చెల్లించాలని భారతీయ కిసాన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వసంతపురం సుబ్బయ్య యాదవ్ అన్నారు. శనివారం పానుగల్ మండల పరిధిలోని దావాజీ పల్లి, అన్నారం, పానుగల్, మాధవరావుపల్లి తదితర గ్రామాలలో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా రైతులు వేసుకున్న పంట పొలాలను వారం రోజుల నుంచి భారతీయ కిసాన్ యూనియన్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నారం గ్రామంలో సుమారు 50 ఎకరాలకు పైగా, దావాజీపల్లి గ్రామంలో100 ఎకరాలలో సాగునీరు లేక ఎండిపోవడం జరిగిందన్నారు. పానుగల్లు మండల కేంద్రంలో కూడా దాదాపుగా 100 ఎకరాలు పంట ఎండిపోవడం జరిగిందన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని, పాలకులు త్వరగా స్పందించాలని, అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పానుగల్ మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు హలీం పాషా, రైతు నాయకులు గోపాల్ నాయుడు, ఎల్లస్వామి యాదవ్, రామకృష్ణ, రవి నాయుడు, బాలకృష్ణ నాయుడు, మంగదుడి శంకరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాలువలో పడి యువకుడి మృతి



ప్రజాపక్షం / ధన్వాడ : మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. లడ్డు నవీన్ (27) అనే యువకుడు ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ కృష్ణం రాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నవీన్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడని స్థానికులు తెలిపారు. నవీన్ కుటుంబానికి ఒక్కగానొక్క కొడుకు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమను చూసుకునే ఆధారం లేకుండా పోయిందంటూ రోదించిన తీరు స్థానికులను కలచివేసింది. యువకుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది?

## ఇళ్ల మధ్యలో స్మశాన వాటిక నిర్మాణ పనులు నిలిపివేయాలి

మున్సిపల్ కమిషనర్ కు కాలనీవాసుల వినతి



ప్రజాపక్షం/కల్వకుర్తి: కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ నగర్, బాలరాంనగర్ కాలనీల్లో నిర్మల విద్యాలయం పాఠశాలకు సంబంధించిన కాంపౌండ్‌లో చేపడుతున్న స్మశానవాటిక నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దట్టమైన జనాభా ఉన్న ప్రాంతంలో ఇళ్లకు సమీపంలో స్మశానవాటిక నిర్మించడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులకు మానసిక ఆందోళనతో పాటు ఆరోగ్య, పరిశుభ్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను నిలిపివేసి, ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కాలనీవాసులు పుట్ట చంద్రశేఖర్, వెంకటేశ్ గౌడ్, సాయి, గంగాధర్, మోహన్ గౌడ్, రాజశేఖర్, శివ గౌడ్, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం / మఖ్తల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మఖ్తల్ ఆజాద్ నగర్ చౌరస్తాలో బిజెపి రాష్ట్ర నాయకుడు బి. కొండయ్య సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని, బార్డోలీ సత్యాగ్రహంలో రైతుల హక్కుల కోసం పోరాడి ప్రజల నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ తొలి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహించి 560 కి పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతను విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అందుకే ఆయనను భారత ఉక్కు మనిషిగా పిలుస్తారని తెలిపారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి నేతలు కర్నె స్వామి, రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్, చిన్న క్రిష్ణయ్య, చంద్రశేఖర్, సూర్య, ఆంజనేయులు, టైలర్ నరేందర్, జనరల్ సెక్రటరీ, బ్యాటరీ రాజు, మహేష్ సాగర్, ఆంజనేయులు, కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ పికె నరసింహ, మున్సిపల్ కౌన్సిలర్, విద్యాసాగర్, అశోక్,ఆంజనేయులు, పాల ప్రవీణ్, చంద్రపూర్ లారెన్స్, రవి పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సంక్షేమానికి...
# ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్



ప్రజాపక్షం/కల్వకుర్తి: కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. శనివారం ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో గల ఓం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఆటో కార్మికుల సదస్సుకు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా పట్టణంలోని ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సమీపంలో గల ఆటోస్టాండ్ వద్ద ఎఐటియుసి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు నిత్యం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మికుల హక్కుల సాధనలో ఎఐటియుసి ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఈ సదస్సులో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శివశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల పరుశురాములు, ఆటో డ్రైవర్ సీనియర్ నాయకులు దేశం సైదులు, నాగరాజు, ఖదీర్, ఎస్‌కె అమీర్, దున్న మురళి, గొబ్బూరి మహేష్, పరుశురాం గౌడ్, రాజేశ్, శ్రీనివాస్, బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల తొలగింపే లక్ష్యంగా 'సర్' కుట్ర

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్ కుమార్ (సింగ్ గురుదేవ్) డిమాండు చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో చిన్నపాటి తప్పులను సాకుగా చూపి పేదలు, వృద్ధులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఎస్ఐఆర్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని కోరారు. ఈ పరిణామాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండు చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగన్, సందీప్, మురళి, జ్ఞానేశ్వర్ , యశ్వంత్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు రమేష్ చంద్ర విజ్ఞప్తి



ప్రజాపక్షం / వనపర్తి : తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కలకొండ రమేష్ చంద్ర కోరారు. ఆర్య వైశ్య సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న లక్ష్మీ నారాయణకు తగిన గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలకొండ రమేష్ చంద్ర మాట్లాడుతూ అమరవాది లక్ష్మీ నారాయణ ఆర్యవైశ్య సమాజాన్ని ఐక్యంగా ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ, సమాజంలోని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ సమాజ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. అమరవాది లక్ష్మీ నారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ద్వారా ఆర్య వైశ్య సమాజానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని రమేష్ చంద్ర అభిప్రాయపడ్డారు. తద్వారా ఆర్యవైశ్యుల సమస్యలు, అభిప్రాయాలు ప్రభుత్వానికి మరింత సమర్థవంతంగా చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్య వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని కోరారు. లక్ష్మీ నారాయణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన తన సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిఎం సొంత నియోజకవర్గంలోనే కార్మికులకు వేతనాల కష్టాలు

మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



ప్రజాపక్షం / నారాయణపేట/ కోస్గి : మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నారాయణపేట జిల్లా నాయకులు సి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, మున్సిపల్ మేనేజర్‌కు సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని కోస్గి మున్సిపాలిటిలోనే కార్మికులకు సెప్టెంబర్ నెల వేతనాలు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు.రాష్ట్రంలోని కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. కోస్గి మున్సిపాలిటీలో ఏడు నెలలుగా కార్మికుల ఇఎస్ఐ, ఇపిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడం ఆందోళనకరమన్నారు. విధి నిర్వహణకు అవసరమైన పనిముట్లు, దుస్తులు, సబ్బులు, నూనెలు కూడా సక్రమంగా అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను నాలుగు కేటగిరీలుగా గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.26 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.30 వేలు, స్కిల్డ్ కార్మికులకు రూ.36 వేలు, హైస్కిల్డ్ కార్మికులకు రూ.42 వేల వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు.విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు కోటి రూపాయల బీమా, అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల బీమా కల్పించాలన్నారు. అంత్యక్రియల ఖర్చుల కింద రూ.30 వేలు, 60 ఏళ్ల వయోపరిమితి పూర్తి చేసుకున్న కార్మికులకు రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

**పెండింగ్ వేతనాలు చెల్లిస్తాం : మున్సిపల్ చైర్మన్**

కార్మికుల సమస్యలపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రత్యేక నిధులు తీసుకొచ్చి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇఎస్ఐ, ఇపిఎఫ్ బకాయిలను కూడా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు డి.రాములు, అంజి, విజయ్, దశరథ్, కమలేష్, వెంకట్ రాములు, సాయాకుమార్, బంద్యమ్మ, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



ప్రజాపక్షం / జోగులాంబ గద్వాల్: దేశ స్వాతంత్ర్య ఉద్యమం, కార్మికుల హక్కుల సాధన లక్ష్యంగా 1920 అక్టోబర్ 31న ఏర్పడిన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) 107 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లగుంట లారీ హమాలీ యూనియన్ అడ్డా వద్ద ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మొట్టమొదటి జాతీయ కార్మిక సంఘంగా ఏర్పడిన ఎఐటియుసి, కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నో చారిత్రాత్మక పోరాటాలు, త్యాగాలు చేసిందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, పని గంటల పరిమితి, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత వంటి హక్కులు కల్పించేందుకు అనేక కార్మిక చట్టాల రూపకల్పన కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడిందని గుర్తు చేశారు. 107 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్ని ఒడిదుడుకులు ఏదురైనా, ఎవరికి తలవంచకుండా కార్మికుల పక్షాన నిష్పక్షపాతంగా నిలబడి నిరవధిక పోరాటాలను కొనసాగించిన ఘనత ఎఐటియుసి దేనని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం, హక్కులు, భద్రత కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్మికుల శ్రమతోనే దేశ ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నప్పటికి, నేటికి అనేక మంది కార్మికులు కనీస హక్కులు, భద్రత, సంక్షేమానికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాల కార్మికులకు సమాజిక భద్రత కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం కార్మికులంతా సంఘటితమై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, 107 ఏళ్ల పోరాట వారసత్వంతో ఎఐటియుసి కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం ముందుండి పోరాడుతుందని బి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రంగన్న, ఉపాధ్యక్షుడు నారాయణ లారీ హమాలీ యూనియన్ నాయకులు రాజు, రవి, వెంకట్ రాములు, శేఖర్, పాండు, అనేక మంది కార్మికుల పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్ కోసం శంకుస్థాపన



ప్రజాపక్షం / మఖ్తల్ : నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలం ఖానాపూర్ గ్రామంలో బిజెపి మఖ్తల్ మండల అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రామానికి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పరిశీలనలో భాగంగా గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి బంగ్లా లక్ష్మీ కాంత్‌రెడ్డిని మండల ప్రధాన కార్యదర్శి సురేష్ కోరిక మేరకు హైమాస్ట్ లైట్లు కావాలని కోరగా వెంటనే సొంత నిధులతో వేయిస్తానని మాట ఇచ్చి, నూతన హైమాస్ట్ లైట్ కోసం శంకుస్థాపన మఖ్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి డా.బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి జావేద్ డిజెవైఎం మండల అధ్యక్షుడు, బొందల కుంట సర్పంచ్ అశోక్ కుమార్ బూత్ అధ్యక్షుడు జగదీష్ బందేపోల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తహసీల్దార్ సస్పెన్షన్

విచారణ నివేదిక ఆధారంగా కలెక్టర్ ఉత్తర్వులు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: అయ్యవారిపల్లి గ్రామంలో భూ రికార్డుల నమోదులో జరిగిన అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉప్పునుంత తాహసీల్దార్ ఎ.సునీతను సస్పెండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అచ్చంపేట డివిజన్ ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 115 లో 13 ఎకరాల 17 గుంటల భూమి అక్రమంగా ఇతరుల పేర్లపై నమోదైనట్లు పలు దినపత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాను విచారణ అధికారిగా నియమించగా, ఆమె సమగ్ర విచారణ పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, ఖస్రా, ఆర్‌ఓఆర్ రికార్డులు, భూభారతి పోర్టల్‌లోని దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఎన్‌కంబరెన్స్ వివరాలను పరిశీలించారు. పాత ఖస్రా రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 115లో మొత్తం 18 ఎకరాల 17 గుంటల భూమి ఉండగా, 197172 నుంచి 197677 వరకు ఉన్న పహాణీలు, ఐబీ రిజిస్టర్‌లో మొత్తం భూమి ద్యాప రామిరెడ్డి పేరుపై నమోదై ఉన్నట్లు గుర్తించారు. అయితే నూతన ఆర్‌ఓఆర్ రికార్డుల్లో 13 ఎకరాల 17 గుంటల సర్వే నెంబర్ 115/ఎ ద్యాప రామిరెడ్డి పేరుపై, మిగిలిన ఐదు ఎకరాలు సర్వే నెంబర్ 115/ఎఎ లో పి.యాదమ్మ పేరుపై నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. భూభారతి పోర్టల్ ద్వారా జరిగిన పేర్ల మార్పులు, సర్వే నెంబర్ల ఉపవిభాగాల నమోదు, వాటికి జతచేసిన పత్రాలు, డిజిటల్ సంతకాల ప్రక్రియను పరిశీలించగా, కొన్ని నమోదులు అసలు రెవెన్యూ రికార్డులతో సరిపోలడం లేదని, పత్రాల ధ్రువీకరణలోనూ లోపాలు ఉన్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. ఈ వ్యవహారం జరిగిన సమయంలో చారకొండ తహసీల్దార్‌గా పనిచేసిన ఎ.సునీత ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఉప్పునుంతల తహసీల్దార్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు విచారణ నివేదికలో పేర్కొనడంతో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్ 1991 లోని రూల్ 8(1) (ఎ) ప్రకారం కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేశారు. క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## పార్కింగ్ లేకుండా నడుపుతున్న...
# ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్



ప్రజాపక్షం / జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నడుపుతున్న ప్రైవేట్ హాస్పిటల్స్, దయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్ లపై తక్షణమే చర్యలు తీసుకోవాలి భారత కమ్యూనిష్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. శనివారం జడ్చర్ల పట్టణంలోని అక్రమ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ గిరీష్‌కి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ..జడ్చర్ల పట్టణంలో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ముఖ్యంగా మున్సిపల్ నుండి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా నడుస్తున్నాయని ఆరోపించారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఉన్న ఆస్పత్రులకు కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ప్రతి ఆస్పత్రికి సొంత పార్కింగ్, ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని, అవి లేని ఆసుపత్రుల గుర్తింపులను రద్దు చేసి, జరిమానాలు విధించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణయ్య, సిపిఐ కౌన్సిల్ సభ్యుడు మహేష్ బాబు పాల్గొన్నారు.

## పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి


అదనపు కలెక్టర్ నర్సింగరావు



ప్రజాపక్షం/గద్వాల్ రూరల్: జల సిరి కార్యక్రమంలో భాగంగా పంట కుంటలు, ఇంకుడు గుంతలు, తదితర నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్లాని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. శనివారం ధరూర్‌మండలంలోని ఓబులోనిపల్లి, ర్యాలంపాడు గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటించారు. అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న పెన్షన్లపై జిల్లాస్థాయి పెన్షన్ వెరిఫికేషన్ నిర్వహించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తుందన్నారు. అలాగే గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పథకాల అమలులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి నిరంతర పోరాటం

జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: కార్మిక హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ తెలిపారు. ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కుమ్మెర ఆటో స్టాండ్‌తో పాటు తిమ్మాజిపేట మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్‌లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ జెండా ఆవిష్కరించగా, తిమ్మాజీపేటలో బజారు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి దేశంలోని తొలి కార్మిక సంఘమని, కార్మికుల హక్కుల సాధనతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో నూ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, మిషన్ భగీరథ, విఓఎలు, హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు అమలు చేయాలని డిమాండు చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుమ్మల శివుడు, సిపిఐ తిమ్మాజిపేట మండల కార్యదర్శి ఎస్‌కె. కాజా మొయినుద్దీన్, రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్య శంకర్ గౌడ్, జిల్లా నాయకులు ఈర్ల హుస్సేన్, బండి లక్ష్మీ పతి, ఎన్నుపోతుల రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, ఆర్.యాదయ్య, మధుగౌడ్, ప్రేమ్ కుమార్, ఆటో నాయకులు, బజారు హమాలీ కార్మికులు, యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

## తండ్రిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి హనుమాన్ నగర్‌లో దారుణం చోటుచేసుకుంది. మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని తండ్రిని కొడుకు గొడ్డలితో నరికి చంపిన ఘటన శనివారం జరిగింది. బాధితుడు గొర్ల కాపరి సురిగిల లింగయ్య (70). నిందితుడు అతని కుమారుడు గణేష్. గణేష్ మద్యానికి బానిసై నిత్యం తండ్రితో గొడవ పడేవాడని, డబ్బుల విషయంలో తలెత్తిన వివాదమే హత్యకు కారణమని ప్రాథమిక సమాచారం. ఇంటి వద్ద గొర్రెలకు చెట్లు నరికేందుకు ఉపయోగించే గొడ్డలితో తండ్రిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సిఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు ముత్తయ్య, వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : పిడుగుపాటుకు గురై గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని మాచారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాచారం గ్రామానికి చెందిన దూపాని నాగరాజు (32) గొర్రెలను మేపేందుకు తోలక వెళ్లి శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో రాయి చెరువు సమీపంలో గొర్రెల మందకు కాపలాగా నాగరాజు పడుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి పిడుగుపడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఉదయం అటువైపుగా వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని గుర్తించారు. చిన్న వయస్సు లోనే కుటుంబానికి ఆధారంగా ఉన్న నాగరాజు మృతితో మాచారం గ్రామంలో విషాదం నెలకొంది.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల:రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, పిట్టంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ కుమార్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని,తూకం,నమోదు, తరలింపులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోద్ మోహన్ రెడ్డి,చిట్యాల,వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్లు సుంకర మల్లేష్ గౌడ్, ఏనుగు రఘుమారెడ్డి, పిట్టంపల్లి సర్పంచ్ అందె అండాలు రాములు,కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాసు,మండల అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి అండ

ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య




ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదింటి ఆడబిడ్డల వివాహాలకు 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు ఎంతో ఊరటగా, కొండంత అండగా నిలుస్తున్నాయని ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్టలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమానికే కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: భారతదేశ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, దేశ ప్రజలను కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ లు అన్నారు. శనివారం ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎఐటియుసి జెండాను సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు యల్లావుల రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాపాడుకుంటూ, కార్మిక ఉద్యమాలను నిర్వహించారన్నారు. కేంద్రంలో ఉన్న ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, ఇందిరాల వెంకటేశ్వర్లు, జెట్టి ప్రసాద్, శీలం లక్ష్మి నర్సయ్య, తాటికొండ జయరాజు, బెల్లంకొండ రామ్మూర్తి, జక్కుల మల్లయ్య, గోపి, రామిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.



# వేదాలు భారతీయ సంస్కృతికి ప్రాణం

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
యాదగిరిగుట్టలో 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో గవర్నర్ సందేశం



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: వేద జ్ఞానమే భారతీయ నాగరికత, సంస్కృతులకు మూలాధారమని, వేదాలు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ, మానవ జీవనం, నైతిక విలువలు, సామాజిక సామరస్యానికి మార్గదర్శకాలని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో శనివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తరతరాలుగా వేదాలను పరిరక్షిస్తూ వస్తున్న గురుశిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదని కొనియాడారు. ఆచార్యులు తమ నిరంతర సాధన, అంకితభావంతో వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు.ఈ మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ భారతీయ సాంస్కృతిక వారసత్వం ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. జయపత్రాలు అందుకున్న 10 మంది వేద విద్వాంసులను ప్రత్యేకంగా అభినందించారు.యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వేద అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి ప్రముఖ కేంద్రంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రాచీన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధునిక విజ్ఞానానికి మధ్య సార్థకమైన అనుసంధానం అవసరమని అన్నారు. వేద విద్యా సంస్థలు, విద్వత్ సభలు, గురుకులాలకు మరింత ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్,ధార్మిక సలహాదారు ఆర్. గోవింద్ హరి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, దేవస్థానం ఈవో జె. భవానీ శంకర్, పూజ్య ఆచార్యులు పాల్గొన్నారు.

# 657మందికి ఇందిరమ్మ ఇళ్లు

వారం రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించాలి
100 రోజుల్లో పూర్తి చేయాలి
కలెక్టర్ తేజస్ నందలాల్ ఆదేశం



ప్రజాపక్షం/సూర్యాపేట : అర్హులైన ప్రతి పేద వాడి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలో ఇప్పటికే 319 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 657 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, 100 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. బేస్‌మెంట్, లింటెల్, రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రతి దశలో నిర్మాణ ఫోటోలను అధికారులను అందజేయాలని సూచించారు. వచ్చే జనవరి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఇళ్ల మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, అవకతవకలను సహించబోమని హెచ్చరించారు. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటికి 657 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ వేణా రెడ్డి, పిడి హౌసింగ్ జబ్బర్, మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఎఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీను, ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్, వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పోరాటాలే ఎఐటియుసి చరిత్ర

ఘనంగా ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవంలో పల్లా దేవేందర్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : భారతదేశంలో కార్మిక హక్కుల కోసం ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఎఐటియుసి 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నల్లగొండలో పలు సెంటర్లో ఏఐటియుసి జెండాలను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న కార్మికుల హక్కులు, గౌరవ ప్రదమైన జీవనం, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో ఆవిర్భవించిన ఏఐటీయూసీ నేడు 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోందన్నారు. ఈ సందర్భంగా దేశ కార్మికవర్గానికి ఏఐటీయూసీ విప్లవాభివందనాలు తెలియజేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులకు ముప్పుగా మారుతున్నాయని అన్నారు. సమ్మె హక్కు, సంఘటితమయ్యే హక్కు, ఉద్యోగ భద్రత, సామూహిక బేరసారాల హక్కులపై పరిమితులు విధించే ప్రమాదం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె ఎస్ రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శి ఎండి జానీ,ఉపాధ్యక్షులు బి వెంకటేశ్, జిల్లా కోశాధికారి దొనకొండ వెంకన్న డివిజన్ కార్యదర్శి వి లెనిన్ భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి కార్యదర్శి రేవల్లి యాదయ్య కోశాధికారి నరసింహా నాయకులు జి నరేందర్, పిల్లి భాస్కర్, వెంకన్న,ఏం నందం, వి స్వామి , టి కృష్ణా,ఎండి యూసుఫ్, నారాయణ,పాక శ్రీనివాస్,రామకృష్ణ,మహేష్,సైదులు,రామలింగయ్య,రవి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న బిజెపి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తుందని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. 1920లో అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఏఐటియుసి ఈ దేశానికి పూర్తి స్వాతంత్ర్యం కావాలని పోరాటం చేసిన మొట్టమొదటి యూనియన్ అని ఆయన గుర్తు చేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ గురుదాస్ గుప్త వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ప్రాంతీయ అధ్యక్షులు దంతాల రాంబాబు, ప్రాంతీయ గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారాం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ప్రాంతీయ కార్యదర్శి రాచకొండ సాయిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్, మహిళా సంఘం ప్రాంతీయ అధ్యక్షులు దంతాల పద్మరేఖ, టైలరింగ్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, రిక్షా యూనియన్ వాడపల్లి వెంకన్న, ఆర్టిసి యూనియన్ నాయకులు నేలపట్ల చిన్న సైదులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండ ఎఐటియుసి జెండా

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్..



ప్రజాపక్షం /భువనగిరిరూరల్: సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. శనివారం ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భువనగిరి పట్టణంలోని జిల్లా ప్రభుత్వ హాస్పిటల్, సివిల్ సప్లై హమాలీ యూనియన్, ఉప్పల్, ఘట్కేసర్, మోత్కూర్, యాదగిరిగుట్ట రూట్, స్వర్ణగిరి, ఎల్లమ్మ గుడి ఆటో స్టాండ్ అడ్డాల వద్ద ఎఐటియుసి జెండాలను రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆవిష్కరించారు. 107 ఏళ్లుగా కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఎఐటియుసి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ కార్మికులందరూ ఐక్యంగా సంఘటితమై తమ హక్కుల సాధన కోసం ముందుకు రావాలని ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు, ఎన్ హెచ్ ఎం జిల్లా అధ్యక్షులు డాక్టర్ షాహిద్ అలీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు సామల భాస్కర్, పిన్నం జగన్, మరిపల్లి సాయి, కృష్ణ, భూపాల్ రెడ్డి, రమేష్, రాజు, బిక్షపతి, పాండు, రామరాజు, వాణి, నరసింహా, నరసయ్య, గణేష్ పాల్గొన్నారు.

## కార్మిక ఉద్యమ చరిత్రలో ఎఐటియుసి కీలక పాత్ర

యాదాద్రి భువనగిరి జిల్లా ఎఐటియుసి అధ్యక్షుడు బోలగాని



ప్రజాపక్షం/మోటకొండూరు: భారతదేశ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి కి గోప్ప ఉద్యమ చరిత్ర ఉన్నదని యాదాద్రి భువనగిరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన శనివారం మోటకొండూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మోటకొండూరు మండల కేంద్రంలో ఏఐటిసి మోటకొండూరు మండల అధ్యక్షులు బీరకాయల మల్లేష్ తో కలిసి ఏఐటీయూసీ జెండా ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు గాదెగాని మాణిక్యం, ఆలేటి బాలరాజ్, జూలికపల్లి పాండు, బీరకాయల మధు, గొట్టిపాముల సునీల్ కుమార్,బోట్ల యాదయ్య, కచ్చిగళ్ళ భాష,ఎత్తర యాదగిరి, శేఖర్, నవీన్,కట్ల శ్రీనివాస్, నరసింహా పాల్గొన్నారు.

## 120 కిలోలకు పైగా గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితులు అరెస్టు
అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాపక్షం/కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో గంజాయి అక్రమ రవాణా గుట్టును పోలీసులు గట్టు రట్టు చేశారు. భారీ మొత్తంలో గంజాయిని కారులో తరలిస్తున్న ముఠాపై మెరుపు దాడిచేసి 120 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రి నుంచి బెంగుళూర్‌కు భారీగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు కోదాడ పట్టణ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో అప్రమత్తమైన పోలీసులు దుర్గాపురం స్టేజీ వద్ద నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కెఎ 03 ఎంజె 4712 నెంబర్ గల కారులో అనుమానస్పదంగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులు వాహనాన్ని వెంబడించి అడ్డుకున్నారు. అనంతరం కారును క్షుణంగా తనిఖీ చేయగా భారీ మొత్తంలో గంజాయి బయటపడింది. సుమారు 120 కిలోలకు పైగా గంజాయిని స్వాదీనం చేసుకున్నపోలీసులు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని ఎక్కడ నుండి సేకరించారు..? బెంగుళూరులో ఎవరికి సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నారు...? ఈ అక్రమ రవాణా వెనుక అంతరాష్ట్ర గంజాయి ముఠా ప్రమేయం ఉందా..? ఈ వ్యవహారంలో ఇంక ఎంతమంది కీలక వ్యక్తులు ఉన్నారు.? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కోదాడను అక్రమ గంజాయి రవాణాకు మార్గంగా ఉపయోగించుకోవాలని చూస్తున్న ముఠాలకు పోలీసులు ఈ భారీ ఆపరేషన్ గట్టి హెచ్చరికగా నిలిచింది. పట్టుబడిన గంజాయి విలువ, నిందితుల పూర్తి వివరాలను పోలీసుల విచారణ అనంతరం వెల్లడయే అవకాశం ఉంది.



## తప్పులు లేకుండా జనగణన

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జనగణను తప్పులు లేకుండా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడత జనాభా గణన శిక్షణ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. భారతదేశంలో తొలిసారిగా జనగణన 2027ను డిజిటల్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఖచ్చితమైన జనాభా వివరాలను సేకరించడం ఈ కార్యక్రమంలో ప్రధాన అంశమన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలో చార్జ్ ఆఫీసర్స్, అడిషనల్ చార్జ్ ఆఫీసర్స్, జిల్లా అధికారులు పాల్గొనారు.

# నల్లగొండ అభివృద్ధికి మహా ప్రణాళిక

పార్టీలకతీతంగా అన్ని డివిజన్ల సమగ్రా అభివృద్ధే లక్ష్యం
మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నల్లగొండ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి,ఆధునిక సౌకర్యాలతో కూడిన స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.పార్టీలకతీతంగా అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు.శనివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి మేయర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ తమ డివిజన్లలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన మేయర్ నగర సమగ్ర అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్పొరేషన్ ఆదాయ వనరులను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

**రూ.197.44 కోట్లతో గడియారం సెంటర్ అభివృద్ధి**


నగర నడిబొడ్డున ఉన్న గడియారం సెంటర్‌లోని పాత ఆర్ అండ్‌బీ కార్యాలయ స్థలంలో అత్యాధునిక కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు రూ. 138.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.59.23 కోట్లు కలిపి మొత్తం రూ.197.44 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన ఆమోదం తెలిపినట్లు మేయర్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగరంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆధ్యాత్మిక,పర్యాటక కేంద్రంగా నల్లగొండ**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్లగొండ పట్టణంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు, సాగర్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరులైన్ల రహదారి విస్తరణకు రూ.20 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రూ.100 కోట్లతో సయ్యద్ లతీఫుల్లా ఖాద్రీ గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు ఘాట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే నల్లగొండ నగరం ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి,రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మున్సిపల్ పాలకవర్గం, పట్టణ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ,కార్పొరేటర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి,గుమ్ముల జానకి మోహన్ రెడ్డి,ఇబ్రహీం,ఆలకుంట్ల నాగరాజు,అబ్బగోని కవితా రమేష్ గౌడ్,బొజ్జ శంకర్, ఏదుల్ల శ్రీధర్ రెడ్డి, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్,పెరిక స్వాతి,ఆలకుంట్ల ఝాన్సీ,అల్లి సుభాష్ యాదవ్,రేగట్టే అండాలు,పున్న జ్ఞానేశ్వరి,పాలకూరి సుమలత, గోగుల గణేష్, వజ్జ సంతోషిని, గుండెబోయిన పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


## పంటల సాగుపై ఎల్ నినో ప్రభావం ఉందా..
## వ్యవసాయం ఎలా సాగుతోంది?

కేశంపేట తహశీల్దార్ రాజేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/కేశంపేట:** పంటల సాగుపై ఎల్ నినో ప్రభావం ఏమైనా ఉందా..ప్రస్తుతం వ్యవసాయం ఎలా సాగుతుంది..పంటల పరిస్థితి ఎలా ఉంది..వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటని రైతు కృష్ణయ్యను తహశీల్దార్ రాజేందర్ రెడ్డి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య వ్యవసాయ పొలం వద్దకు నేరుగా వెళ్ళి పరిశీలించడంతోపాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ నైరుతి రుతుపవనాలు బలహీనపడటం వల్ల వరి, వేరుశనగ, పత్తి, చెరుకు వంటి పంటల సాగు దెబ్బతింటుందని, పంటల దిగుబడి తగ్గితే ఆహార సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. రైతు కృష్ణయ్య వద్ద ఉన్న పశువులు, ఆవుల సంఖ్య, కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీశారు. అధికారులు నేరుగా రైతుల వద్దకు వెళ్ళి వారి కష్టసుఖాలను తెలుసుకోవడం పట్ల స్థానికంగా చర్చనాయంశమైంది. క్షేత్ర స్థాయిలో రైతుల జీవన పరిస్థితులను తెలుసుకోవాలనే తహశీల్దార్ చొరవ పలువురి దృష్టికి ఆకర్షించింది.

## కేశంపేట సిఐ శ్రీనివాస్‌కు సన్మానం



**ప్రజాపక్షం/కేశంపేట :** మండల పోలీస్ స్టేషన్ నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. శనివారం కేశంపేట సిఐ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనాథ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎండి అమేర్, శ్రీధర్, మండల వైస్ ఉపాధ్యక్షుడు రాఘవేందర్, అఖిల్, అజహార్, ఇసాక్, రాజు, కృష్ణ, మహేష్‌లు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలి



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** కార్మిక హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ఆర్‌టిసి కార్మికులకు పిలుపునిచ్చారు.శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఏఐటియుసి కార్మిక సంఘం 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్‌టిసి డిపో సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ హాజరై ఏఐటియుసి జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి కార్మిక సంఘం నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జె.జంగయ్య,సిహెచ్ పరమేష్, ఆశోక్,రమేష్,శేఖర్,జవహర్‌నాయక్,జంగయ్య,కార్మికులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు జగన్ కుటుంబానికి టియుడబ్ల్యుజె(ఐజెయు)యూనియన్ అండ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** సీనియర్ జర్నలిస్టు జగన్ కుటుంబానికి టియుడబ్ల్యుజె(ఐజెయు)యూనియన్ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం రిపోర్టర్ పల్లాటి జగన్ అకస్మత్తుగా గుండెపోటుతో మృతి చెందటంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాం త్ రెడ్డి, మేకల సత్యనారాయణ ఆధ్వర్యంలో హుటాహుటిన మంచాల మం డలం నోముల గ్రామానికి వెళ్లి జగన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్ళులు అర్పించి అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘం తరుపున రూ.20వేల ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రీ, శశిపాల్, వెంకటస్వామి, దశరథ, జెనిగె పాండు, ఎన్ శ్రీనివాస్‌గౌడ్, సదానందం, పాండు రంగారెడ్డి, కోటప్ప, మధు, వై మహేష్, మల్లేష్, యాదగిరిలు పాల్గోన్నారు.

## జగన్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నోముల గ్రామానికి చెందిన మంచాల మండనికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పల్నాటి జగన్ గుండెపోటుతో మృతి చెందడం అత్యంత విషాదకరమని టిపిసిసి సభ్యులు,ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. పల్నాటి జగన్ మృతి విషయం తెలుసుకున్న మర్రి నిరంజన్ రెడ్డి నోముల గ్రామానికి చేరుకుని ఆయన పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం మంచాల మండల ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు అందిస్తూ, నిజాన్ని నిర్భయంగా తన కలం ద్వారా సమాజానికి తెలియజేసిన జర్నలిస్ట్ పల్నాటి జగన్ మరణం తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో నోముల మాజీ ఎంపిటిసి జయ నందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కమలాకర్ రెడ్డి, జంగయ్య, జైపాల్ రెడ్డి, గ్రామస్తులు, బంధుమిత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని పల్నాటి జగన్‌కు ఘనంగా నివాళులర్పించారు.



# ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తెలంగాణ


- తయారీ రంగానికి ప్రాధాన్యం... 7.7 శాతం వృద్ధి
- ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లు, హార్డ్ వేర్ పార్కుల బలోపేతం
- మివి మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకునేలా టెక్నాలజీ, ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలను అనుసంధానిస్తూ కాంప్రహెన్సివ్ ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఇసిటీలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మివి నూతన మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో తయారీ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. 2025–26లో రాష్ట్ర తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపులో తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందన్నారు. తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్ వేర్ పార్కులను మరింత బలోపేతం చేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ తెలంగాణను ముందంజలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. రీసెర్చ్, ప్రొడక్ట్ డిజైన్ నుంచి విడి భాగాలు, ఎండ్ ప్రొడక్ట్స్ తయారీ వరకు అన్ని కార్యకలాపాలు రాష్ట్రంలోనే జరిగేలా కంపెనీలను ప్రోత్సహిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మివి సంస్థ ఇయర్‌బడ్స్, హెడ్ ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఆడియో ఉత్పత్తులను తయారు చేస్తోందని వివరించారు. తాజాగా మివి వన్ 5జీ స్మార్ట్ ఫోన్‌తో మొబైల్ తయారీ రంగంలోకి కూడా అడుగు పెట్టిందన్నారు. కార్యక్రమంలో టిజిఐఐసి ఎండి శశాంక, ఐటి శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మివి ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం చట్టాలను పూర్తిగా దుర్వినియోగం చేస్తుందని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంతోపాటు రామచంద్రాపురం చౌరస్తాలో ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అదాని, అంబానీ ఆస్తులు రోజు రోజుకు పెరుగుతున్నాయని, కార్మికుల జీవితాలు క్రమంగా అడుగంటి పోతున్నాయని వాపోయారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు. అట్టడుగు కార్మిక వర్గాలైన గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడి టీచర్లకు కనీస వేతనాలు అందించని పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ, ఇన్సూరెన్స్ లాంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పించకుండా కార్మిక హక్కులను కాలరాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రిటైర్మెంట్ అయిన అంగన్‌వాడి వర్కర్లకు పెన్షన్ స్కీం లేకుండా వర్కర్లతో వ్యచారి చేయించుకొని వదలి పెట్టిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 44లేబర్ కోడులను నాలుగు విభాగాలుగా విభజించి కార్మికుల హక్కులను కాల రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి కార్మికులకు అందించాల్సిన హక్కులను కల్పించాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండల కార్యదర్శి భాగాల నరసింహ, గ్రామ పంచాయతీ హక్కుల అధ్యక్షుడు యాదయ్య, పామిడి జంగయ్య, ఎం.శ్రీను, సి.జంగయ్య, గౌరవ అధ్యక్షుడు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.


## దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలి : నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో భారత ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాన మంత్రి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొని సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచారని, స్వాత్యంత్రం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను, స్వాత్యంత్రం అనంతరం దేశ సమైక్యత కోసం చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిచే దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రజల మధ్య సోదరభావం, సామరస్యం, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని" జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బియ్యం ధరలపై కీలక నిర్ణయం..

- నిర్ణయించిన ధరలకే విక్రయించాలి
- అధిక ధరలు వసూలు చేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు
- అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి హెచ్చరిక



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కమిషనర్‌తో జిల్లా,రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో బియ్యం గరిష్ట విక్రయ ధరలను నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన తెలంగాణ బిపిటి బియ్యం కిలో రూ.66,సోనా బియ్యం కిలో రూ.74 తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం కిలో రూ.79 చొప్పున గరిష్ట విక్రయ ధరలకు మాత్రమే రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు.నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా వ్యాపారులందరూ నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ కె.చంద్రా రెడ్డి స్పష్టం చేశారు.


## కరువు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఇబ్రహీంపట్నం మాజీ శాసన సభ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి..



**ప్రజాపక్షం/యాచారం :** కరువు సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఇబ్రహీంపట్నం మాజీ శాసన సభ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. శనివారం యాచారం మండల పరిధిలోని మల్కిజ్ గూడ గ్రామంలో ఎండిపోయిన వరిపంటను అయన పరిశీలించారు. రైతు గోవర్ధన్‌ను పంటకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తన అవేదనను రైతు మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుకు కన్నీళ్ళు కష్టాలు వచ్చాయన్నారు. కరువులతో భూగర్భ జలాలు అడుగంటి పోయి వ్యవసాయ బోరు బావులు అడుగంటి పోయాయన్నారు. చుక్క నిరు లేని పరిస్థితి నేలకొందన్నారు. నీటితో పాటు కరంటు సక్రమంగా రాక పోవడంతో వేసిన పంటలన్ని ఎండిపోతున్నాయన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట కోసం ఎదురు చూస్తున్న రైతులకు అప్పులు మిగిలాయన్నారు. వ్యవసాయాన్ని ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రైతులకు సాగునిరు విద్యుత్ సమస్యతో సతమత మౌతున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం యాచారం మండల కేంద్రంలోని 33బై 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. విద్యుత్ కోతలకు సంబంధించిన వివరాలను విద్యుత్ ఎఇని, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని కోరారు. లేనిపిక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యాచారం మండల అధ్యక్షకార్యదర్శులు కర్నా టి రమేశ్ గౌడ్, పాశ్చబాష, సహకార సంఘం చైర్మన్ రాజేంధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారింగ్ యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి,జెర్కోని రాజు, సర్పంచ్ దెరంగుల శంకర్, సహకారసంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, మాజీ ఎంపిటిసి శారద, తదితరులు పాల్గొన్నారు. డీగ్రి పూర్తి చేసిన పట్టభద్రులందరిని ఓటరుగా నమోదు చేయించాలని ఇబ్రహీంపట్నం మాజీ శాసన స భ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం యాచారం మండల కేంద్రంలోని సాయి శరణం గార్డేన్‌లో పట్టభధ్రుల ఓటు నమోదుపై పార్టీ నాయకులతో అవగాహణ సదస్సు నిర్వహించారు.


## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సేవలు, ప్రయోగశాల నిర్వహణ, మందులు, టీకాల నిల్వ విధానాలను పరిశీలించారు. ఆసుపత్రిలో పని చేస్తున్న రెగ్యూలర్, కాంట్రాక్టు సిబ్బంది వివరాలను హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి నిత్యం ఎంతమంది రోగులు వస్తారు.. వారిలో రక్త పరీక్షలకు పంపించిన వివరాలను తెలుసుకున్నారు.ఫార్మసిస్ట్ పర్వతాలుతో కలిసి గర్భిణీలు, చిన్నారులకు అందించే టీకాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. ఐఎల్‌ఆర్ పరికరంలో టీకాలను భద్రపరిచే విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, ఉష్ణోగ్రతల నమోదు రిజిస్ట్రర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు వారి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. విధులకు గైర్హాజరైన కాంట్రాక్టు డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు వివరాలను ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిపిఓ అక్రమ్, డిఎంహెచ్ఓ సిసి సురేష్, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేదలకు అండగా ఉండటంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప సూచించారు. శనివారం పట్టణంలోని కేశంపేట రోడ్డు ఉన్న ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల విగ్రహాలకు వైస్ చైర్మర్ అందె మోహన్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశంలోని వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి అఖండ భారతదేశ నిర్మాణంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. పేద ప్రజలకు కొండంత అండగా భరోసాను ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, అర్హులైన ప్రతి లబ్దిదారుడిని ప్రభుత్వ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశ ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యా యం చేయాలన్న లక్ష్యంతోనే అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సర్ధార్ వల్లబాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, చందులాల్, సింగపాక అనిల్, బాదేపల్లి సిద్దార్థ, రమేష్, జంగయ్య, శ్రీధర్‌రెడ్డి, సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/కొత్తూరు:** బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారి రక్షణ కోసం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. శనివారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలోని బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. బాలికలపై జరిగే హింస, వేధింపులు, బాల్య వివాహాల నివారణతోపాటు పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన ఆవశ్యకతపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలగకుండా కాపాడటం, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సకాలంలో స్పందించడంతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలలపై హింస, వేధింపులను నిరోధించడంతోపాటు బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రేవతి, ఐసిడిఎస్ సిబ్బంది శ్రీలత, అశ్వీత, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది గీత, ఉప సర్పంచ్ చంతన్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు రఘుపతిరెడ్డి, శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్ బుజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో అండాల సేకరణ ముఠా గుట్టురట్టు!

- డబ్బు ఆశ చూపించి యువతుల నుంచి అండాల సేకరణ
- దుర్గాప్రసాద్ అదుపులోకి... 18 మంది యువతులను విచారిస్తున్న పోలీసులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పేదరికం,ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని యువతులకు డబ్బు ఆశ చూపిస్తూ వారి నుంచి అండాలను సేకరిస్తున్న వ్యవహారం హైదరాబాద్‌లో కలకలం రేపుతోంది.హైదరాబాద్ మహానగరం నడి బొడ్డున ఉన్న సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో 'శెట్టి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కేంద్రంగా ఈ కార్యకలాపాలు సాగుతున్నట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ అనే వ్యక్తి వివిధ రాష్ట్రాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన యువతులకు డబ్బు ఆశ చూపించి హైదరాబాద్‌కు రప్పిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారికి హాస్టల్‌లో వసతి కల్పించి, నెలనెలా అండాలను సేకరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఇలా సేకరించిన అండాలను నగరంలోని వివిధ కార్పొరేట్ ఆసుపత్రులు, సంతాన సాఫల్య కేంద్రాలు, ఐవిఎఫ్ కేంద్రాలకు అధిక ధరలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హాస్టల్‌లో ఉన్న 18 మంది యువతులను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పలు వార్తా కథనాలు వెల్లడించా యి. ఈ వ్యవహారంలో యువతుల పాత్ర, వారికి కల్పించిన ప్రలోభాలు, అండాల సేకరణ వెనుక ఉన్న అసలు వ్యక్తుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**ఐవిఎఫ్ కేంద్రాల పాత్రపై ఆరా:** యువతుల నుంచి అండాలను సేకరించే ముందు వారి సమ్మతి తీసుకున్నారా..? అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారా..? అండాల సేకరణ, నిల్వ, రవాణా,సరఫరాకు సంబంధించిన చట్టబద్ధమైన నిబంధనలు పాటించారా..? సేకరించిన అండాలను ఏయే ఆసుపత్రులు,ఐవిఎఫ్ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు..? ఆయా కేంద్రాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా..? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.


### పేద యువతుల ఆర్థిక అవసరాలే లక్ష్యంగా..

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యువతులకు నగదు ఆశ చూపించి వారి ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారా...!? అండాల సేకరణ పేరుతో పెద్ద మొత్తంలో అక్రమ వ్యాపారం సాగుతోందా..!? ఈ వ్యవహారం వెనుక మరి కొందరు వ్యక్తులు,సంస్థల ప్రమేయం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.హాస్టల్ నిర్వహణ నుంచి అండాల సేకరణ,వాటి సరఫరా వరకు మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ఈ వ్యవహారం వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్,సంబంధిత ఆసుపత్రులు, ఐవిఎఫ్ కేంద్రాల పాత్ర,అండాల సేకరణకు సంబంధించిన అనుమతుల వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

### అకుంఠిత ధైర్యం...

# 'దార్శనిక నాయకత్వానికి ప్రతీక' ఇందిరాగాంధీ

- వర్ధంతి సందర్భంగా 'శక్తిస్థల్' వద్ద కాంగ్రెస్ నేతల నివాళులు
- పుష్పాంజలి ఘటించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్, సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** 'అజేయమైన ధైర్యం, అచంచలమైన సంకల్పం, దార్శనిక నాయకత్వానికి దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రతీక' అని కాంగ్రెస్ పార్టీ నివాళులు అర్పించింది. శనివారం ఇక్కడ దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఇందిరాగాంధీ స్మారక చిహ్నం 'శక్తిస్థల్' వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధినేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీలు ఇక్కడ ఉన్న భారతదేశపు ఏకైక మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అని పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా మాజీ ప్రధాని నివాసమైన 1, సఫ్దర్‌జంగ్ రోడ్ లోని 'ఇందిరాగాంధీ మెమోరియల్' వద్ద ఆమెకు నివాళులు అర్పించారు. తన అమ్మమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించేందుకు, తనకు నేర్పిన సంస్కృత శ్లోకాన్ని రాహుల్ గాంధీ పంచుకున్నారు. 'మీ ఒడిలో కూర్చుని, మీ రెండు చేతులు పట్టుకుని, మీరు ఈ మాటలు చెబుతుంటే వింటూ, మీరు చెప్పిన తర్వాత వాటిని పునరావృతం చేస్తూ, 'అసతోమా సద్గమయా, తమసోమా జ్యోతిర్గమయ, మాత్యోర్మ అమృతా గమయ, ఓం శాంతి, శాంతి, శాంతి దాదీ, మీరు నాకు ఎంత అందమైన బహుమతి ఇచ్చారు. ఎంత గొప్ప బహుమతి. నేను ఎప్పుడూ ఊహించలేదు' అని రాహుల్‌గాంధీ అన్నారు. మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఇందిరాగాంధీ అకుంఠిత ధైర్యానికి, అచంచలమైన సంకల్పానికి, దార్శనిక నాయకత్వానికి ప్రతీక అని కొనియాడారు. బలమైన ప్రగతిశీల భారతదేశ నిర్మాణానికి ఆమె చేసిన ఆమె చేసిన అపారమైన కృషి శాశ్వత వారసత్వంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. 'మన దేశ ఐక్యత, సమగ్రత కోసం ఇందిరాగాంధీ చేసిన మహోన్నత త్యాగం మన సామూహిక స్మృతిలో శాశ్వతంగా నిలిచిపోతుంది'అని మల్లికార్జున్ ఖర్గే తన ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.మరొక పోస్ట్‌లో ఖర్గే ఇందిరా గాంధీ కొటేషన్‌ను పంచుకుంటూ, ఇందిరాగాంధీ మనకు శాశ్వత స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. దేశ ఐక్యత, సమగ్ర గౌరవాన్ని కాపాడటంలో ఇందిరాగాంధీ అంకిత భావం, ఆధునిక భారతదేశ నిర్మాణానికి ఆమె చేసిన అమూల్యమైన కృషి మన జాతీయ చైతన్యంలో ఎప్పటికీ సజీవంగా నిలిచి ఉంటాయని ఖర్గే అన్నారు. 'ఆమె ధైర్యం మాకు స్ఫూర్తి, ఆమె త్యాగం మా చెరగని జ్ఞాపకం అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా కూడా దివంగత మాజీ ప్రధానమంత్రి అయిన తన అమ్మమ్మను కీర్తించారు. 'ఆమె ఎంత అందమైన మహిళ!. ఆకాశమంత స్వేచ్ఛాజీవి. సముద్రం అంత లోతైనది. భూమిలా దృఢమైనది. అగ్నిలా ప్రకాశవంతమైనది' అని ప్రియాంక అన్నారు. 'భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి, అకుంఠిత ధైర్య సాహసాలకు, సంకల్పబలానికి ప్రతీక అయిన ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా, వినయపూర్వక నివాళి' అని కాంగ్రెస్ తన అధికారిక హ్యాండిల్ ద్వారా పేర్కొంది. 1984లో ఇదే రోజున అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ తన అంగరక్షకుల చేతిలో ఇక్కడే హత్య చేయబడ్డారు. ఇందిరాగాంధీ భారత దేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి. ఆమె 1917 నవంబరు 19న జన్మించారు.


### 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు...

# ప్రధాని మోదీ పుష్పాంజలి



**ఏక్తానగర్ :** దివంగత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వజయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' వద్ద పుష్పాంజలి ఘటించారు. శనివారం ఉదయం ఇక్కడున్న ఐక్యతా విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) వద్దకు చేరుకున్న ప్రధాని మోదీ మహా నాయకుడు వల్లభాయ్ పటేల్‌కు పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్యం అనంతరం సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతీయేటా అక్టోబరు 31వ తేదీని జాతీయ ఐక్యతా దినోత్సవంగా పాటిస్తారు. తన సందేశంలో మోదీ జాతీయ సమైక్యతకు, దేశ నిర్మాణానికి పటేల్ చేసిన కృషిని ప్రశంసిస్తూ, బలమైన, సంపన్నమైన, సమర్థవంతమైన భారతదేశ నిర్మా ణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేసారని ప్రస్తుతించారు. దేశ సేవలో పటేల్ చేసిన త్యాగం, అంకితభావం అభివృద్ధిచెందిన, ఆత్మ నిర్భర భారతదేశ నిర్మాణానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రధానమంత్రి అన్నారు. 'అఖండ భారత్' పితామహుడు, దేశపు 'ఉక్కు మనిషి' అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు హృదయపూర్వక నివాళులు. బలమైన, సుసంపన్నమైన, సమర్థవంతమైన భారతదేశ నిర్మాణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు' అని పేర్కొన్నారు. పటేల్ 1875 అక్టోబరు 31న గుజరాత్‌లోని నడియాడ్‌లో జన్మించారు.1950 డిసెంబరు 15న కన్నుమూశారు.

# జర్నలిస్టు నిధి రజ్దాన్‌తో ఒమర్ అబ్దుల్లా వివాహం



**న్యూఢిల్లీ :** ప్రముఖ టెలివిజన్ జర్నలిస్టు నిధి రజ్దాన్‌ను జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా న్యూఢిల్లీలో శనివారం వివాహం చేసుకున్నారు. 56 ఏళ్ల ఒమర్ అబ్దుల్లా సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులో 'నిన్న ఒక కొత్త ప్రయాణం ప్రారంభమైంది...' అని పేర్కొంటూ నిధి రజాన్‌ను ట్యాగ్ చేశారు. ఈ పోస్టులో ఈ జంటకు సంబంధించిన నాలుగు ఫొటోలను కూడా జత చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, శుక్రవారం న్యూఢిల్లీలో ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం వీరి వివాహం జరిగింది. ఈ వివాహానికి ఇరు కుటుంబాలకు చెందిన సభ్యులు సాక్షులుగా హాజరయ్యారు. ఒమర్ అబ్దుల్లా తన మొదటి భార్య పాయల్‌తో విడాకులు పొందారు. ఈ ఏడాది జులైలో ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒక ఒప్పందానికి రావడంతో సుప్రీంకోర్టు వారి వివాహ బంధాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, 49 ఏళ్ల నిధికి ఇది రెండో వివాహం. శ్రీనగర్, న్యూఢిల్లీలో జరిగిన వివాహ వేడుకల్లో ఇరు కుటుంబాల సభ్యులు, సన్నిహిత బంధువులు పాల్గొన్నారు. ఒమర్ అబ్దుల్లా తల్లిదండ్రులు ఫరూక్ అబ్దుల్లా, మోలీ, ఆయన ముగ్గురు సోదరీమణులు, ఇతర సన్నిహిత బంధువులు ఈ వేడుకలకు హాజరయ్యారు. అలాగే నిధి తల్లిదండ్రులు, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఎంకె రజ్దాన్, సరళ రజ్దాన్ కూడా వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

# రాప్తాడులో రాక్షసత్వం
# విద్యార్థినిపై అమానుష దాడి

- విద్యుత్ రంపం మిషన్‌తో తెగబడ్డ ఉన్మాది
- బాలిక పరిస్థితి విషమం... బెంగళూరు తరలింపు
- పోలీసుల అదుపులో నిందితుడు?



**అనంతపురం కార్పొరేషన్:** అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అమానుష ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పదో తరగతి విద్యార్థినిపై తరగతి గదిలోనే విద్యుత్ రంపంతో ఉన్మాది దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉంది. శనివారం ఉదయం తరగతి గదిలో టీచరు పాఠం చెబుతుండగా నిందితుడు లోపలికి ప్రవేశించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. కాగా పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ముదగ నరసమ్మ, వెంకటరాముడు దంపతుల కుమార్తె గోపిక పదవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ద్రాక్ష తోటల్లో, గోపిక సోదరుడు ఇందు వర్ధన్ భవన నిర్మాణాల కడ్డీల పని చేస్తున్నారు. శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో రాప్తాడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు పాఠాలు చెబుతుండగా అకస్మాత్తుగా దుండగుడు పాఠశాల గేటు తోసుకుని విద్యుత్ రంపం మిషన్‌తో తరగతి గదిలోకి చొరబడ్డాడు. అడ్డొస్తే చంపేస్తానంటూ విద్యార్థులను, ఉపాధ్యాయురాలిని బెదిరించాడు. మీరెవరు అని అడిగేలోపే మానవత్వం మరిచిన నరరూప రాక్షసుడు హేమంత్... గోపిక అనే విద్యార్థినిపై రంపం మిషన్‌తో దాడి చేశాడు. చేతులను విచక్షణారహితంగా కోశాడు. ముఖానికి తీవ్ర గాయమైంది. దీంతో విద్యార్థిని గోపిక రక్తపు మడుగులో సొమ్మసిల్లి పడిపోయింది. మరో విద్యార్థిని లక్ష్మీ కాళ్లకు గాయాలయ్యాయి. ఘటన చూసిన కొంతమంది విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయారు. విద్యార్థులు తేరుకునేలోపే దుండగుడు హేమంత్ ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయినులు పాఠశాల ప్రాంగణంలోకి పరుగులు తీశారు. అప్పటికే విద్యార్థిని ప్రాణాపాయ స్థితిలో ఉంది. పాఠశాల ముందుగా వెళుతున్న కొంతమంది స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థినిని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ప్రఖ్యాత మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించి, అత్యుత్తమ వైద్యం అందించాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ప్రతి కీలక ఒప్పందంలోనూ పారదర్శకతపై సందేహాలు

ఐడిబిఐ బ్యాంకు విక్రయంపై కాంగ్రెస్ ప్రశ్నలు



**న్యూఢిల్లీ :** ఐడిబిఐ బ్యాంకు వాటాల విక్రయంపై వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ నిలదీసింది. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రతి కీలక ఒప్పందంలోనూ పారదర్శకత, ప్రయోజనాల సంఘర్షణ (కాన్ ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్)పై అనుమానాలు ఎందుకు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. 1964 జులై 1న ఏర్పాటైన ఐడిబిఐ బ్యాంకు దేశ పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. అప్పటి ఆర్థిక మంత్రి టిటి కృష్ణమాచారి ఈ సంస్థ ఏర్పాటుకు రూపకల్పన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రైవేటు రంగానికి ఆర్థిక సహాయం అందించడంతోపాటు ఎస్ఐడిబిఐ, ఎగ్జిమ్ బ్యాంక్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ), సెబీ, ఎన్ఎస్‌డిఐ వంటి కీలక సంస్థల ఏర్పాటులోనూ ఐడిబిఐ పాత్ర ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.10 వేల కోట్ల లాభం ఆర్జించిన ఇలాంటి సంస్థను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ సంస్థకు ఎందుకు విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. ఐడిబిఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను సుమారు రూ.53 వేల కోట్లకు (5.5 బిలియన్ డాలర్లు) కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్‌కు విక్రయించేందుకు కేంద్రం అక్టోబర్ 14న ఆమోదం తెలిపింది. ఇది భారతీయ బ్యాంకింగ్ రంగంలో అతి పెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. బిజినెస్ వరల్డ్‌లో ప్రచురించిన పరిశోధనాత్మక కథనాలు ఈ ఒప్పందంపై పలు సందేహాలు లేవనెత్తాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఎల్ఐసి స్వతంత్ర డైరెక్టర్ గురుమూర్తి మహాలింగం ఒకేసారి ఎల్ఐసి, ఫెయిర్ ఫాక్స్ నియంత్రణలోని థామస్ కుక్ ఇండియా సంస్థల బోర్డుల్లో ఏడు నెలలపాటు కొనసాగారని తెలిపారు. అదే సమయంలో ఎల్ఐసి తనకున్న ఐడిబిఐ వాటాలో 30.24 శాతాన్ని విక్రయించే ప్రక్రియ ప్రారంభించిందని, ఫెయిర్‌ఫాక్స్ కూడా కొనుగోలుదారుల్లో ఒకటిగా ఉందని వివరించారు. మహాలింగం ఎల్ఐసి పెట్టుబడుల కమిటీలోనూ సభ్యుడిగా ఉన్నారని, ఇది ప్రయోజనాల సంఘర్షణకు దారితీసే అంశమని ఆరోపించారు. ఐడిబిఐ షేర్ల కనీస విక్రయ ధరను తొలుత రూ.94.42గా నిర్ణయించి, ఆ తర్వాత రూ.75.99కు ఎందుకు తగ్గించారని రమేశ్ ప్రశ్నించారు. ప్రభుత్వమే నిర్ణయించిన కనీస ధర కంటే సుమారు రూ.8,800 కోట్లు తక్కువకు బ్యాంకు విక్రయం ఎలా జరిగిందని నిలదీశారు. ఫెయిర్‌ఫాక్స్ బిడ్ తెరిచిన రోజే కనీస ధరను ఏ నిబంధనల ప్రకారం మార్చారని, ఆ సంస్థ బిడ్ విలువ ముందే ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. విక్రయ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కేంద్ర ప్రభుత్వ, నియంత్రణ సంస్థల మాజీ అధికారుల్లో పది మందికి ఫెయిర్‌ఫాక్స్ గ్రూపు సంస్థల్లో పదవులు దక్కాయని కూడా ఆయన ఆరోపించారు. ఈ నియామకాలపై విచారణ జరిగిందా అని ప్రశ్నించారు. ఐడిబిఐ ఉద్యోగుల భవిష్యత్తుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా లాభాల్లో ఉన్న ప్రభుత్వ బ్యాంకును విక్రయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రభుత్వం అన్ని నిబంధనలు పాటించిందని, రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రత్యారోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో రాజకీయ సంబంధాలున్న వ్యాపార సంస్థలకు విచక్షణారహితంగా రుణాలు ఇచ్చారని, వీడియోకాన్, విన్సమ్, ఎబిజి షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ సంస్థలకు ఇచ్చిన రుణాలు నిరర్థక ఆస్తులుగా మారి ఐడిబిఐకి భారీ నష్టాలు తెచ్చాయని ఆమె పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం రూ.25 వేల కోట్లకు పైగా మూలధనాన్ని సమకూర్చి, వృత్తిపరమైన నిర్వహణతో బ్యాంకును పునరుద్ధరించిందని వివరించారు. ఒప్పందంలో స్వతంత్ర దర్యాప్తు, పారదర్శకత, పార్లమెంటుకు జవాబుదారీతనం ఉండాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతులకు లోబడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఐడిబిఐ విక్రయ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

### భారత వైమానిక దళ కొత్త చీఫ్‌గా

# దీక్షిత్ బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ :** భారత వైమానిక దళ కొత్త అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షి త్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 20కి పైగా రకాల విమానాలను నడిపి న ఆయనకు, 3,500 గంట లకు పైగా విమానయాన అనుభవం ఉంది. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. రేస్‌కోర్స్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో వైమానిక దళం ఎపి సింగ్‌కు సంప్రదాయ గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ఆయన కొత్త అధిపతి దీక్షిత్‌కు బాధ్యతలు అప్పగించారు.ఆపరేషన్ సిందూర్ స మయంలో కీలక పాత్ర పోషించిన దీక్షిత్ ఇప్పటివరకు వైమానిక దళ వైస్ చీఫ్ గా పనిచేశారు. వ్యూహాత్మక ప్రణాళికలో నైపుణ్యం కలిగిన అధికారిగా ఆయ నకు గుర్తింపు ఉంది. అంతకుముందు ఆయన ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధా న కార్యాలయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్‌కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫె న్స్ సాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ గా పనిచేశారు. 1966 డిసెంబర్ 9న జన్మించిన దీక్షిత్ 1986 డిసెంబర్ 6న ఫైటర్ విభాగంలో వైమానిక దళంలో చేరారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బంగ్లాదేశ్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ, నేషనల్ డిఫెన్స్ కాలేజీల్లో శిక్షణ పొందారు.

# షూ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

- నలుగురు కార్మికులు మృతి
- ఢిల్లీలోఘటన

**న్యూఢిల్లీ :** వాయవ్య ఢిల్లీలోని మంగోల్‌పురి పారిశ్రామిక ప్రాంతం ఫేజ్1 లోని షూ తయారీ కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం సంభవించిం ది. ఈ ఘటనలో నలుగురు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు గా యపడ్డారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి పారిశ్రామిక ప్రాంతంలోని కర్మాగారంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 31 అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతానికి మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. షూ తయారీ యూనిట్ బేస్మెంట్‌లో మంటలు మొదలయ్యాయని అగ్నిమాపక అధికారులు తెలిపారు. బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మూడు అంతస్తులు ఉన్న ఈ భవనంలో నాలుగో అంతస్తు నిర్మాణం పాక్షికంగా పూర్తయింది. సహాయక చర్యల్లో భాగంగా మూడో అంతస్తు నుంచి ఒకరిని, నాలుగో అంతస్తులోని గదిలో చిక్కుకున్న మరో ఐదుగురిని సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. మృతులను బిహార్‌లోని నలంద జిల్లాకు చెందిన అశోక్ (25) , మంగోల్‌పురికి చెందిన హరిహర్ (40), లాల్‌బాబు (38), ప్రేమ్ చంద్ (50)గా గుర్తించారు. రాజ్‌పార్క్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని ప లు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సురేశ్చంద్, అశోక్ (47) అనే ఇద్దరిని అదుపులో కి తీసుకుని విచారిస్తున్నారు. ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. మంగోల్‌పురిలోని సంజయ్ గాంధీ మెమోరియల్ ఆసుపత్రికి తరలించారు.


**LOST PASSPORT**

I, **IMRAN,** S/O. **IKRAMODDIN,** H.No. 2-69, Village: Kanjar, Mandal: Dilawarpur, Dist: Nirmal. I lost my original Passport Bearing No. **K4785544**. While on bike from my house to Kanjar Bus Stand by travelling. If anybody found return to the above mentioned address.

**బహిరంగ ప్రకటన**

అసలు పత్రం పోయినది

నేను, **కె.అనిల్ కుమార్, తండ్రి పేరు: కె.బక్కయ్య,** ఇ.నెం. 13-6-433/175, నేతాజీ నగర్, లంగర్‌హౌస్, రింగ్ రోడ్, హైదరాబాద్ - 500008. నాకు సంబంధించిన అసలు రిజిస్టర్డ్ సేల్ డీడ్ (విక్రయ దస్తావేజు), డాక్యుమెంట్ నంబర్ **17646/2006** పోయినది. సదరు దస్తావేజు తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, శామీర్‌పేట్ మండలం, సంపన్‌బోల్ గ్రామానికి సంబంధించినది. ఈ దస్తావేజు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయబడినది. కావున, పై పేర్కొన్న అసలు దస్తావేజు ఎవరికైనా లభించినా లేదా ఎవరి వద్దనైనా ఉన్నా, దయచేసి వెంటనే క్రింది ఫోన్ నంబర్‌కు సమాచారం అందించగలరు లేదా పై చిరునామాలో అప్పగించగలరు.

ఇట్లు

**కె. అనిల్ కుమార్, తండ్రి బక్కయ్య**

ఇ.నెం. 13-6-433/175, నేతాజీ నగర్, లంగర్‌హౌస్, రింగ్ రోడ్, హైదరాబాద్.

సెల్ నెం. **90101 00070**

**PUBLIC NOTICE**

(FOR PURCHASE OF Villa **(H.No-8-51/54/17),** in Sy Nos. 372/Part, 377/Part, 372/E1, 372/E2, 372/E3, 372/E4, 372/F2 & 372/T,in "GOOD TIME'S LAKE SIDE ENCLAVE" of ISNAPUR Municipality, PATANCHERU Mandal, SANGAREDDY Dist., Telangana.)

General public is here by informed that my client SRI. GANGANBOINA NARSING RAJ (VENDEE), S/o. Late. GANGANBOINA SATHYA-NARYANA, Aged about 33years, Occupation: Private Employee, R/o 1-7-842/4, Mohan Nagar, Zamistanpur, Musheerabad, Hyderabad District, Telangana State. Aadhar No. XXXX XXXX5713, has entered into an agreement of sale, for purchase of Villa **(Plot-17-bearing H.No-8-51/54/17)** inSyNos. 372/Part, 377/Part, 372/E1, 372/E2, 372/E3, 372/E4, 372/F2 & 372/T, total admeasuring **183.00 Sqyrds** Situated at "GOOD TIME'S LAKE SIDE ENCLAVE" of ISNAPUR Municipality, PATANCHERU Mandal, SANGAREDDY District, Telangana State Pincode - 502307. Any person(s) or institution(s) have any objection /claim / rights over the property for the saidtransaction may approach undersigned with in (10 days) with all relevant papers from the date of this publication. No claim will be entertained thereafter and my client shall proceed for registration.

Sd/- **M Venkatesham**
**Advocate**
Office: #Plot 39, H.No. 5-122/39, R.R Homes,Ameenpur, Sangareddy District, Hyderabad-502032, Telangana.
**Ph: 9032335965, 9603656676.**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**
**ARB.NO. 136 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**
**.... Disputant**
AND
**Mr. Baji Salam Shaik & others**
**... Opponents**
1. Mr.Baji Salam Shaik, S/o. Hasensa, aged about : 33 years, Occ: Private Employee. R/o: H.No. 3-352/3,Ratna Nagar,Choutuppal, Yadadri Bhuvanagiri, Telangana, India - 522436 Mobile:9640219746
2. Mr.Rajesh Meduri, S/o. Yesubabu,aged about :34 years,Occ:Private Employee. R/o:H.no. 5-433/22/5, Hanuman Nagar, Choutuppal, Yadadri Bhuvanagiri, Telangana, India - 521215 Mobile: 7601064400
3. Mr.Abdula Shaik, S/o. Hussain Saheb,aged about :42 years,Occ:Private Employee. R/o: H.No. 5-174/1, Bangari Gadda, Choutuppal, Yadadri Bhuvanagiri, Telangana, India - 522436 Mobile: 7036371009
4. Mr.Nazeer Shaik, S/o. Silar Saheb, aged about :47 years, Occ:Private Employee.R/o: H.No.1-7,Bangari Gadda, Choutuppal, Yadadri Bhuvanagiri, Telangana, India - 522402 Mobile: 8096823246

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-11-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, WARANGAL**
**ARB.NO. 135 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**
**.... Disputant**
AND
**Mr. Muralikrishna Elpula, & others**
**... Opponents**
1. Mr.Muralikrishna Elpula, S/o. Kumaraswmy, aged about : 41 years, Occ:Private Employee R/o: Hno. 5-133, KRISHNA COLONY, BHOOPALPALLY, Jayashankar Bhupalpally, Telangana, India - 506169 Mobile:9849785409
2. Mr.Dulam Venkateshwar Rao, S/o. Komaraiah,aged about :50 years,Occ:ASST CHAINMAN, Survey BHP O/o:SCCH Bhupalpally. R/o:H.No. 6-11/1,Vinayaka Super Market, Police Station Road, Bhupalpally, Jayashankar Bhupalpally, Telangana, India - 506169 Mobile: 8885191185
3. Mr.Sathish Ilaveni, S/o. Mallaiah,aged about :40 years,Occ:COAL CUTTER, KTK. O/o:IUC, SCCH. R/o: Hno-12-254, subhash colony, bhoopalpally, Jayashankar Bhupalpally, Telangana, India - 506169 Mobile:6305478830
4. Mr.Srinivas Chidhurala, S/o. Bhaskar, aged about :36 years,Occ:GENERAL MAZDOOR, O/o:KTK8 Inc SCCH. R/o: Block.No. 31Qtr No,1254, 1000 QTRS, BHUPALPALLY, Jayashankar Bhupalpally, Telangana, India - 506169 Mobile:8008683051
5. Mr.Srikanth Sappi, S/o. Komaraiah,aged about :36 years, Occ: GENERAL MAZDOOR, O/o:KTK8 Inc SCCH. R/o: H.No.181, BHARATH COLONY, Somagudem, Alnepally, Adilabad Dist, Telangana, India - 504208 Mobile:9398193769
6. Mr.Srinivas Engala, S/o. Satyanarayana,aged about :56 years, Occ:TRAMMER, O/o: KTK6Inc, SCCH. R/o: H.No.4-69,Krishna Colony, BHUPALPALLY, Jayashankar Bhupalpally, Telangana, India - 506169 Mobile:9505475515

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-11-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL,**
**ARB.NO. 142 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**
**.... Disputant**
AND
**Mr.Rakesh Gangineni,, & others**
**... Opponents**
1. Mr.Rakesh Gangineni, S/o. Bixapathi, aged about : 39 years, Occ:Private Employee, R/o:H.No.3-111,Arepally, Paidpalli, WARANGAL, Warangal (Urban), Telangana, India - 506006 Mobile: 8897570240
2. Mr.Janga Kranthikumar, S/o. Sadanandam,aged about :45 years,Occ:VILLAGE REVENUE OFFICER, R/o: 4-111, AREPALLY, WARANGAL, Telangana, India - 506006 Mobile: 9949051107
3. Mr.Rajkumar Kokkarakonda, S/o. Kumaraswamy,aged about :31 years,Occ:Private Employee, R/o: H.No. 6-19,Arepally, warangal, Warangal (Rural), Telangana, India - 506002 Mobile:9963309105
4. Mrs.Gangineni Rajitha, D/o. Rakesh, aged about :37 years,Occ:Private Employee, R/o:3-111, Arepally, PAIDPALLY, Warangal, Telangana, India - 506006 Mobile:8897570240

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 13-11-2026 for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**
**ARB.NO. 148 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., AKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**
**.... Disputant**
AND
**Mrs Praveen Kumar Vaddapally, & others**
**... Opponents**
3. Mr.Ramesh Marepaka, S/o. Babu,aged about :43 years,Occ:Private Emplyee. R/o:25-4-652,VISHNUPURI, KAZIPET, Warangal (Urban), Telangana, India - 506003 Mobile:9063660001

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-11-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**
**ARB.NO. 234 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., AKKALAGUTTA CAO Branch, R/o. WARANGAL.**
**.... Disputant**
AND
**Mrs Shaik Masthan Babu, & others**
**... Opponents**
2. Mr.Sridhar Sagarla, S/o. Nandaiah, aged about :38 years, Occ:GENERAL MAZDOOR, O/o:Ramagundam, 11 Incline, Employee Id: 01020516, R/o: T2151, TILAKNAGAR GODAVARIKHANI, Peddapalli, Telangana, India - 505172 Mobile: 9912800243
3. Mr.Satyanarayana Revelli, S/o. Nambaiah,aged about :52 years, Occ:GENERAL MAZDOOR, O/o: OCP-III, Ramagundam-II, Employee Id:0994788,. R/o: H.No. 16-3-111, LB NAGAR, GODAVARIKHANI, Peddapalli, Telangana, India - 505172 Mobile: 9395306044

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-11-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**
**ARB.NO. 248 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**
**.... Disputant**
AND
**Mrs Korra Nishad , & others**
**... Opponents**
1. Mrs.Korra Nishad, S/o.Dhanja, aged about:28 years, Occ:Junior Panchayat Secretary, O/o:Chakra Thanda,Gudur,Mahabubabad,Employee Id:4327355 R/o: H.No: 4-45/1, Adivarampeta Thanda, Seethanagaram, Gudur, Warangal, Narsampet, Mahabubabad, Telangana, India - 506132 Mobile: 8919868394
2. Mr.Shankar Jatoth, S/o. Balaram,aged about :50 years, Occ:SGT, O/o:Govt A HS,Redyala,Mahabubabad,Warangal,Employee Id:2132252. R/o:H.No.4-49/1, ADHIVARAMPET, SEETHA NAGAR, GUDUR, Mahabubabad, Telangana, India - 506132 Mobile:8790137938
3. Mr.Srinivas Korra, S/o. Dhanjya,aged about :32 years, Occ:FOREST BEAT OFFICER, O/o: F.D.O. Gudur, Employee Id: 3503752, R/o: H.No. 4-76/1, SOMLATHANDA, GAJULAGATTU, GUDUR, Mahabubabad, Telangana, India - 506134 Mobile:8897062373
4. Mr.Gopilal Bhukya, S/o. Eerya,aged about : 25 years, Occ:Private Employee, R/o: H.No. 4-45/1 SEETHANAGARAM , ADHIVARAMPETA GUDUR NARSAMPET, Mahabubabad, Telangana, India - 506134 Mobile:8919868394

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-11-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**
**ARB.NO. 252 of 2026**
Between:
**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., AKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**
**.... Disputant**
AND
**Mrs Chiranjeevulu Manchala, & others**
**... Opponents**
1. Mr.Chiranjeevulu Manchala, S/o. Ramaiah, aged about : 57 years Occ:Private Employee R/o: H.No. 19-86, HANUMAN NAGAR, CHERIAL, Siddipet, Telangana, India - 506223 Mobile: 9948780113

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-11-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL**


**PUBLIC NOTICE**

Under the instructions of my client, **Syed Jaweed Uddin S/o. Syed Habeeb Uddin,** R/o. H.No. 5-12-187/b3/7, Gajulpet, Nirmal Dist: Nirmal. I hereby issuing this Public Notice that, Syed Jaweed Uddin S/o. Syed Habeeb Uddin is the owner and possessor of the Plot bearing No. 8, in Sy.No. 2000, total extent 2400.00 Sq.Fts., = 266.66 Sq. Yds., situated at Gajulpet, under Municipality, Nirmal, Dist: Nirmal, bounded by:- East: Plot No. 7, West: H.No. 5-12-187/B-3 on Plot No. 9, North: Plot No. 11, South: 30' Wide Road, having purchased the Plot from his Vendor Syed Fazal Uddin under Regd. Sale deed No. 4484/2002 dt:08-08-2002 of SRO, Nirmal. That the Vendor derived title to the property through Regd. Sale deed No.2251/1998 dt: 30-07-1998 of SRO, Nirmal which is the link document. That after purchase of above plot, Syed Jaweed Uddin has constructed the house over the plot, and the Municipality, Nirmal has allotted the H.No. 5-12-187/b3/7 of Gajulpet, Nirmal. The Regd. Sale Deed No. 2251/1998 dt: 30-07-1998 which is the link document was lost by him, at the time of shifting of house articles on 12-09-2026 at Nirmal. The said document could not traced out in spite of best search to his level best. That he is intending to create mortgage of the above property in favour of Gayatri Urban Bank, Br: Nirmal for availing Loan. That he has obtained the certified copy of the said Regd. Sale Deed No. 2251/1998 dt: 30-07-1998 from the SRO, Nirmal. The said property can be accepted by the bank for the proposed loan, No person will have any rights, title or interest over the said property, if anybody has got any objection, title or interest over the property they may approach within **(7 days)** from the date of this notice.
Hence this Public Notice.

Sd/- **CH.JAYANTH KUMAR,**
**B.A. LLM., Advocate**
Enrl.No. TS14/1992, Dt: 21-01-1992, R/o. H.No. 1-2-19/a/8/4, Near Govt. School, Adarshanagar, Nirmal -504 106, Dist: NIRMAL.
**Mobile No. 9440208007.**
**Date: 31-10-2026**
**Place: Nirmal**

# యుఎస్ కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల హవా

- విశ్లేషకుల అంచనా
- 21 లక్షలమంది భారత సంతతి ఓటర్ల ప్రభావం
- అమెరికా మధ్యంతర పోలింగ్ కౌంట్‌డౌన్



**వాషింగ్టన్:** అమెరికాలో నవంబరు మూడో తేదీ మధ్యంతర ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ప్రస్తుతం డెమోక్రాట్ల హవా నడుస్తోంది. అధికార రిపబ్లికన్లకు ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఎందుకంటే ఎంత ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ, తన వ్యక్తిగత ఇమేజ్‌ను చాటిచెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. బ్యాలెట్ పత్రాల్లో తనపేరు లేకపోయినాగానీ, తనను చూసి ఓటు వేయాలని ఆయన ఓటర్లను అడుగుతున్నారు. ట్రంప్ అప్రూవల్ రేటింగ్ 34 శాతానికి పడిపోయింది. అందువల్ల దిగువ, ఎగువసభల్లో ఎక్కువ సీట్లు డెమోక్రాట్ల హస్తగతమయ్యే అవకాశాలున్నాయి. దిగువసభలో మెజార్టీ సంపాదించాలంటే 218 స్థానాలు గెలుచుకోవాలి. ఎగువసభలో మెజార్టీ సంపాదించాలంటే కనీసం 51 స్థానాలు లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. ప్రతినిధులసభలో ఉన్న మొత్తం 435 స్థానాలకు, ఎగువసభ సెనేట్‌లో ఉన్న మొత్తం 100 స్థానాల్లోని 35 స్థానాలకు మంగళవారంనాడు పోలింగ్ జరుగుతుంది. దీంతోపాటు 39 రాష్ట్రాల గవర్నర్ల పదవులకు కూడా ఎన్నికలు జరుగుతాయి. ఈ గవర్నర్ పదవుల్లో మెజార్టీ స్థానాలను ఎవరు గెలుచుకుంటారనే విషయంలో కూడా తీవ్ర ఉత్కంఠ నెలకుంది.

ఈ పరిస్థితుల్లో ఇంకోవైపు టాటూ ఫెస్టివల్ సందడి కొనసాగుతోంది. ఈ ఫెస్టివల్‌లో ప్రజలు తమ తమ నాయకులపట్ల ఇష్టాన్ని ప్రదర్శిస్తూ టాటూలు వేయించుకుంటున్నారు.

కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సంపాదిస్తే, ట్రంప్ నామ మాత్రంగా మారతారు. కీలకమైన బిల్లుల ఆమోదం ఆయనకు సంక్లిష్టంగా మారుతుంది.ఏ పని చేయాలన్నా కాంగ్రెస్ అనుమతి పొందాలి. ఇరాన్‌పై వెంటనే యుద్ధం ప్రారంభించినాగానీ చట్ట ప్రకారం నిర్ణీత గడువుసమయంలో పూర్తిచేయాలి. ఈ ఎన్నికల్లో అమెరికాలోని తెలుగు సంతతి ఓటర్లు ప్రభావం చూపించనున్నారు. భారత సంతతి అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తూ సర్వేల్లో విజయావకాశాల దిశగా దూసుకువెళుతున్నారు. మొత్తంగా 21 లక్షలమంది భారతీయ సంతతి ఓటర్లు ఉన్నారు. ముఖ్యంగా డెమోక్రాట్లు భారతీయుల ఓట్లపై దృష్టి సారించారు. భారత ఆలయాల సందర్శనతోపాటు దీపావళి వేడుకలలో పాల్గొనడం, భారతీయ వంటకాలు తయారుచేసి వారి మెప్పు పొందడం వంటి పనులు చేస్తున్నారు. ఈ తరుణంలో ట్రంప్‌కు భారీ విరాళం ఇచ్చిన కుబేరుడు ఎలాన్‌మస్క్ డెమోక్రాట్లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. వారిని 2028 ఎన్నికల్లో అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని పిలుపు ఇచ్చారు. ఎన్నికలర్యాలీల్లో ట్రంప్ ఉన్నవీలేనివీ కలగలిపి తన విజయాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. రెండవసారి ట్రంప్ పదవీకాలానికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి. వివిధ సర్వేల ద్వారా ప్రజలకు ట్రంప్‌పై ఉన్న వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఇప్పటికే బహిర్గతమైనప్పటికీ, రెండేళ్ళక్రితం అధికారంలోకి వచ్చిన ట్రంప్ పనితీరును ఈ ఎన్నికల ఫలితాలు అద్దంలో ప్రతిబింబంలా చూపించనున్నాయి. విపరీతంగా పెరిగిన ప్రజల జీవన వ్యయాలు ప్రధానమై సమస్యగా ఎన్నికల ప్రచారంలో ముందుకు వచ్చింది.

ప్రస్తుతం రిపబ్లికన్లకు ప్రతినిధుల సభలో 218 స్థానాలు, డెమోక్రాట్లకు 214 స్థానాలు ఉన్నాయి. ఇప్పుడు సెనేట్‌కు జరుగుతున్న 35 స్థానాలలో 22 స్థానాలు రిపబ్లికన్లవి కాగా, 13 స్థానాలు డెమోక్రాట్లవి. ప్రస్తుత సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 స్థానాలు ఉన్నాయి. ఇప్పుడు రిపబ్లికన్ల అధీనంలో ఉన్న స్థానాలలో ఎక్కువ డెమోక్రాట్లు గెలుచుకుంటే ట్రంప్ పరిస్థితి మారిపోతుంది. విశ్లేషకుల అంచనా ప్రకారం, దిగువసభలో మెజార్టీ సాధించడానికి ఇప్పుడున్నసంఖ్యకంటే చాలా తక్కువసీట్లు డెమోక్రాట్లు అదనంగా గెలుచుకుంటే చాలు, ఆధిక్యం సంపాదిస్తారు. పోలింగ్ దగ్గర పడటంతో ట్రంప్ ముమ్మరంగా ఎన్నికల ర్యాలీల్లో పాల్గొంటున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే 5000 డాలర్లు వంతున యువకులకు ఇస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు.

# జర్మనీ—ఫ్రాన్స్‌లలో భారీ ప్రదర్శనలు

**వేలాదిగా భద్రతాదళాల మోహరింపు**

బెర్లిన్/పారిస్: జర్మనీలో ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వారాంతపు ప్రదర్శన జరిగింది. జర్మనీలో విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని, జీవన వ్యయాలు తగ్గించాలని, సామాజిక న్యాయం చేయాలని కోరుతూ 34 నగరాలలో 1,70,000 మంది జెన్‌జెడ్ ప్రదర్శకులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల సమయానికి ఈ ప్రదర్శనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఫ్రాన్స్‌లో వరుసగా మూడో వారాంతపు శనివారంనాడు కూడా దాదాపు 5,00,000 మంది జాతీయస్థాయిలో భారీ ప్రదర్శనలకు సన్నాహాలు జరుగుతూ ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఫ్రాన్స్‌లో హాలోవీన్ వేడుకల సందర్భంగా ముసుగులు ధరించిన ప్రదర్శకుల వల్ల భద్రతాపరమైన ఆందోళన పెరిగింది. 2018లో సుదీర్ఘ ఉద్యమం చేసిన ఎల్లో వెస్ట్ ప్రదర్శకులు, కార్మిక సంఘాలు, విద్యార్థులు మొదట్లో పెరుగుతున్న జీవన వ్యయాలు, అసమానతల నిర్మూలన వంటి విషయాలపై దృష్టి సారించాయి.ఉద్యమం విస్తరించిన తర్వాత మరింత పౌరస్వేచ్ఛ, ప్రజలకు నిరసన తెలియజేసే హక్కులు కూడా ఉండాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొనేందుకు అనేకమంది సన్నద్ధం కావడంతో ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. ముసుగులు ధరించి ప్రదర్శనల్లో పాల్గొనేవారిపై భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది.

అక్టోబరు 17వ తేదీన జరిగిన భయంకరమైన హింసాకాండ మళ్ళీ చెలరేగకుండా ముందస్తు చర్యలకు సన్నద్ధమైంది. 70,000 మంది భద్రతాదళాలను మోహరించి సన్నాహాలు చేసినట్లు హోంశాఖామంత్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరికలు చేయడంతో దుకాణదారులు తమ దుకాణాలకు అడ్డంగా చెక్కలను బిగించారు.దేశవ్యాప్తంగా స్కూళ్ళలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని దేశాధ్యక్షుడు మేక్రాన్ ఇప్పటికే వాగ్దానం చేశారు.ఐతే పెరుగుతున్న జీవన వ్యయాలతోపాటు విద్యారంగ సంస్కరణలు కోరుతూ దేశవ్యాప్తంగా ప్రజలు ప్రదర్శనలకు సిద్ధమవుతున్నారని, కొన్ని ప్రాంతాలలో కర్ఫ్యూ విధించామని మంత్రి చెప్పారు. ఒక ప్రణాళికాబద్ధంగా చేపట్టిన పారిస్ మార్చ్‌ను నిషేధించడాన్ని న్యాయస్థానం కూడా సమర్థించింది.పారిస్ శివార్లలో మాత్రమే ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రదర్శకులు హింసకు పాల్పడకుండా అనేక రకాల ఆంక్షలు విధించింది. దేశంలో మరో ఆరునెలల్లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో పశ్చిమితవాద నేషనల్ ర్యాలీ బలమైన శక్తిగా ముందుకు వచ్చింది. నేషనల్ ర్యాలీపార్టీ ఈ ప్రదర్శనలను గట్టిగా తిరస్కరిస్తోంది. దేశంలో విద్యాసంస్కరణలు తీసుకురావాలని,ప్రజల జీవన భారాలు తగ్గించాలని వామపక్షాలు కోరుతున్నాయి. ఈ ప్రదర్శనలకు మద్దతు ఇస్తున్నాయి.




**ఇటలీలో ఆగని ప్రదర్శనలు**

ఇటలీలో జీవనం పెనుభారంగా మారిపోవడంతో ప్రజలు భరించలేక వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఇందులోభాగంగా శుక్రవారం ఇటలీవ్యాప్తంగా విద్యార్థులు, కార్మికులు నిరసనల్లో పాల్గొన్నారు. రోమ్, నాపోల్స్, మిలాన్ నగరాలు ఈ భారీ ప్రదర్శనలకు కేంద్రాలుగా మారాయి. విద్యారంగంలో పెట్టుబడులు పెంచాలని, మధ్యప్రాచ్యంలో యుద్ధనివారణ చర్యలకు కృషి చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తున్నారు. తమ జీవనవ్యయాలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. రోమ్‌లో భారీగా సందర్శకులు ఉండే కోలేసియం చుట్టూ భద్రతలను పోలీసులు కట్టుదిట్టం చేశారు. మిలాన్ కేథడ్రల్‌కు ప్రత్యేక రక్షణ కల్పించారు. యుబిఎస్ కార్మిక సంఘాలు సాధారణ సమ్మెకు పిలుపు ఇవ్వడంతో లారీలు, టాక్సీడ్రైవర్లు, రైతులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయుధాలు, సైనిక సామాగ్రిని తరలించడానికి ఓడరేవులను ఉపయోగించవద్దని కార్మికులు డిమాండ్ చేశారు. రెండు వారాలుగా ఇటలీలో ప్రదర్శనలు జరుగుతున్నాయి. వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నారు.







## ఏకగ్రీవం (మొదటి పేజీ తరువాయి)

మహువా మొయిత్రా, సాగరికా ఘోష్ సామాజిక కార్యకర్తలు యోగేంద్ర యాదవ్, అంజలి భరద్వాజ్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, నేహా బోరా, తదితరులు పాల్గొన్నారు. సిపిఐ తరపున జాతీయ కార్యదర్శులు డాక్టర్ గిరీశ్ శర్మ, సంజయ్‌కుమార్, కె.రామకృష్ణ, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి దినేశ్ వర్షణే తదితరులు హాజరయ్యారు.

**ఆరు అభియోగాలతో అభిశంసన**

ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున ఖర్గే తొలుత జ్ఞానేశ్ కుమార్‌పై ఆరు అభియోగాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. జాతీయ, రాష్ట్ర ఎన్నికలను తారుమారు చేయడానికి బిజెపి పన్నిన నేరపూరిత కుట్రలో జ్ఞానేశ్ కుమార్ భాగస్వామి అని మొదటి అభియోగం ఆరోపించింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి, అధికార పార్టీకి ఓటర్ల జాబితాలను చూసేందుకు, ఇష్టానుసారంగా ఓటర్లను చేర్చడానికి లేదా తొలగించడానికి ఆయన అనుమతించారని పేర్కొంది.

ఓట్లను తారుమారు చేసిన, విధ్వంసకరమైన ఎస్ఐఆర్ ప్రక్రియకు జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యుడిగా పేర్కొంటూ రెండవ అభియోగం మోపింది. 13.2 కోట్ల మంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా ఓటర్ల జాబితాల నుండి తొలగించి, వారి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును హరించారని తీర్మానం ఆరోపించింది. సహజ సూత్రాలను ఉల్లంఘిస్తూ, ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను పక్షపాతంగా, పారదర్శకత లేకుండా నిర్వహించిందని కూడా ఆరోపించింది. పార్లమెంటరీ పర్యవేక్షణ లేదా అవగాహన లేకుండా, 1960 ఓటర్ల నమోదు నిబంధనలలోని ఫారం 6ను ప్రధాన ఎన్నికల కమిషనర్ చట్టవిరుద్ధంగా సవరించారని మూడవ అభియోగం ఆరోపించింది. మొదటిసారి ఓటు వేసేవారు నమోదు చేసుకోకుండా, వారి ఓటు హక్కును వినియోగించుకోకుండా నిరోధించడమే ఈ సవరణ లక్ష్యమని తీర్మానం ఆరోపించింది. ఈఆర్ఓనెట్/ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి, భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలపై కుమార్ కేంద్రీకృత నియంత్రణ సాధించారని నాలుగవ అభియోగం ఆరోపించింది. దీనివల్ల స్థానిక ఎన్నికల నమోదు అధికారులు (ఇఆర్ఓలు) అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చకుండా నిరోధించారని, అదే సమయంలో జాబితా నుండి తొలగింపులను సులభతరం చేశారని పేర్కొంది. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ నుండి మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లను మినహాయించడం ద్వారా కుమార్ చట్టాన్ని ఉల్లంఘించారని ఐదవ అభియోగం ఆరోపించింది. స్వతంత్రంగా పనిచేయడంలో, రాజ్యాంగాన్ని నిలబెట్టడంలో జ్ఞానేశ్ కుమార్ విఫలమయ్యారని ఆరవ అభియోగం ఆరోపించింది. ఆయన ప్రతిపక్ష పార్టీలను పదేపదే లక్ష్యంగా చేసుకున్నారని, వారి నాయకులకు విచారణ అవకాశాన్ని నిరాకరించారని, ఎన్నికల సంఘం ముందు తమ ఆందోళనలను వ్యక్తం చేయకుండా అడ్డుకున్నారని ఆ తీర్మానం ఆరోపించింది. ప్రతిపక్ష నాయకులను ఎన్నికలలో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించినప్పుడు, ఎన్నికల సంఘం కార్యాలయం వెలుపల వారిపై దాడి జరిగినప్పుడు కూడా ఆయన మౌనంగా ఉన్నారని ఆరోపించింది.

**2024 ఎన్నికలు చట్టబద్ధం కావు : రాహుల్‌గాంధీ**

ఓటర్ల జాబితా నుంచి 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని,అంటే ప్రతి ఏడుగురు భారతీయులలో ఒకరు, అంటే భారతదేశంలోని మొత్తం ఓటర్లలో 15 శాతం మందిని తొలగించారని రాహుల్ గాంధీ అన్నారు.ఈ ఓటర్లు గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు ఓటు వేశారని, అప్పట్లో ప్రతిపక్షాలు, బిజెపి కూటమి మధ్య గెలుపు అంతరం కేవలం 3 శాతంగా ఉందన్నారు. తాజాగా 15 శాతం మంది ఓటర్లు అసలు ఓటు వేసి ఉండకూడదని స్వయంగా ఎన్నికల సంఘమే చెబుతోందని, కాబట్టి 2024 ఎన్నికలు చట్టబద్ధం కావని, లోక్‌సభకు ఎన్నికైన వారికి సరైన ప్రజా తీర్పు లేదని స్వయంగా ఎన్నికల సంఘమే పేర్కొంటోందన్నారు.ఇంతమంది ఓటర్లను తొలగించేసి, మళ్ళీ 2024 ఎన్నికలు చట్టబద్ధమైనవని ఎలా చెప్పుకోగలరని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ మొత్తం ప్రక్రియను జ్ఞానేశ్ కుమార్ పర్యవేక్షించారన్నారు. భారతదేశ ప్రజల ఓట్లను నాశనం చేయడానికి కుమ్మక్కైన వారిని లక్ష్యంగా చేసుకునేందుకు జ్ఞానేశ్‌కుమార్ 'ప్రజా అభిశంసన' అనేది ఒక రాజకీయ ఆయుధం అని రాహుల్ గాంధీ అన్నారు. దేశద్రోహం ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కోర్టులో విచారించాలని ఆయన నొక్కి చెప్పారు. జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలనే తీర్మానానికి మద్దతుగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యవస్థను మూసివేయడంతో తమకు మరో ప్రత్యామ్నాయం లేకపోయిందన్నారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ అభిశంసనపై చర్చించేందుకు మొత్తం ప్రతిపక్షమంతా ఒక లాన్‌లో కూర్చున్నట్లుగా చరిత్రలో ఎన్నడూ జరిగిందని తాను భావించడం లేదన్నారు.'మేము మిమ్మల్ని తప్పించుకోనివ్వము. భారత యూనియన్‌పై దాడి చేసిన వారిని కూడా నేను ఉద్దేశించి మాట్లాడాలనుకుంటున్నాను. జ్ఞానేశ్ కుమార్ కేవలం ఒక అంశం మాత్రమే. ఇంకా చాలా మంది ఉన్నారు. వారు ఎవరో మాకు తెలుసు, వారు ఎవరో మాకు లోతుగా అర్థమైంది' అని రాహుల్‌గాంధీ అన్నారు.

**ప్రధాని, హోం మంత్రి ఆదేశాలతో పని చేస్తోన్న సిఇసి : ఖర్గే**

ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సీఈసీ కుమార్ పనిచేస్తున్నారని అభిశంసనా తీర్మానాన్ని ప్రవేశపెడుతూ మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. తక్షణమే సిఇసిని తొలగించాలని, సిఇసికి రక్షణ కల్పిస్తున్న 2023 చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జ్ఞానేశ్ కుమార్ వంటి వారు రాజ్యాంగ పదవులలో కొనసాగితే, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ముప్పు పెరుగుతూనే ఉంటుందని ఖర్గే అన్నారు. చివర్లో అధ్యక్ష స్థానంలో ఉన్న మీరాకుమార్ తీర్మానంపై ఓటింగ్ తీసుకోగా, అందరూ చేతులెత్తి ఆమోదం తెలిపారు.

## తమ ఓటర్లను ఎన్నుకుంటోంది

**(మొదటి పేజీ తరువాయి)**

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చర్చలో పాల్గొంటూ సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ప్రవేశపెట్టిన అభిశంసనా తీర్మానానికి సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.భారతదేశ తొలి ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ అని, ఆయన తొలి సార్వత్రిక ఎన్నికలను మానవ చరిత్రలోనే అతిపెద్ద ప్రయోగం అని అభివర్ణించారు. ఎందుకుంటే అప్పుడే స్వతంత్ర్యం వచ్చిందని, విభజన గాయాలతో రెండు దేశాలు బాధపడుతున్నాయని, లక్షలాది మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు. అయినప్పటీ మొదటి సార్వత్రిక ఎన్నికలు అత్యంత విజయవంతమయ్యాయని గుర్తు చేశారు. కానీ, నేడు అందుకు వ్యతిరేక దిశలో సాగుతోందని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని సందోష్ విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన, త్రివర్ణ పతాకాన్ని వ్యతిరేకించిన, సార్వత్రిక వయోజన ఓటు హక్కు విధానాన్ని, సమాఖ్యవిధానాన్ని వ్యతిరేకించిన సంస్థ నేడు అధికారంలో ఉందని, ప్రభుత్వాన్ని నియంత్రిస్తోందనానరు. దేశమంతా ఆందోళన చేస్తోందని, ఓటు హక్కు అనేది రాజకీయ అంశం కాదని, దీని కోసం పౌర సమాజం, విద్యార్థులు, యువజనులు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ఆర్ఎస్ఎస్, బిజెపి ఉద్దేశ్యంలో చొరబాటుదారులు అంటే మైనారిటీలు, యువకులు, విద్యార్థులేనని అన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో సాగుతోందని, ప్రజాస్వామ్యం కొనసాగేందుకు మనం ప్రయత్నించాలని, జ్ఞానేశ్ కుమార్, ఆయన సహచరులు పదవుల నుంచి పోవాలని, ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలని సందోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని, అందుకే తాను అభిశంసన తీర్మానాన్ని సమర్థిస్తున్నానని తెలిపారు.

## గ్రీన్ ట్యాంకర్ల సేవలు

**(మొదటి పేజీ తరువాయి)**

సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టిపి) ద్వారా సరఫరా చేసే శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిరంతరం తనిఖీ చేస్తూ, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. శుద్ధి చేసిన నీటిని ఎంత పరిమాణంలో రవాణా చేస్తున్నారు, ఎంత మేరకు సరఫరా చేస్తున్నారనే వివరాలను రోజువారీగా మిలియన్ గ్యాలన్స్ పర్ డే (ఎంజిడి) ప్రాతిపదికన నివేదిక రూపంలో సమర్పించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

**నవంబర్ 15 నాటికి అదనంగా 40 ఎంజిడినీటి సరఫరా**

తాగునీటి లభ్యతను నిర్ధారించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను సమీక్షలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిసిఎస్‌కు వివరించారు. మిషన్ భగీరథ కింద చేపట్టిన అదనపు 40 ఎంజీడీ నీటి సరఫరా పథకాన్ని నవంబర్ 15 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనమైన అన్ని పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు మిషన్ భగీరథ ద్వారా బల్క్ నీటి సరఫరా కొనసాగుతుందని ఎండి వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటర్ బోర్డు ఇప్పటికే అందిస్తున్న తాగునీటి ట్యాంకర్ సేవల తరహాలోనే గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనుంది. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీని ద్వారా వినియోగదారులు సులభంగా శుద్ధి చేసిన నీటిని పొందవచ్చన్నారు.

**నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించడమే లక్ష్యం**

సేవ్ వాటర్ క్యాంపెయిన్‌లో భాగంగా వ్యక్తులు, సంస్థలు, పరిశ్రమల స్థాయిలో నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఎండి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జాతి నిర్మూలనకు పాల్పడిన ఇజ్రాయెల్

**(మొదటి పేజీ తరువాయి)**

దాడిలో భాగమని, దీని లక్ష్యం సిద్ధ నివాసాలను(ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్స్) పటిష్టం చేయడం, పాలస్తీనా భూగభాగాన్ని స్వాధీనం చేసుకోవడం, పాలస్తీనా జనాభాను స్థానభ్రంశం చేయడం అని ఆ నివేదిక పేర్కొంది. ఇజ్రాయెల్‌లో హమాస్ దాడి చేసి 1200 మందిని హతమార్చిన 2023 అక్టోబర్ 7 నుంచి ఆక్రమిత పాలస్తీనా భూభాగం అంతటా కనీసం 21,500 మంది చిన్నారులు, 11,000 మంది మహిళలతో సహా 75,000 మందికి పైగా పాలస్తీనావాసులను హతమార్చారని జస్టిస్ శ్రీనివాస్ మురళీధర్ నేతృత్వంలోని కమిషన్ పేర్కొంది. 2025 అక్టోబర్ కాల్పుల విరమణ ఉన్నప్పటికీ మృతుల సంఖ్య పెరుగుతూనే ఉందని అది తెలిపింది.

''భారీ సంఖ్యలో మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అత్యంత ఘోరమైన విషయం. యుద్ధ విరమణ అని పిలిచే అప్పటి నుంచి ఇది పెరుగుతూనే ఉంది'' అని అక్టోబర్ 26న ఐక్యరాజ్య సమితిలో విడియో ద్వారా జస్టిస్ మురళీధర్ చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 'ది హిందూ'' ఆంగ్ల పత్రికలో ప్రచురితమైన కథనం వివరాలను వెల్లడించింది.

**ప్రాదేశిక నియంత్రణ**

గాజాలో ఇజ్రాయెల్ బలగాలు తమ ప్రాదేశిక నియంత్రణను విస్తరిస్తూనే ఉన్నాయి. ఫలితంగా ఇజ్రాయెల్ సైనిక నియంత్రణలో ఉన్న గాజాను, ఆ ప్రాంతంలోని పాలస్తీనా పాలిత భాగాల నుంచి వేరు చేసే పసుపు రేఖను సమీపించే లేదా దాటే పిల్లలతో సహా పాలస్తీనా పౌరులు హత్యకు, గాయాలకు గురవుతున్నారని ఆయన అన్నారు.

కాల్పుల విరమణ చాలా వరకు కొనసాగిందని, పౌరులకు అపారమైన ఉపశమనాన్ని కలిగించిందని భద్రతా మండలికి మే నెలలో సమర్పించిన తన నివేదికలో బోర్డ్ ఆఫ్ పీస్ చేసిన వాదనలకు ఈ వివరాలు విరుద్ధంగా ఉన్నాయి.

**వెస్ట్ బ్యాంక్‌లో 2023 అక్టోబర్ నుంచి పరిస్థితి గణనీయంగా దిగజారుతోందని న్యాయమూర్తి తెలిపారు.**

నిర్మూలన, హింస, అత్యాచారం, ఇతర రకాల లైంగిక హింసలతో సహా మానవత్వం లేకుండా ఇజ్రాయెల్ నేరాలకు పాల్పడిందని కమిషన్ నిర్ధారించింది. కేవలం పాలస్తీనియన్‌లకు మాత్రమే వర్తించే వివక్షా పూరిత నిబంధనల ద్వారా అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని కూడా అది ఆరోపించింది.

ఇజ్రాయెల్ హింసకు మూలాలు 1947—48 యుద్ధం విధానాలలో ఉన్నాయని ఈ నివేదిక పేర్కొంది. స్థానభ్రంశం ద్వారా పాలస్తీనా జనాభాను తగ్గిస్తూ, ప్రాణాలను హరించే శక్తిని ప్రయోగిస్తూ ప్రాదేశిక నియంత్రణను గరిష్ట స్థాయికి పెంచుకోవాలని ఇజ్రాయెల్ ప్రయత్నించిందని తెలిపింది. వెస్ట్ బ్యాంక్‌లో వైమానిక దాడులు, శరణార్థి శిబిరాల విధ్వంసం సహా ఇజ్రాయెల్ సైనిక చర్య విస్తరణను నివేదికలో నమోదు చేసింది.

2025 జనవరి నుంచి జరిగిన సైనిక చర్యల ఫలితంగా 1967 తర్వాత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనావాసులు అత్యధిక సంఖ్యలో నిరాశ్రయులయ్యారని, 2026 ఆగస్టు నాటికి కూడా 34,176 మంది ప్రజలు నిరాశ్రయులుగానే ఉన్నారని నివేదిక పేర్కొంది.

వీడియో లింక్ ద్వారా సభను ఉద్దేశించి జస్టిస్ మురళీధర్ ప్రసంగిస్తూ వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనావాసులపై అనవసరమైన లేదా అసమానమైన బలప్రయోగం చేస్తున్నందున పాలస్తీనా దళాలను కూడా ఆయన విమర్శించారు. హత్యలపై సమమర్థమవంతమైన నిష్పక్షపాత విచారణ జరపడంలోనూ, బాధితులకు పరిహారం అందించడంలోనూ పాలస్తీనా అథారిటీ విఫలమైందని పేర్కొంది.

ఇజ్రాయెల్ తన ఆక్రమణను అంతం చేయాలని, అంతర్జాతీయ న్యాయస్థానం 2024 జూలైలో ఇచ్చిన సలహాకు కట్టుబడి ఉండాలని పిలుపినిస్తూ, ఆక్రమణ, స్థావరాల(సెటిల్మెంట్‌ల)ను కొనసాగించేందుకు సహాయాన్ని నిలిపివేయాలని జస్టిస్ మురధర్ సభ్య దేశాలను కోరారు. జాతి నిర్మూలనను నివారించటానికి, శిక్షించటానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించాలని, అలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు మద్దతు ఇవ్వాలని కూడా ఆయన సభ్య దేశాలకు విజ్ఞప్తి చేశారు

అవసరమైన పత్రాలను సమర్పించినప్పటికీ అమెరికా వీసా తనకు లభించనందునే కమిటీని ఉద్దేశించి వీడియో ద్వారా ప్రకటన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి డానీ డానోన్ దీనిపై ప్రతిస్పందించారు. కమిషన్ నిర్ధారణలను తిరస్కరిస్తూ, ఆ నివేదికను ''చారిత్రక కల్పనలు'' గా అభివర్ణించారు. ఆ కమిషన్ ''ఇజ్రాయెల్ చట్టబద్ధతను సవాలు చేయయటానికి ప్రయత్నిస్తోందని '' ఆయన ఆరోపించారు. అది'' ఉగ్రవాద వాదనలు తీసుకొని, వాటిని ఐక్యరాజ్యసమితి అధికారిక పత్రంగా మార్చిందని '' అన్నారు.

**సాక్ష్యాధారాల సేకరణ**

న్యాయమూర్తి మురళీధర్ తన ముగింపు వ్యాఖ్యలలో, కమిషన్ నిర్ధారణలు ''శ్రమతో సేకరించిన సాక్ష్యాధారాల''పై ఆధారపడి ఉన్నాయని చెబుతూ, కమిషన్ పనిని సమర్థించారు. ''సాక్ష్యాధారల సేకరణ విధానాలు అంతర్జాతీయ న్యాయస్థానం , అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విధానలకు అనుగుణంగా ఉన్నాయి. కమిషన్ అత్యున్నత వృత్తిపరమైన ప్రమాణాలను పాటించి, సాక్ష్యాధారాలతో పూర్తిగా సంతృప్తి చెందిన తర్వాతే నిర్ధారణలకు వచ్చింది'' అని ఆయన అన్నారు. ఆరోపణలపై విచారణ జరపాలనుకునే ఏ న్యాయసంస్థలకైనా తమ సాక్ష్యాధారాలను పంచుకునేందుకు కమిషన్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

''కమిషన్ తన పనిని ప్రారంభించినప్పటి నుంచి ఇజ్రాయెల్ దానికి సహకరించటానికి నిరాకరించింది. ఆక్రమిత పాలస్తీనా భూభాగంలోకి దాని ప్రవేశాన్ని నిరోధించింది '' అని అన్నారు.

## శిశువు మృతి

**(మొదటి పేజీ తరువాయి)**

కమ్యూనిటీ ఆసుపత్రికి శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో చేరుకున్నారు..అప్పటి నుండి సాయంత్రం 5గంటల వరకు ప్రసవం అవుతుందని వైద్యులు చెబుతూ దాటవేస్తూ వచ్చారు. తీరా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో డెలివరీ చేసేందుకు గర్భిణి రాధను లేబర్ రూంకు తరలించి అక్కడ అటెండర్లు, ఆయాలతో వైద్యసేవలు అంధిస్తూ అక్కడ ఉన్న వైద్య సిబ్బంది మాత్రం బిర్యాని ప్యాకెట్లు తెచ్చుకొని పక్కన ఉన్న రూమ్‌లో భోజనం చేస్తూ కాలక్షేపం చేశారు. దాంతో గర్భిణి పరిస్థితి విషమించడంతో భోజనం చేస్తున్న వైద్య సిబ్బంది కమ్యూనిటీ ఆసుపత్రి సూపరిండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డికి సమాచారం అందించారు. వెనువెంటనే ఆసుపత్రికి చేరుకోవడంతోపాటు మరికొంతమంది వైద్యులను పిలిపించి గర్భిణి రాధను పరిశీలించడంతోపాటు వైద్య సేవలు అంధించేందుకు యత్నించారు. అప్పటికే గర్భిణి రాధ (28) మృతి చెందడంతోపాటు కడుపులో ఉన్న శిశువు సైతం మరణించగా ఏమీ తెలియదన్నట్లుగా పరిస్థితి విషమంగా ఉందని, హైదరాబాద్ ఉస్మానియా వైద్యశాలకు తీసుకువెళ్ళాలని చెప్పి, అంబులెన్స్‌లో తరలించి స్థానిక వైద్యులు చేతులు దులుపుకున్నారు. తీరా ఉస్మానియా వైద్యశాలకు వెళ్ళగా గర్భిణితో పాటు శిశువు సైతం మృతి చెందినట్లు నిర్ధారించి పంపించారు. దాంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రి వద్దకు రాత్రి 11 గంటల సమయంలో చేరుకొని ఆందోళన చేయగా పోలీసులు రంగప్రవేశం చేసి గర్భిణి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**అటెండర్లు, ఆయాలు డెలివరీ చేయడంతోనే రాధ మృతి**

ప్రభుత్వ ఆసుపత్రిలోని డెలివరీ రూమ్‌లో వైద్య సిబ్బందికి బదులుగా అటెండర్లు, ఆయాలు డెలివరీ చేసేందుకు యత్నించడంతోనే నిండు గర్భిణి మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆరోపించారు. వీరు కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన మల్లని రమేశ్, భార్య రాధ ప్రసవం కోసం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో వచ్చినట్లు తెలిపారు. పురిటినొప్పులతో గర్భిణి రాధ అనేక ఇబ్బందులు పడుతుంటే అక్కడే ఉన్న నర్సులు మాత్రం సెల్‌ఫోన్‌లో నిమగ్నం కావడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆసుపత్రిలో నలుగురు గైనకాలజిస్టులు, ఒక అనెస్థీషియా డాక్టర్ ఉంటే ఏ ఒక్కరు అందుబాటులో లేకపోవడంతో నర్సులు, అటెండర్లు, ఆయాలతో వైద్యం అందించడం ఏమిటని ప్రశ్నించారు. డెలివరీ కోసం వస్తే ఐదున్నర గంటలపాటు ఆసుపత్రిలో పెట్టుకొని మహిళ మృతికి కారణం అయిన డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులతోపాటు నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు అటెండర్లు, ఆయాలతో వైద్య సేవలు చేయించడంతోనే ఈ సంఘటన చోటు చేసుకుందని, ఇందుకు కారణమైన వైద్య సిబ్బందిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు ఆరోపించారు.

**పోలీసుల అదుపులో మృతురాలి భర్త రమేశ్**

నిండు గర్భిణీని డెలివరీ కోసం ఆసుపత్రికి తీసుకువస్తే సక్రమంగా వైద్యం అందించక ప్రాణాలు తీశారని మృతురాలి భర్త రమేశ్, బంధువులు ఆరోపించారు. భార్య రాధతో పాటు శిశువు మృతి చెందారని పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్త రమేశ్‌ను పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. డెలివరీ కోసం ఆసుపత్రికి వస్తే ప్రాణాలను తీసిన డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, పోలీసులు ఆపదలో ఉన్న రమేశ్‌ను అరెస్ట్ చేసి కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్యాయం జరిగిన వ్యక్తికి న్యాయం చేయాల్సిన పోలీసులు సైతం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని అంటున్నారు. ఇరువురి మరణానికి కారణమైన వైద్య సిబ్బందిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**విచారణ చేసి బాధ్యులపై చర్యలు : డిసిహెచ్ఎస్ డాక్టర్ అనురాగిణి**

గర్భిణి, శిశువు మృతి చెందిన సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కో—ఆర్డినేటర్ ఆసుపత్రుల సర్వీసింగ్ డిసిహెచ్ డాక్టర్ అనురాగిణి తెలిపారు. గర్భిణి రాధ ఆసుపత్రికి ఎన్ని గంటలకు వచ్చింది..?.వచ్చిన సమయంలో ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది?..లేబర్ రూమ్‌కు ఎవరు తీసుకువెళ్ళారు?.. అక్కడ ఎం జరిగిందనే విషయాలపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, అదే విధంగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

# మళ్లీ హిట్‌మ్యాన్‌కే ముంబై సారథ్య పగ్గాలు?

**ముంబై :** ఐపిఎల్‌లో అత్యంత జనాధరణ కలిగిన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్‌లో సారథ్య మార్పు జరుగబోతుందా? ఆ జట్టుకు రికార్డు స్థాయిలో ఐదు ట్రోఫీలను అందించిన రోహిత్ శర్మ రాబోయే సీజన్‌లో ఎంఐని నడిపించనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఈ మేరకు ముంబై యాజమాన్యంతో హిట్‌మ్యాన్ చర్చలు జరిపాడని, 2027 సీజన్‌లో జట్టును నడిపించడానికి అతడు అంగీకరించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. గత రెండు సీజన్లలో వైఫల్యాల నేపథ్యంలో ప్రస్తుతం ఎంఐకి సారథిగా వ్యవహరిస్తున్న హార్దిక్ పాండ్యా వచ్చే సీజన్ నుంచి ఆ జట్టులో ఉంటాడా? లేదా? అన్నది అనుమానంగానే ఉంది. నవంబర్ 30తో ముగియనున్న ట్రేడ్ విండోతో అతడి భవితవ్యం తేలనుంది. అయితే జట్టులో సూర్యకుమార్, బుమ్రాతో పాటు యువ ఆటగాడు తిలక్ వర్మ రూపంలో కెప్టెన్సీ ఆప్షన్స్ ఉన్నా ముంబై మేనేజ్‌మెంట్ మాత్రం రోహిత్ వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తున్నది. తిలక్‌ను సారథిగా చేయాలని రోహిత్ సూచించినా రానున్న సీజన్‌లో జట్టును నడిపించాలని మేనేజ్‌మెంట్ 'ముంబై చ రాజా'ను ఒప్పించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.



## ఆసియా కప్ జట్టులో యశ్వీర్

### అండర్-19 టీమ్‌కు ఎంపికైన హైదరాబాదీ కుర్రాడు



**ఢిల్లీ:** వచ్చే నెల 5 నుంచి ఒమన్ వేదికగా జరుగనున్న అండర్19 ఆసియా కప్ కోసం ఎంపికచేసిన భారత జట్టులో హైదరాబాదీ క్రికెటర్ ఉట్కూరి యశ్వీర్ గౌడ్‌కు చోటు దక్కింది. కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న యశ్వీర్‌కు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటేందుకు ఇది సువర్ణావకాశం కానుంది. ఈ టోర్నీలో భారత క్రికెట్ దిగ్గజాలు రాహుల్ ద్రావిడ్ కొడుకు అన్వయ్, వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సైతం ఎంపికయ్యారు. లక్ష్య రాయ్‌చందని నేతృత్వంలోని భారత జట్టు గ్రూప్ దశలో నేపాల్, పాకిస్థాన్, యూఏఈతో తలపడనుంది.

## టెస్ట్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన రబాడా..

టెస్ట్ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా స్టార్ ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడా సరికొత్త చరిత్ర సృష్టించాడు. బంతుల పరంగా అత్యంత వేగంగా 350 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టు ఐదో రోజు ఆటలో రబాడా ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో 288 పరుగుల లక్ష్య ఛేదనకు ఆస్ట్రేలియా బరిలో దిగగా, ఈ ఇన్నింగ్స్‌లోనే రబాడా ఈ ఘనత సాధించాడు. ఆసీస్ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడం ద్వారా రబాడా తన 350వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఫీట్ సాధించడానికి రబాడాకు కేవలం 13,808 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. అంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికాకే చెందిన మరో దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ (14,719 బంతులు) పేరిట ఉండేది. ఇప్పుడు రబాడా తన సహచరుడిని అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో పాకిస్థాన్ మాజీ పేసర్ వకార్ యూనిస్ (14,905 బంతులు) మూడో స్థానంలో ఉన్నాడు. ఇక ఆడిన మ్యాచ్‌లపరంగా చూసినా రబాడా అద్భుతమైన రికార్డును సొంతం చేసుకున్నాడు. అతను తన 75వ టెస్టు మ్యాచ్‌లోనే ఈ ఘనతను అందుకున్నాడు. ఫాస్ట్ బౌలర్లలో అత్యంత వేగంగా 350 వికెట్లు తీసిన వారిలో వెస్టిండీస్ లెజెండ్ మాల్కం మార్షల్‌తో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో న్యూజిలాండ్ దిగ్గజం రిచర్డ్ హ్యాడ్లీ, డేల్ స్టెయిన్ (69 టెస్టులు) అగ్రస్థానంలో ఉన్నారు.



## ఆసీస్ అగ్రస్థానం గల్లంతు

### సౌతాఫ్రికా చేతిలో ఘోర పరాజయం..

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 సైకిల్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యానికి తెరపడింది. సౌతాఫ్రికా పర్యటనలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో చిత్తుగా ఓడిన ఆసీస్.. డబ్ల్యుటిసి 2027 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని కోల్పోయింది. కేప్‌టౌన్ వేదికగా శనివారం ముగిసిన మూడో టెస్ట్‌లో సౌతాఫ్రికా 176 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. 288 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 111 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా బౌలర్ సిమన్ హర్మర్(6/16) ఆరు వికెట్లతో ఆస్ట్రేలియా పతనాన్ని శాసించగా.. కగిసో రబాడ(3/39) మూడు వికెట్లతో సత్తా చాటాడు. ఈ ఘోర పరాజయంతో ఆసీస్ డబ్ల్యుటీసీ 2027 పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానానికి దిగజారింది. ఈ మూడు టెస్ట్‌ల సిరీస్‌ను 21తో కైవసం చేసుకున్న సౌతాఫ్రికా రెండో స్థానానికి ఎగబాకింది. న్యూజిలాండ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ సైకిల్‌లో ఆస్ట్రేలియా ఇదే తొలి సిరీస్ పరాజయం. ఇప్పటి వరకు 13 మ్యాచ్‌లు ఆడిన ఆసీస్ 9 విజయాలు సాధించి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. 69.23 విన్నింగ్ పర్సంటేజీతో మూడో స్థానంలో కొనసాగుతోంది. 6 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన న్యూజిలాండ్ 4 విజయాలు ఒక ఓటమి, డ్రాతో 72.22 విజయాల శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. 7 మ్యాచ్‌లే ఆడిన సౌతాఫ్రికా 5 విజయాలు 2 పరాజయలతో 71.43 విన్నింగ్ పర్సంటేజీతో రెండో స్థానంలో నిలిచింది. ఈ మూడో టెస్ట్‌కు ముందు ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా.. సౌతాఫ్రికా మూడో స్థానంలో ఉంది. కానీ ఈ విజయంతో ఇరు జట్ల స్థానాలు తారుమారయ్యాయి. రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.






## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 73,123.83 పాయింట్లు. ముగింపు పాయింట్లు. లాభం 1,335.70 పాయింట్లు.
జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 22,600.00 పాయింట్లు. ముగింపు పాయింట్లు. లాభం 453.10 పాయింట్లు.

(గత వారం నష్టాలను చవిచూసిన స్టాక్ మార్కెట్లు ఈ వారం లాభాలు ఆర్జించాయి. గత వారం సెన్సెక్స్ 1,605.44, నిఫ్టీ 546.15 పాయింట్ల చొప్పున పతనమయ్యాయి. అయితే, ఈ వారం ఆ నష్టాలను భర్తీ చేయడంతోపాటు, లాభాలను కూడా ఆర్జించడం విశేషం).

## బులియన్ మార్కెట్

10 (గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ.1,42,260
22 క్యారెట్లు: రూ.1,30,400
18 క్యారెట్లు: రూ.1,06,690
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## క్షేత్రస్థాయికి కార్బన్ మార్కెట్

భారత వ్యవసాయ కార్బన్ మార్కెట్ తాజాగా క్షేత్రస్థాయికి చేరుకుంది. పంజాబ్, హర్యానాకు చెందిన 2,500 మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు పునరుత్పాదక వ్యవసాయ పద్ధతులను అనుసరించినందుకు డిజిటల్ చెల్లింపులు అందుకున్నారు. 'ఆది' (ఎ ఎడిఐ) రైతు కార్బన్ కార్యక్రమం ద్వారా ఈ చెల్లింపులు జరిగాయి. పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను రైతులకు అదనపు ఆదాయంగా మార్చాలనే లక్ష్యంతో గ్రో ఇండిగో 2019లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్) దీనికి సాంకేతిక మార్గదర్శకత్వం అందించింది. 2019 నుంచి 2022 మధ్య రైతులు నేరుగా విత్తే వరి సాగు (డిఎస్ఆర్), తక్కువ దుక్కి దున్నడం, పంట అవశేషాల సమర్థ నిర్వహణ వంటి పద్ధతులను అనుసరించారు. ఈ విధానాలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యవసాయం నుంచి వెలువడే గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా సాగాయి. రైతుల పొలాల్లో ఉత్పత్తి అయిన కార్బన్ క్రెడిట్లలో వారి వాటా ఆధారంగా వారికి చెల్లింపులు చేశారు. తొలి విడతలో ఒక్కో రైతుకు రూ.3,000 నుంచి రూ.15,000 వరకు చెల్లించారు. పొలాల్లో గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు ఎంత తగ్గాయి, నేలలో కార్బన్ నిల్వ ఎంత పెరిగింది అనే అంశాలను శాస్త్రీయ పద్ధతుల్లో కొలిచారు. స్వతంత్ర సంస్థల ధ్రువీకరణ తర్వాతే వెర్రా విఎం 0042 పద్ధతి కింద కార్బన్ క్రెడిట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం ఏడు రాష్ట్రాల్లో 20 లక్షల ఎకరాలకు పైగా విస్తరించింది. లక్ష మందికి పైగా రైతులు ఇందులో భాగస్వాములయ్యారు. వ్యవసాయ రంగంలో అమలవుతున్న ప్రధాన కార్బన్ కార్యక్రమాల్లో ఇది ఒకటిగా నిలిచింది. పునరుత్పాదక వ్యవసాయ పద్ధతుల ద్వారా సుమారు 45 బిలియన్ లీటర్ల నీటిని ఆదా చేశామని, రెండు లక్షల టన్నులకు పైగా పంట అవశేషాలను కాల్చకుండా నివారించామని కార్యక్రమం అంచనా వేస్తోంది. అలాగే సుమారు 1,000 టన్నుల PM2.5 కాలుష్య ఉద్గారాలను తగ్గించినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమం శాస్త్రీయ పరిశోధన, కార్బన్ మార్కెట్లు, రైతుల ఆర్థిక ప్రోత్సాహకాలను ఒకే వ్యవస్థలోకి తీసుకువస్తోంది. తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నీరు వంటి సహజ వనరులను ఆదా చేస్తూ, రైతులకు అదనపు ఆదాయం కల్పించే వాతావరణ అనుకూల వ్యవసాయానికి మార్గం ఏర్పడుతోంది.




## అక్టోబర్–మార్చి మధ్య కేంద్ర రుణం

# రూ.7.86 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో (అక్టోబర్–మార్చి) రూ.7.86 లక్షల కోట్ల రుణం తీసుకోనుంది. దీంతో 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం మార్కెట్ రుణం రూ.1,20,494 కోట్ల మేర తగ్గనుంది. 2026–27లో భారత ప్రభుత్వం డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.15,99,506 కోట్ల మార్కెట్ రుణం సమీకరించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్న రూ.17,20,000 కోట్లతో పోలిస్తే ఇది తక్కువ అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)తో సంప్రదింపుల అనంతరం 2026–27 ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో రూ.7,86,000 కోట్ల రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రూ.15,000 కోట్ల సావరిన్ గ్రీన్ బాండ్ల (ఎస్‌జిఆర్‌బి) జారీ కూడా ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ప్రభుత్వం బాండ్ల ద్వారా రూ.8,13,506 కోట్లను సమీకరించనుంది. రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు ఈ నిధులను ఉపయోగిస్తుంది. తొలి అర్ధభాగానికి నిర్దేశించిన రూ.8.2 లక్షల కోట్ల లక్ష్యంతో పోలిస్తే ఇది తక్కువ. రెండో అర్ధభాగంలోని రూ.7,86,000 కోట్ల స్థూల మార్కెట్ రుణాన్ని 23 వారపు వేలం ద్వారా ప్రభుత్వం పూర్తి చేయనుంది. ఈ రుణ సమీకరణను 3, 5, 7, 10, 15, 30, 40, 50 సంవత్సరాల కాలపరిమితి కలిగిన సెక్యూరిటీల ద్వారా చేపడతారు. వివిధ కాలపరిమితుల వారీగా రుణంలో 3 ఏళ్ల సెక్యూరిటీల వాటా 6.9 శాతం, 5 ఏళ్లవి 12.1 శాతం, 7 ఏళ్లవి 9.1 శాతం, 10 ఏళ్లవి 26.3 శాతం, 15 ఏళ్లవి 17.6 శాతం, 30 ఏళ్లవి 9.2 శాతం, 40 ఏళ్లవి 8.9 శాతం, 50 ఏళ్లవి 9.9 శాతంగా ఉంటుంది. ఇందులో సావరిన్ గ్రీన్ బాండ్ల జారీ కూడా కలిపి ఉంటుంది.






## సింగరేణిని రక్షించుకుందాం

### వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/కాసిపేట :** కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే వచ్చే నెల 4న సింగరేణి వ్యాప్తంగా జిఎం కార్యాలయాలను ముట్టడిస్తామని ఎస్‌సిడబ్ల్యుయు (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. శనివారం కాసిపేట 2వ గనిపై గొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఒప్పందంలోని 24 డిమాండ్లను అమలు చేయాలన్నారు. ఏరియా స్థాయిలో ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను భర్తీ చేస్తూ సొంతింటి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిప్ప నరసయ్య, దాగం మల్లేష్, కొండపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, బొమ్మగంటి సాగర్, కొత్తపెల్లి కృష్ణమాచారి, రత్నం రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వ్యాప్తంగా నియంతలకు కాలం చెల్లింది

- నాగర్‌కర్నూల్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు బాల నరసింహ డిమాండ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** ప్రపంచ వ్యాప్తంగా నియంతృత్వ ధోరణిలో పాలన సాగించిన నాయకులకు ప్రజలు ఎన్నికల ద్వారా తగిన గుణపాఠం చెబుతున్నారని, ప్రజాస్వామ్య శక్తులు, కమ్యూనిస్టు పార్టీల ప్రాబల్యం పెరుగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవన్‌లో కామ్రేడ్ హెచ్.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా గత మూడు నెలల కాలంలో జరిగిన ఎన్నికల్లో నియంతృత్వ ధోరణితో వ్యవహరించిన పలువురు దేశాధినేతలు ఓటమి పాలయ్యారని, బ్రెజిల్, ఫ్రాన్స్ తదితర దేశాల్లో కమ్యూనిస్టు, వామపక్ష శక్తుల ప్రభావం పెరుగుతుండటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలో కులమతాలను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి కూడా ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం నిరసనలు తెలిపేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా ఉండేదని, ప్రస్తుతం అక్కడ నిరసనలకు కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వర్గాల ఓట్లను లక్షల సంఖ్యలో తొలగిస్తూ ప్రజా స్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కరువు తీవ్రత అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. రానున్న వేసవిలో తాగునీరు, నిత్యావసరాల కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్య లు చేపట్టాలని సూచించారు. రైతులకు రోజుకు 12 గం టల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. పశువులకు మేత కొరత ఏర్పడకుండా ప్రభు త్వం ఉచితంగా పశుగ్రాస విత్తనాలను సరఫరా చేయాల ని కోరారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, ఈర్ల చంద్రమౌళి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్య శంకర్ గౌడ్, మర్యాద వెంకటయ్య, వి.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన ఎఐటియుసి నిరంతరం పోరాటాలు



దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో


భూపాలపల్లి ఏరియాలో...


కుత్బుల్లాపూర్ పరిధిలో..


భద్రాద్రి కొత్తగూడెంలో..



హసన్‌పర్తి మండలంలో..


కోటగిరి మండల కేంద్రంలో..

**ప్రజాపక్షం/దేవరకొండ :**కార్మికుల పక్షాన ఎఐటియుసి నిరంతరం పోరాటాలు చేస్తూ పాలక ప్రభుత్వాలపై ఉద్యమించి కార్మికుల సమస్యల సాధనకై ముందుంటుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ కార్యాలయం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఎఐటియుసి జెండాను ఆయన ఎగరవేశా రు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ భారత దేశ కార్మిక ఉద్యమ చరిత్రలో ఎఐటియుసి కార్మిక సంఘానికి ప్రత్యేక స్థానం ఉందని, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిందని అన్నారు. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో కార్మికుల శ్రమ గుర్తిం పు లభించాలంటే వారి సమస్యలపై సంఘటిత పోరా టం అవసరమని వివిధ పరిశ్రమల్లో పనిచేయా కార్మిక వర్గానికి తక్కువ వేతనాలతో అధిక పని భా రంతో ప్రమాదకరమైన పారిశ్రామిక, హానికరమైన సౌకర్యాల మధ్య అభద్రతకు కార్మికులు గురి అయ్యేవారని అన్నారు. అందరికి అండగా ఆనాడే ఎఐటియుసి పోరాటం చేసి కార్మికులను హక్కున చేర్చుకుందని దేశంలో కార్మిక పోరాటాలను జాతీయస్థా యిలో సమన్వయం చేయాల్సిన అవసరంతో 1920 అక్టోబర్ 31 ముంబాయ్ నగరంలో ఎఐటియుసి ఏర్పాటు అయిందని అన్నారు.కార్మిక చట్టాలు సామాజిక భద్రత ప్రభుత్వ రంగ సంస్థల పరిశ్రమల పరిరక్షణ వంటి అంశాలపై తన కర్తవ్యం కొనసాగిం చి భారత కార్మిక చరిత్రలో ఎఐటియుసి పేరు ప్రసిద్ధి గాంచిందని అన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాబోవు రోజుల్లో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలోఎఐటియుసి డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్‌రాములు, డివిజన్ గౌరవ అధ్యక్షులు మైనొది న్, వెంకటయ్య, మల్లయ్య, కార్మిక నాయకులు రా మేశ్వరమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ సాధ్యం: రాజ్ కుమార్

**భూపాలపల్లి :** కార్మికుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటాలు సాగించిన ఘన చరిత్ర ఎఐటియుసి సొంతమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే యూజి/ఓసి గని వద్ద ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం పిట్ కార్యదర్శి ఎల్.శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యనిర్వాహక కార్యదర్శి జగత్ రావు, శాఖా నాయకులు లింగయ్య, ఓసీ పిట్ కార్యదర్శి కృష్ణారెడ్డి, కార్మిక పరిశీలకులు శ్రీనివాస్, వెంకటస్వామి, సహాయ పిట్ కార్యదర్శులు బి.శ్రీనివాస్, డి.శ్రీకాంత్, మహేందర్ రావు, పిట్ కమిటీ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ఆర్‌డీ షిఫ్ట్ బాధ్యులు కోటయ్య, గని కమిటీ, భద్రతా కమిటీ, పని వేళల బాధ్యులు, దేవాలయ కమిటీ, భోజనశాల కమిటీ సభ్యులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### హక్కుల సాధనలో ఎఐటియుసిది చరిత్రాత్మక పోరాటం

**కుత్బుల్లాపూర్** : ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి నాయకత్వంలో జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, జీడిమెట్ల ఆర్‌టిసిసి డిపో, శ్రీనివాస్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో సంఘం జెండాలను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలకు ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎండి యూసుఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శి కె.స్వామి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎఐటియుసి నాయకులు నరసింహారెడ్డి, రవి, ముసలయ్య, సామిల్ మల్లేష్, స్వామి, డానియల్, పాషా, జ్ఞానేశ్వర్, రాజేందర్‌రెడ్డి, ఖాయం, బిఎల్ నారాయణ, రాజేష్‌బాబు, యాదగిరి, రమేష్, శ్రీనివాస్, కనకయ్య, మజ్జి గౌరి తదితరులు పాల్గొన్నారు.

### ఐక్య పోరాటాలతోనే కార్మిక లోకానికి మనుగడ: సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం :** శ్రామిక వర్గ పోరాటాలకు ఏఐటియూసి జెండానే దిక్సూచి అని శ్రామిక పక్షాన నిలబడి ఎరుపెక్కించిన ఆ ఎర్రజెండా నీడలోనే కార్మికులకు అసలైన రక్షణ లభిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శనివారం పట్టణంలోని పలు కార్మిక కేంద్రాలు, హమాలీ అడ్డాల్లో ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ గెద్దాడు నగేష్ వంగ వెంకట్ గనగళ్ల వీరస్వామి రమణమూర్తి వాసిరెడ్డి మురళీ భూక్యా శ్రీనివాస్ మండల రాజేశ్వరరావు లక్ష్మీ నారాయణ మాతంగి లింగయ్య అరెల్లి కృష్ణ అబ్బులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆటో కార్మికులకు బకాయి వెంటనే చెల్లించాలి : కర్రె భిక్షపతి

**హసన్ పర్తి :** రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో గారడి చేసి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినప్పటికీ ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12000 ఇస్తానని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఆటో కార్మికులకు మూడు సంవత్సరాల బాకీ పడిన రూ.36 వేలు వెంటనే చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, బికెఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 107వ ఆవిర్భావ దినోత్సవం గాజుల రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముందు ఎర్రజెండాను ఆటో యూనియన్ అధ్యక్షులు గాజుల రాజు ఎగురవేసారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, కార్మిక నాయకు లు రేణికుంట్ల దుర్గాప్రసాద్, ముజ్జిగ పరుశరాములు, ముజ్జిగ అజయ్, నాం పల్లి లక్ష్మ య్య, షేక్ బాబు, రేణికుంట్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### బ్రిటిష్ కాలంలోనే కార్మిక హక్కులు సాధించాం

**నిజామాబాద్ :** కార్మిక చట్టాల కోసం పోరాడి బ్రిటిష్ కాలంలోనే కార్మిక హక్కులు సాధించామని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలో ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గంగాధర్, ప్రసాద్, సునీల్‌కుమార్, శంకర్, దుద్యనాయక్, వీరేశం, శివరాజ్, పోశెట్టి, సాయిలు, రాజు, దత్తు పాల్గొన్నారు.




# ఓటు హక్కుపై బిజెపి కుట్ర..

- సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలి : ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి పునాదైన ఓటు హక్కును కాలరాస్తూ ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్ల తొలగింపునకు కుట్ర పన్నిందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను ఏరివేసి రాజకీయ లబ్ధి పొందాలన్నదే బిజెపివ్యూహమని ఆరోపించారు. ఓట్ల తొలగింపునకు బాధ్యుడైన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని, ఎస్‌ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి ఓట్ల చోరీపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జ్ఞానేశ్‌కుమార్ ముఖముసుగు ధరించిన వ్యక్తికి సంకెళ్లు వేసి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్టా లక్ష్మణ్‌లు మాట్లాడుతూ 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్టాన్ని సవరించి, సిఇసికి పదవీ బాధ్యతల నిర్వహణలో రక్షణ కల్పించారని ఆరోపించారు. ఈ నిబంధనలను అడ్డుపెట్టుకొని ఓట్ల తొలగింపునకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కల్పించిన సమానత్వ హక్కును, ఆర్టికల్ 326 ద్వారా లభించిన ఓటు హక్కును ఎస్‌ఐఆర్ ప్రక్రియ దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను జాబితాల నుంచి తొలగించడం ద్వారా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు తెలుపుతుంటే సమాధానం చెప్పలేక జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పించిన భావప్రకటన, సమావేశ స్వేచ్ఛకు విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు నెల్లిసత్య, వంశీ వర్ధన్ రెడ్డిలు, ఒయూ అధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్, ఒయూ ఆఫీస్ బేరర్స్ అశ్వన్, దొండి రామ్, అన్వర్, హరీష్,బాబి, అరుణ్, సిద్దార్థ్, సుమన్, అంజి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత, సమగ్రతే దేశ ప్రగతికి పునాదులు

- దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ
- నెక్లెస్ రోడ్డులో 'రన్ ఫర్ యూనిటీ', 'ఇంటిగ్రిటీ వాక్‌థాన్'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ ఐక్యతను కాపాడటంతో పాటు ప్రతి రంగంలో పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనాన్ని పెంపొందించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశ ఐక్యత కోసం చేసిన కృషి, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవం, విజిలెన్స్ అవగాహన వారోత్సవం సందర్భంగా శనివారం నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ', 'ఇంటిగ్రిటీ వాక్‌థాన్' కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐక్యతా ప్రతిజ్ఞతో పాటు నిజాయితీ ప్రతిజ్ఞ చేయించారు.
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది, రైల్వే రక్షక దళం, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ.. దేశంలోని విభిన్న ప్రాంతాలు, భాషలు, సంస్కృతులను రైల్వేలు రైళ్ల ద్వారా అనుసంధానిస్తున్నాయని, ఐక్యతా భావనతో భారతీయ రైల్వేలకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రజలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేర్చడమే కాకుండా, నిజాయితీ, నైతిక విలువలతో కూడిన సంస్థగా రైల్వేలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత కూడా ఉందని పేర్కొన్నారు. ప్రతి నిర్ణయం, ప్రతి కాంట్రాక్టు కేటాయింపులో న్యాయబద్ధత, పారదర్శకత ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్దార్థ్ కాటి, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆశిష్ మెహ్రోత్రా, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేశ వైవిధ్యంలోనే ఐక్యత ఉందనే సందేశాన్ని చాటడంతో పాటు ప్రభుత్వ వ్యవస్థల్లో నైతిక విలువలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలనే సంకల్పంతో కార్యక్రమాలు ముగిశాయి.

# బ్యాలెట్ ద్వారా ఎన్నికలకు మేం సిద్ధం

- సిఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈవిఎంలపై విష ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలకు దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ ద్వారా ఎన్నికలకు సిద్ధం కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చామని జబ్బలు చరుచుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, విదేశీ సంస్థలిచ్చే నిధులతో నడుస్తున్న పార్టీలతో, దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే శక్తులతో కలిసి పనిచేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో 2004 నుంచి ఇప్పటివరకు 18 లక్షల మందికి పైగా చనిపోయిన వారు, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, అలాగే పాతబస్తీ, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చిన వేల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలా వద్దా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే తొలగించిన ఓట్లకు సంబంధించిన ఆధారాలను మీడియా ముందు లేదా కోర్టు ముందుంచాలని సవాల్ విసిరారు. ఏ పరిస్థితుల్లోనూ దేశంలో సర్ ప్రక్రియను, ఎన్‌ఆర్‌సిని తీసుకొచ్చి తీరుతామని, మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, డిలిమిటేషన్‌ను అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్ప కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ రూపొందించిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం... అరాచకాన్ని తరిమికొడదాం' పేరుతో ఉన్న బుక్లెట్ను ఆయన ఆవిష్కరించారు.

# పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య మానవ వనరులే కీలకం

- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 65 ఐటిఐలు ఎటిసిలుగా మార్పు.. మరో 54 కేంద్రాలు ఏర్పాటు: మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య మానవ వనరులే దేశ ఆర్థిక ప్రగతికి కీలకమని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో శనివారం మంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశం ఏటా 8 శాతం స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధించాలంటే పరిశోధన, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ (ఎఐ) విస్తరణతో ఉద్యోగ రంగంలో మార్పులు వస్తున్నాయని, యువత ఎప్పటికప్పుడు నూతన నైపుణ్యాలను అలవర్చుకోవాలని అన్నారు.
రాష్ట్రంలో ఇప్పటికే 65 ఐటిఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లతో ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పించామని తెలిపారు. వచ్చే ఏడాది మరో 54 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా శిక్షణ కోర్సులు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఇచ్చే శిక్షణకు, పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలకు మధ్య ఉన్న అంతరాన్ని తొలగించడమే లక్ష్యమన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని, విదేశీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు ఆయా దేశాల భాష, పని సంస్కృతిపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. యువత నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచుకోవాలని వివేక్ వెంకటస్వామి సూచించారు.

# జాతీయ సమైక్యత పరిరక్షణకు కృషి చేయాలి

- డిజిపి కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని, సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం డిజిపి కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యత దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజి గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మల్టీ జోన్1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశంలోని సంస్థానాల విలీనంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించి, జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశ ఐక్యతను, సమగ్రతను పరిరక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐజీ (అడ్మిన్) అన్యోన్యతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిఐలు,ఎఐలు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రాప్ హాలిడేపై ప్రతిపక్షాల అసత్య ప్రచారం

- రైతులను తప్పుదోవ పట్టించొద్దు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందని ప్రతిపక్షాలుచేస్తున్న ప్రచారం అవాస్తవమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతుల్లో అనవసర ఆందోళన సృష్టించే తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం ఆరు నెలల ముందునుంచే కార్యాచరణ చేపట్టిందని వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాదని, ఇది ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వాతావరణ విపత్తు అని మంత్రి పేర్కొన్నారు. అధికంగా నీరు అవసరమయ్యే పంటలు సాగుచేసి చివరి దశలో నీటి కొరతతో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఆరుతడి, సమీకృత పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు శనగలు 26,847 క్వింటాళ్లు, పెసలు 703 క్వింటాళ్లు, మినుములు 1,369 క్వింటాళ్లు, వేరుశనగ 28,460 క్వింటాళ్లు, పొద్దుతిరుగుడు 200 క్వింటాళ్లు, నువ్వులు 148 క్వింటాళ్లు, కుసుమ 174 క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. పంటల సాగు నుంచి దిగుబడుల విక్రయం వరకు రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు.
**ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాలు :** వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయం అందించగల పంటల్లో ఆయిల్‌పామ్ ముఖ్యమైనదని తుమ్మల పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నవంబర్‌లో 10.99 లక్షలు, డిసెంబర్‌లో 6.19 లక్షలు, జనవరిలో 5.20 లక్షలు, ఫిబ్రవరిలో 4.65 లక్షలు, మార్చిలో 4.18 లక్షల ఆయిల్ పామ్ మొక్కలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రతికూలతల నుంచి రైతులను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్

- బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని, అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఉంటే అది ఆయనకే వస్తుందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మియాపూర్ భూముల విషయంలో తమ ప్రభుత్వం ఎంతో పోరాడి విజయం సాధిస్తే, ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటూ ఓట్ చోరీయే కాక క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. జడ్జిమెంట్ కాపీ చేతికి రాక ముందే మియాపూర్ భూములను అమ్మడానికి కలెక్టర్‌ను పరుగులు పెట్టిస్తున్నారని, ఆ భూములపై ఎవరి వద్ద అడ్వాన్సులు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ. 10 వేల కోట్ల అప్పు తెచ్చారని, దీనికోసం ముంబై బ్రోకర్‌కు రూ. 400 కోట్ల కమిషన్ ఇచ్చారని ఆరోపించారు. భూముల కేటాయింపులు, అక్రమాలపై దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు. మంచిరేవుల లోని గ్రేహౌండ్స్ భూముల కేసు కాంగ్రెస్ హయాంలో ఓడిపోతే, కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 142 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిందన్నారు. అలాగే భూపాలపల్లి, ఐఎంజి భారత్ భూముల వ్యవహారంలోనూ కెసిఆర్ ప్రభుత్వమే సుదీర్ఘ న్యాయపోరాటం చేసి భూములను కాపాడిందన్నారు.

# శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రొరోగ్

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ, శాసనమండలి 26వ సమావేశాలను గవర్నర్ ప్రొరోగ్ (ప్రస్తుత సమావేశాల ముగింపు) చేశారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. మార్చి 16న ప్రారంభమైన తెలంగాణ శాసనసభ, శాసనమండలి 26వ సెషన్‌ను అక్టోబర్ 31 నుంచి ప్రొరోగ్ చేస్తున్నట్లు గెజిట్ నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 31ను విడుదల చేసింది.

# అగ్రిగేటర్ సంస్థలపై సమగ్ర విచారణ జరపాలి

- చార్జీల నియంత్రణకు ప్రత్యేక విధానం రూపొందించాలి: తెలంగాణ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓలా, ఉబర్, రాపిడో, గ్రీన్ ఎస్‌ఎం, భారత్ టాక్సీ తదితర మోటార్ వాహన అగ్రిగేటర్ సంస్థలపై సమగ్ర విచారణ జరిపి, వాటి కార్యకలాపాలను నియంత్రించాలని తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ యూనియన్, తెలంగాణ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు శనివారం రవాణా శాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించాయి. అగ్రిగేటర్ సంస్థల లైసెన్సులు, అనుమతుల స్థితిగతులను పరిశీలించాలని, కేంద్ర మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు 2025 ప్రకారం రాష్ట్రంలో ప్రత్యేక విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశాయి. సంస్థల మధ్య చార్జీల వ్యత్యాసాలు, డైనమిక్ ప్రైసింగ్‌పై నియంత్రణ విధించాలని కోరాయి. ప్రయాణికులకు అందుబాటు ధరల్లో సేవలు అందించడంతో పాటు డ్రైవర్లకు న్యాయమైన ఆదాయం వచ్చేలా కనీస చెల్లింపులు, కమీషన్లపై స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నాయి. ఎలక్ట్రిక్, సిఎన్‌జి, ఎల్‌పిజి, పెట్రోల్ వాహనాల నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని చార్జీల విధానం రూపొందించాలని, సంప్రదాయ ఆటో మీటర్ చార్జీలతో అగ్రిగేటర్ చార్జీలను సమన్వయం చేయాలని కోరాయి. డ్రైవర్ల బీమా, సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైవర్ల సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధి శివానందం, ఫెడరేషన్ ప్రతినిధి ఎ.సత్తిరెడ్డి పాల్గొన్నారు.

# సాహితి చదువుకు మంత్రి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తండ్రిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన బిటెక్ విద్యార్థిని సాహితికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అండగా నిలిచారు. సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ ద్వారా కుటుంబ పరిస్థితి తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించి, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.55 వేల కాలేజీ ఫీజు చెల్లించారు. భవిష్యత్తులోనూ ఉన్నత చదువులకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు ఆయన పిఎస్ నరేందర్‌రెడ్డి శనివారం సచివాలయంలో విద్యార్థిని సాహితికి ఫీజు మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాహితి, కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలనిఎఐటియుసి వినతి

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థలో ఏళ్ల తరబడి పాత వేతనాలతోనే పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల వేతనాలను పెంచి న్యాయం చేయాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్న టూరిజం ప్లాజాలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను కూడా సవరించాలని కోరింది.ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఎస్. బోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి శనివారం పర్యాటక సంస్థ ఎండికి వినతిపత్రం సమర్పించారు. సంస్థలో పనిచేస్తున్న పలువురు ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ కార్మికులకు చాలా సంవత్సరాలుగా వేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేదని వారు పేర్కొన్నారు. పెరుగుతున్న అవసరాలు, జీవన వ్యయాలను దృష్టిలో పెట్టుకుని వేతనాలను పెంచేలా అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టూరిజం ప్లాజా సిబ్బందికి కూడా వేతన సవరణ అమలు చేసి కార్మికులందరికీ న్యాయం చేయాలని కోరారు. తమ విజ్ఞప్తిపై ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకుని అమలు చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'ఓటు బచావో—దేశ్ బచావో' ర్యాలీకి కాంగ్రెస్ నేతల తరలింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఓటు బచావో—దేశ్ బచావో' నినాదంతో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపునకు తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున స్పందించాయి. న్యూఢిల్లీలో ఆదివారం నిర్వహించనున్న భారీ ర్యాలీలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, రాష్ట్రస్థాయి నాయకులతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఢిల్లీ బాట పట్టడంతో ర్యాలీలో తెలంగాణ కాంగ్రెస్ భాగస్వామ్యం ప్రాధాన్యత సంతరించుకుంది. ర్యాలీలో పాల్గొనేందుకు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరారు. మంత్రి వెంట కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఢిల్లీలో రామలీల మైదానంలో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులకు ఏర్పాటు, పార్కింగ్ సదుపాయం తదితర ఏర్పాట్లను శనివారం కాంగ్రెస్ తెలంగాణ ఎంపిల ఫోరం చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బలరామ్ నాయక్, ఎం.అనిల్ కుమార్ యాదవ్ తదితరులు వేర్యవేక్షించారు.

# రాష్ట్రంలో ఏడు రోజులపాటు వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే ఏడు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. శనివారం రాత్రి నుండి ఆదివారం వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, ఈదురుగాలులు ఉండే అవకాశముందన్నారు. సోమవారం నుండి బుధవారం వరకు వరకు వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళవారాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆయా జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశారు.

# మిల్లెట్ కేఫ్‌లతో మహిళలకు ఉపాధి

- త్వరలో ఐదు ప్రాంతాల్లో అందుబాటులోకి రూ.2.2 కోట్ల పెట్టుబడితో 'సెర్ప్' ప్రణాళికలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడంతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఐదు మిల్లెట్ కేఫ్‌లను ఏర్పాటు చేయడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. ఆధునిక జీవనశైలిలో కనుమరుగవుతున్న జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల పోషక విలువలను ప్రస్తుత తరానికి అందజేస్తూ, మహిళలను ఆహార వ్యాపార రంగంలో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్, ఇందిరా మహిళా శక్తి బజార్, ఎంసిహెచ్‌ఆర్‌డి క్యాంపస్‌లతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట, మహబూబ్‌నగర్ పట్టణాల్లో ఈ మిల్లెట్ కేఫ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో కేఫ్ల నిర్మాణ పనులు ముగింపు దశకు చేరుకోగా, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. మహబూబ్‌నగర్‌లో అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం రూ.2.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ కేఫ్‌ల నిర్వహణ కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్), ఎపిపిసి సంస్థలతో సెర్ప్ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐఐఎంఆర్ సంస్థ ఇప్పటికే తొలి విడతగా 40 మంది మహిళలకు కేఫ్ నిర్వహణ, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చింది. ఈ కేఫ్‌లలో సాంప్రదాయ వంటకాలైన రాగి సంకటి, రాగి జావ, మిల్లెట్ ఉప్మా, కిచిడీ, రొట్టెలతో పాటు ఆధునిక అభిరుచులకు తగినట్లుగా మిల్లెట్ కేకులు, బిస్కెట్లు, మురుకులు, పులిహోర వంటి రకరకాల పదార్థాలను విక్రయించనున్నారు. స్థానికంగా చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు నిలకడైన ఆదాయ మార్గాన్ని చూపించేందుకు ఇది ఎంతగానో దోహదపడనుందని అధికారులు చెప్పుతున్నారు.
**మిల్లెట్ కేఫ్‌లతో వ్యాపారవేత్తలుగా మహిళలు : మంత్రి సీతక్క**
చిరుధాన్యాలు మన పూర్వీకుల ఆహార సంస్కృతిలో అంతర్భాగమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. వాటిలోని పోషక విలువలను నేటి తరానికి చేరువ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడి తమ కాళ్లపై తాము నిలబడినప్పుడే కుటుంబాలు, గ్రామాలు, త ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మిల్లెట్ కేఫ్‌ల ద్వారా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.
**ఎల్ నినో భయం వద్దు..**
**తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు**
రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉందని, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్ నుంచి శనివారం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ విభాగాల ఇంజనీర్‌లతో మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తాగునీటి సరఫరా పరిస్థితులపై సమగ్ర సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు రూ.120 కోట్లు విడుదల చేస్తుండగా, మిగిలిన జిల్లాల్లో తక్షణ అత్యవసర పనుల నిమిత్తం ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మంజూరైన నిధులతో పనులను వేగవంతం చేసి ప్రజలకు నీటి ఎద్దడి కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో బోరు బావులను అద్దెకు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, బావులు, స్థానిక నీటి వనరులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీర్లకు స్పష్టం చేశారు. వర్షపు నీటిని భూగర్భంలోకి పంపేందుకు ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి పొదుపుపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్ రెడ్డితో పాటు వివిధ జిల్లాల సూపరింటెండింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కులకై పోరాడాలి

ప్రజాపక్షం/జవహర్‌నగర్ : ఎఐటియుసి ఆవిర్భవించి 107 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జవహర్‌నగర్ ఎఐటియుసి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ సంబరాలు జవహర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. కాప్రా మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలకు సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అహర్నిశలు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, వారి సంక్షేమం కోసం ఎఐటియుసి నిరంతరం పనిచేస్తోందని కొనియాడారు. అనంతరం మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య మాట్లాడుతూ, ఆటో కార్మికులకు ఎల్లవేళలా అండదండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి, న్యాయమైన హక్కుల కోసం సంపూర్ణ పోరాటం చేస్తుందని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకోవాలని, మోదీ ప్రభుత్వం గద్దె దిగాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి నాయకులు వెంకటాచారి, జవహర్‌నగర్ బిసి హక్కుల సాధన సమితి నాయకులు సోమాచారి, మహిళా సమాఖ్య కాప్రా మండల అధ్యక్షురాలు కోదాస్ జయమ్మ, నాయకురాలు టి.మాధవి, డప్పు ప్రకాష్‌లతో పాటు ఆటో యూనియన్ నాయకులు యాదగిరి, మహేష్, రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం మెగా రక్తదాన శిబిరం

ప్రజాపక్షం/జవహర్‌నగర్: పోలీస్ అమరవీరుల దినోత్సవ ముగింపు సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జవహర్ నగర్ అంబేద్కర్ నగర్‌లోని రోజ్ ఫంక్షన్ హాల్‌నందు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్, కీసర, శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు స్థానిక యువత, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ ఎసిపి చక్రపాణి, జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, కీసర ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డిలతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ల అడ్మిన్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఇంచార్జ్ రామకృష్ణ వారి బృందం పాల్గొని రక్తదాన సేకరణ ప్రక్రియను పర్యవేక్షించారు. సమాజ సేవలో భాగస్వాములవుతూ యువత అత్యధిక సంఖ్యలో హాజరై దాదాపు 75 యూనిట్ల రక్తాన్ని విరాళంగా అందించారు. అమరులైన పోలీస్ సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ, ప్రాణదాతలుగా నిలిచిన యువతను, కార్యక్రమ నిర్వాహకులను పోలీస్ అధికారులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## ఆక్రమించిన ఫుట్‌పాత్‌లు తొలగింపు

ప్రజాపక్షం/చర్లపల్లి: ఫుట్‌పాత్ ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని టౌని ప్లానింగ్ అధికారులు తెలిపారు. శనివారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్మల్ నగర్ నుండి రాధిక చౌరస్తా వరకు



ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్‌లను అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే తొలగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్‌మెన్లు రమేష్, శ్రీధర్, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో పాత నేరస్తుడు అరెస్టు

ప్రజాపక్షం/చర్లపల్లి: దొంగతనం కేసులో నిందితుడిని పట్టుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డిఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం చర్లపల్లి చౌరస్తాలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి అనుమానస్పదంగా మోటర్‌సైకిల్‌పై వస్తుండడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా నిందితుడు మహబూబ్‌బాద్ జిల్లా రతిరామ్




తండా నెల్లికుదురుకు చెందిన గుగులోత్ పవన్(23) పలు పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. గత కొన్ని రోజుల క్రితం ఏఎస్ రావునగర్ రక్షణపురిలో ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసుతోపాటు హుస్నాబాద్, పోచారం, మేడిపల్లి, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడి నుండి బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, స్మార్ట్ వాచ్‌లు స్వాధీనం చేసుకున్నారు.

## డాక్టర్ ఎఎస్. రావు సేవలు మరువలేనివి

ప్రజాపక్షం/చర్లపల్లి: సమాజానికి ఎఎస్ రావు అందించిన సేవలు ప్రజల సంక్షేమం పట్ల చూపిన నిబద్ధత, అభివృద్ధి కోసం చేసిన కృషి ఎప్పటికీ మరువలేనివని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎఎస్ రావు



వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఎఎస్ రావు నగర్ గ్రౌండ్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక మహనీయుడిగా, ప్రజాసేవకుడిగా ఆయన సమాజంపై చెరగని ముద్ర వేశారని, ఆయన ఆశయాలు, ఆలోచనలు సేవా స్ఫూర్తి నేటి తరానికి మాత్రమే కాకుండా భావితరాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలకు పునరంకితం కావాలి

### ఎఐటియుసి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్. బోస్




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వ దాడులను తిప్పికొట్టాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ (ఎఐటియుసి) కాంగ్రెస్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్ అన్నారు. ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎఐటియుసి ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఎఐటియుసి సీనియర్ నేత, ఇసిఐఎల్ సంస్థకు చెందిన శ్రీనారాయణతో కల్సి ఎగురవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న కార్మికుల హక్కులు, గౌరవప్రదమైన జీవనం, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో ఎఐటియుసి ఆవిర్భవించిందని, నాటి నుండి యూనియన్ సేవల్లో భాగస్వాములైన దేశ కార్మికవర్గానికి విప్లవాభినందనలన్నారు. కేంద్ర ప్రభుత్వం దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాచే విధంగా అమల్లోకి తీసుకొని వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులకు ముప్పుగా వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాలు, కార్మిక హక్కులకు భిన్నంగా కార్మిక నిబంధనల ఉల్లంఘనలు కార్మికవర్గాన్ని తీవ్రంగా కలచి వేస్తోందన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదికతో కల్సి దేశవ్యాప్త నిరసనలు, సమ్మెలు, ధర్నాలు, ర్యాలీలతో కార్మిక హక్కులను ఎఐటియుసి ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకొని వెళుతోందన్నారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం కేవలం వేడుక కాదని, కార్మిక హక్కుల కోసం సాగిన చారిత్రాత్మక పోరాటాల మార్గంలో నేటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పోరాటాలకు పునరంకితం కావాల్సిన సందర్భమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి, ఎఐటియుసి సీనియర్ నేతలు ఎస్ శంకర్రావు, నారా నర్సింహ, జోషి, రాఘవేంద్రరావు, నర్సింహరావు, మోహన్, దయానంద్, ఎ ఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలి

### ఎఐఎస్ఎఫ్ ధర్నాలో ఉప్పల్ మండల కార్యదర్శి మహేష్‌కుమార్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: సర్ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపి వేయటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఎఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల కార్యదర్శి మహేష్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలికి నిరసనగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇసిఐఎల్ అంబేద్కర్ కూడలి వద్ద శనివారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం స్వతంత్రత, నిష్పక్షపాత పనితీరుపై ప్రజల్లో తలెత్తిన సందేహాలకు సమాధానమివ్వాలని, సిఇసి వ్యవహారంపై రాజ్యాంగబద్ద సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేసారు. ఓటర్ల హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే నన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు అలీ, సమీర్, బద్రీనాథ్, దేవేంద్ర, చరణ్, అఖిల్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.




## బియ్యం విక్రయించే ధరల నిర్ణయం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: పెరిగిన బియ్యం ధరలను అదుపు చేసే క్రమంలో మేడ్చల్ జిల్లా యంత్రాంగం విక్రయించే ధరలను నిర్ణయించింది. రాష్ట్ర, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమావేశమై తెలంగాణా బిపిటి బియ్యం కిలో ధర రూ.66, తెలంగాణా సోనా బియ్యం కిలో ధర రూ.74, తెలంగాణా శ్రీరామగోల్డ్ బియ్యం కిలో ధర రూ. 79 చొప్పున విక్రయించేందుకు నిర్ణయించారు. రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్ సేల్ డీలర్లు, రిటైలర్లు ఈ ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే తీవ్ర చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

## ఓటు హక్కు ప్రతి పౌరుడికీ విలువైనది

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు:తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హైదరాబాద్ నుండి ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహిస్తున్న ఓటు బచావో...దేశ్ బచావో నిరసన కార్యక్రమంలో పాల్గొనున్నారు.

ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హైదరాబాద్ నుండి ఫ్లైట్‌లో ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన హక్కుని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి ఉందన్నారు.

## జ్ఞానేష్ కుమార్ సస్పెన్షన్, సర్‌కి నిరసనగా ఢిల్లీకి కాంగ్రెస్ నాయకులు

ప్రజాపక్షం/జవహర్‌నగర్: కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మరియు ఎస్ఐఆర్ (సర్) నిర్వహణ వైఖరికి నిరసనగా జాతీయ రాజధాని ఢిల్లీలో నిర్వహించే భారీ ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు జవహర్ నగర్ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఢిల్లీకి బయలుదేరింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు బల్లి శ్రీనివాస్, పల్లె సత్యం, వంశరాజ్, మాజీ కార్పొరేటర్లు శారదా మనోదర్ రెడ్డి, ప్రేమల శ్రీనివాస్ మేడ్చల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాట్ల శ్రీనివాస్, జవహర్ నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శులు నాయకం భాస్కర్, గజ్వేల్ శంకర్, డిఎస్ఎస్ వెంకటేశ్వర్లు, కోశాధికారి పొలాస కిరణ్ కుమార్, నాయకులు వీర్ల భుజంగం, జడల బాలకృష్ణ, కొలిపాక సాయికిరణ్, కన్నబోయిన రాజు యాదవ్, సుబ్రహ్మణ్యం రాజు, వడుపు రామకృష్ణ, విజయరాయి, సోమేశ్ చారి ఇతర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఢిల్లీలో జరగబోయే ఈ ధర్నా



ద్వారా ప్రజాస్వామ్య రక్షణకై తమ నిరసన గళాన్ని గట్టిగా వినిపిస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

**ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం**

మాజీ ప్రధాని, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని జవహర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కార్మిక వర్గ హక్కుల కోసం ఎఐటియుసి చరిత్రాత్మక పోరాటాలు

### తాండూరులో ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/తాండూరు:తాండూరులో ఎఐటియుసి ఆవిర్భావ దినోత్స వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీ, బెల్కాటూర్ ఆదానీ(పెన్నా) ఫ్యాక్టరీ, తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి జెండాలను కార్మిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి విరందర్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గ హక్కుల కోసం ఎఐటియుసి చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిందని అన్నారు. దేశంలో అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక కొత్త లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి నెలకు రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పిఎఫ్‌తో పాటు ఇతర చట్టబద్ధమైన సంక్షేమ ప్రయోజనాలు పూర్తి స్థాయిలో అందించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పెరుగుతున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు శాశ్వత స్వభావం గల పనుల్లో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్దీకరించాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి సాగించిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులను సాధించామని గుర్తు చేశారు. కార్మికుల పక్షాన ఎఐటియుసి నిరంత రం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరణు బసప్ప, దశరథ్‌గౌడ్, నర్సిములు, శంకర్, చిప్పే రాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలకు ఉరివేసి తల్లి ఆత్మహత్య

### చింతకుంటలో అలుముకున్న విషాదఛాయలు

ప్రజాపక్షం /ధారూర్ : ఇద్దరు పిల్లలకు ఉరివేసి ఆపై వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ధారూర్ మండలంలోని చింతకుంట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం చింతకుంట గ్రామానికి చెంది న పోలీస్ భూపతి రెడ్డికి, చెవెళ్ళ మండలం మడికట్టు గ్రామానికి చెందిన వాసవి (33)తో 2017లో వివాహమైంది. వివాహ సమయం నుంచి వికారాబాద్ పట్టణంలో ఉంటు భర్త తాండూర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసున్నాడు. భార్య వికారాబాద్‌లో ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుంది. వీరికి ఇద్దరు పిల్లలు సహర్షరెడ్డి (8), వేదార్షరెడ్డి (5), ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నా రు. శనివారం పాఠశాలలో హాఫ్‌డే ,ఆదివారం సెలవులు కావడంతో ఉదయం స్వగ్రామం చింతకుంటలో భార్య ఇద్దరు పిల్లలను ఇంట్లో వదిలి, తాండూరులో కళాశాలకు వెళ్ళాడు. గ్రామంలోని ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె బెడ్ రూమ్‌లో పిల్లలను ఉరివేసి చంపి,తను ఎదురుగా ఉన్న హాలులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన మనుమలు ఇంటికి వచ్చారని తెలుకొన్న తాత పోలీస్ సాయిరెడ్డి దసరా పండుగకు తెచ్చిన బట్ట లు చిన్నగా, ఉన్నాయని కొత్త దుస్తులు తెచ్చేందుకు,



మొదటి అంతస్తులో ఉన్న పిల్లల దగ్గరకు వెళ్లాడు. హాలులో ఫ్యాన్‌కు వ్రేలాడుతున్న కోడలును చూసి గట్టిగా అరిచాడు. గమనించిన స్థానికులు వచ్చి ప్యానుకు వ్రేలాడుతున్న ఆమెను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉంది. పిల్లలకోసం వెతకగా పడక గదిలో విగత జీవులుగా పడి ఉన్నా రు. విషయం తెలుసుకున్న ధారూర్ సిఐ రఘురాములు, ఎస్ఐ సురేష్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, మృతదేహాలను వికారాబాద్ మార్చురీకి తరలించారు.

## మాదకద్రవ్యాల వినియోగంపై కఠిన చర్యలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : మాదక ద్రవ్యాలను వినియోగించిన సరఫరా చేసిన చట్టరిత్యా చర్యలు తప్పవని అలియాబాద్ మున్సిపల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రాజ్యలక్ష్మి హెచ్చరించారు. శనివారం అలియాబాద్ మున్సిపల్ లాల్‌గడిమలక్‌పేటలో ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సైబరాబాద్ పరిధిలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో నూతనంగా మంజూరైన ఎక్సైజ్ కార్యాలయాన్ని అలియాబాద్ మున్సిపల్‌లో పరిధిలోని లాల్‌గడిమలక్‌పేటలో రైతువేదిక పక్కన పాత కమ్యూనిటి హాల్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటిలు అలియాబాద్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఈ మూడు మున్సిపాలిటిల్లో 10 వైన్స్ లు, 20 కల్లు దుఖానాలు అలియాబాద్ మున్సిపల్ ఎక్సైజ్ శాఖ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఇటీవల రెండు నెలల కాల పరిమితిలో 6 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్, బెల్ట్ షాపుల నియంత్రణపై ఉక్కు పాదం మోపుతామని వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను వినియోగించినా, సరఫరా చేసిన చట్ట ప్రకా రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైన్స్ షాపుల్లో సిట్టింగ్‌కు అనుమతులు లేవని నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నరేష్‌కుమార్ ఉన్నారు.



## కార్మికుల ఐక్యతే ఆయుధం

### రాష్ట్ర నాయకుడు జయచంద్ర

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర పిలుపునిచ్చారు. ఎఐటియుసి 107వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని సువర్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జయచంద్ర మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఏకతాటిపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సహాయ కార్యదర్శి సయ్యద్ ఖదీర్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రామచంద్ర, ఎఐటియుసి మండల అధ్యక్షుడు కార్యదర్శులు బాల నరసింహ, టి.శ్రీరాములు, భూపాల్, రామ్‌కుమార్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయాలి

### మూడుచింతలపల్లి ఎంఇఒ భాగ్యమణి

ప్రజాపక్షం/శామీర్‌పేట : దివ్యాంగుల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలని వారిని క్రీడల వైపు దృష్టి మళ్లించేలా చర్యలు చేపడుతామని మూడుచింతలపల్లి మండల విద్యాధికారి భాగ్యమణి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించుటకు దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంగవైకల్యం అనేది శరీరానికే గాని మనుసుకు కాదని పేర్కొన్నారు. విద్యార్థులు విజయం సాధించాలనే ఆకాంక్షతో, పట్టుదలతో ముందుకు సాగాలని చెప్పారు. ఈ క్రీడల్లో 30మంది విద్యార్థులు పాల్గొన్నారని వారందరికీ సర్టిఫికెట్‌లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్‌చారి, సిఆర్‌పి గోవర్ధన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

### వికారాబాద్ కలెక్టర్ దీపక్‌తివారి

ప్రజాపక్షం/వికారాబాద్ : ఎల్‌నినో ప్రభావం వలన తలెత్తే పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో కరువు పరిస్థితులు పశుగ్రాసం , నీటి కొరత, విద్యుత్ వంటి సమస్యలు ఎదురైనా ప్రజలకు ఇబ్బందులు కలగకుండాఅధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్ నినో నేపథ్యంలో నీటి లభ్యతపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.
PUB/778
ఇ-టెండర్ ఆహ్వాన ప్రకటన
(http://ireps.gov.in ద్వారా)
భారత రాష్ట్రపతి తరపున, సికింద్రాబాద్, దక్షిణ మధ్య రైల్వే, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం), సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో కింది పనుల కోసం ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.
క్ర.సం.: 01 NIT No.: టెండర్ నెం: 07-2026-27-E-GS-CN 29.10.2026 పని పేరు: టెండర్ నెం: 07-2026-27-E-GS-CN SCR నిర్మాణ సంస్థ-:1. మహబూబ్‌నగర్ ధోన్ (Dhone) స్టేషన్ల మధ్య ప్రతిపాదిత డబ్లింగ్: ఆలంపూర్ స్టేషన్ రోడ్ (మినహాయించి) - దుపాడు స్టేషన్ (దుపాడు యార్డ్‌తో సహా) మధ్య RBGE & స్టేషన్ భవనాలు, గోష్టీలు, ORH, AT సరఫరా ఏర్పాట్లకు విద్యుత్ ఏర్పాట్లు, RBGతో స్టేషన్ భవనం నిర్మాణం, HL ప్యాసింజర్ ప్లాట్‌ఫామ్‌లు, గేట్ లాడ్జ్‌లు, COPS, FOB మరియు ఇతర పనుల అమలు. 33 kV/11KV HT ఓవర్ హెడ్ పవర్ లైన్ క్రాసింగ్‌లకు (33 kV-2, 11kV-4) మార్పిడి/సవరణ. 2. DKJ-MUGR సెక్షన్: తడికాల్పుడి-బేతంపూడి స్టేషన్ల మధ్య కొత్త స్టేషన్ భవనాలు, సిబ్బంది క్వార్టర్లు, గోష్టీలు, AT సరఫరా ఏర్పాట్లు, HL ప్యాసింజర్ ప్లాట్‌ఫామ్‌లు, గేట్ లాడ్జ్‌లు, COPS, FOB మరియు ఇతర పనుల అమలుకు విద్యుత్ ఏర్పాట్లు. 11kV HT ఓవర్ హెడ్ పవర్ లైన్ క్రాసింగ్‌లకు మార్పిడి/సవరణ. (11kV-2 నెం.).-3. మోటుమర్రి - విష్ణుపురం సెక్షన్: జగ్గయ్యపేట-రేపూర్ రామపురం మధ్య 33 kV/11KV HT ఓవర్ హెడ్ పవర్ లైన్ క్రాసింగ్‌లకు (33kV-3 నెం., 11kV-1 నెం.) మార్పిడి/సవరణ & గోష్టీస్/IBH లకు విద్యుత్ ఏర్పాట్లు, AT సరఫరా ఏర్పాట్లు మరియు ఇతర పనులు. అంచనా వ్యయం (రూ.): 9,86,14,815/- EMD (రూ.): 1972300 డాక్యుమెంట్ వ్యయం: ఏమీ లేదు పూర్తి చేసే కాలం: 06 (నెలలు) చివరి తేదీ: 27/11/2026 15:00 గంటలు.
1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.
2) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ మరియు టెండర్ డాక్యుమెంట్ ఖర్చు చెల్లింపు కేవలం IREPSలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న నెట్ బ్యాంకింగ్ / పేమెంట్ గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చేయాలి.
3) టెండర్ గడువు ముగియడానికి పదిహేను రోజుల ముందు వరకు ఉండే టెండర్ సమర్పణ కాలంలో టెండరర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
4) టెండర్ సమర్పణ కాలం ప్రారంభమయ్యే తేదీ వరకు, టెండరర్లు ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.
చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (Const.), సికింద్రాబాద్.
A895
మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
ఆదివారం
01-11-2026
www.prajapaksham.in

రీల్


మైత్రీ మూవీ మేకర్స్, ప్రొడ్యూసర్ సాయి రాజేష్ కొత్త నిర్మాణ సంస్థ మిట్టి అండ్ మూన్ ఫిలింమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'మైనా'. ఈ సినిమాకు సాయి రాజేష్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో శివమణి పట్నం శెట్టి, గీత మహావడి, చంటి బాబు, దివ్య జయరాజ్ హీరో–హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

## కాంతిరేఖ ఎర్రజెండా

(మొదటి పేజీ తరువాయి)

ప్రగతి చక్రాలను తిప్పిన కార్మికుల చెమట చుక్కలకు విలువనివ్వాల్సిన పాలకులు కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు.శ్రామికులు దశాబ్దాల పాటు పోరాటాలు చేసి సాధించుకొన్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్రంలోని ప్రదానమంత్రి నరేంద్ర మోడీ ఏకపక్షంగా రద్దు, యాజమానులకు లాభాలు సమకూర్చి పెట్టే విధమైన నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. జాతి సంపదగా విలసిల్లుతున్న నవరత్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ వర్గాలకు తెగనమ్మే దేశద్రోహ విధానాలను అవలంభిస్తున్న మోడీ సర్కార్‌పై కార్మిక వర్గాలు ఐక్యంగా తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర నిర్వహిస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, పెన్షన్ సదుపాయాలు కల్పించటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. ధరల పెరుగుదల అనుగుణంగా చట్టబద్దమైన కనీస వేతనాలను సమవరించాలని, సంక్షేమ బోర్డులను సమర్థవంతంగా అమలు చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అనుభవిస్తున్న హక్కులు ఎవరూ దానంగా ఇవ్వలేదని మనం పోరాడి సాధించుకున్నవేనని, ఇకముందు కూడా పోరాడి సాధించుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రాబోయే రోజుల్లో దేశవ్యాప్త సమ్మెలకు కార్మిక లోకం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్పోరేట్ వర్గాలకు అనుకూలం : కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్ర నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, బడుగు బలహీన వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పాలన చేస్తున్నదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా ఆరోపించారు. ఆదాని, అంబానీలు తీసుకున్న వేల కోట్ల అప్పులను రద్దుచేసిందన్నారు. పోరాడి సాధించుకొన్న 44 చట్టాల స్థానంలో నాలుగు నల్ల చట్టాలను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కార్పోరేట్ శక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలకు, పెట్టుబడీ దారులకు అనుకూలంగా పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వ తీరుపై కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికుల సంక్షేమానికి వారి హక్కుల సాధన కోసం అండగా నిలబడేది కేవలం ఎఐటియుసినే అని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఆసంఘం నీడలోనే మనం అనుభవిస్తున్న హక్కులని తెలిపారు. దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలపై కార్మికులు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అండగా నిలిచేది ఎర్రజెండా అని దాని నీడలో హక్కులను సాధించుకోవాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, ఏఐసిసి డైరెక్టర్ వాడె లక్ష్మి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ప్రజా సంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, గౌతమి క్రిష్ణ, వల్లపు యాకయ్య, కోరె క్రిష్ణ, పున్నారావు, గోపి, అద్దంకి బాబు, రాము, వెంకట్, బాబు, శెట్టి చేరాలు, జకరయ్య, ఆల పాటి ప్రసాద్, నామా పండు, నవీన్, కాకటి నాగేశ్వరరావు, వెంకన్న, ప్రభావతి, పుష్ప, ముత్తమ్మ, నాగమణి, ప్రేమ్‌చంద్, ప్రశాంత్, వెంకన్న, రమేష్, వజ్జా వాసు, కాటూరి రాము, కొమరయ్య, అల్లి వెంకటేశ్వర్లు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## వైవిధ్యమైన ప్రేమ కథ 'మైనా'




## డైరెక్టర్ శ్రీధర్ గాదె కొత్త చిత్రం 'కొరివి'

'ఎస్ఆర్ కళ్యాణమండపం' చిత్రంతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి..దర్శకుడిగా ప్రతిభ చాటుకున్న డైరెక్టర్ శ్రీధర్ గాదె రూపొందిస్తున్న కొత్త చిత్రానికి 'కొరివి' టైటిల్ అనౌన్స్ చేశారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై ఆది సాయి కుమార్ చుట్టాలబ్బాయ్ వంటి ఫ్యామిలీ మూవీ, ఆనంద్ దేవరకొండతో 'హైవే' వంటి యూనిక్ థ్రిల్లర్ మూవీని నిర్మించిన ప్రొడ్యూసర్ వెంకట్ తలారి..తమ ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ 'కొరివి' చిత్రంలో 'కమిటీ కుర్రోళ్లు' మూవీ ఫేమ్ ఈశ్వర్ రాచి రాజు హీరోగా నటిస్తుండగా, నందు మురళీధర్, లిఖిత హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం 'కొరివి' సినిమా శరవేగంగా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.

దర్శకుడు శ్రీధర్ గాదె బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ చిత్రానికి 'కొరివి' అనే టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. మాయా నది ప్రాంతంలో ఉన్న నిధికి కాపు కాసే ఓ కొరివి ఆ దెయ్యం కథ ఇది.. ఈ కొరివి. బిగ్ స్క్రీన్ మీద అడియన్స్‌కు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. ఈ టైటిల్



గ్లింప్స్‌లో ఇంట్రెస్టింగ్ మేకింగ్ విజువల్స్ చూపించడం విశేషం. టైటిల్ అనౌన్స్ మెంట్, ఈ గ్లింప్స్‌తో 'కొరివి' మూవీ టీమ్ డైరెక్టర్ శ్రీధర్ గాదెకు బర్త్ డే విషెస్ తెలియజేసింది. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఈ యూనిక్ హారర్ మూవీని సరికొత్త కథా కథనాలతో దర్శకుడు శ్రీధర్ గాదె తెరకెక్కిస్తున్నారు. ఈశ్వర్ రాచి రాజు, నందు మురళీధర్, లిఖిత, పూజిత పొన్నాడ, సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దీకొండ, సునీత మనోహర్, అమ్మ రామచంద్రయ్య, తదితరులు నటిస్తున్నారు.

## విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

పెంపొందించడమే ఎన్‌విఎస్ 03 ఉపగ్రహ ప్రయోగ ప్రధాన లక్ష్యమని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. దేశం అభివృద్ధి చేస్తున్న తదుపరి తరం నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థలో ఎన్‌విఎస్ 03 మూడో ఉపగ్రహం. ఈ ఉపగ్రహంలో విదేశాల నుంచి సేకరించిన అణు గడియారాలతో పాటు, భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని కూడా అమర్చారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్5, ఎస్ సిగ్నళ్లకు అదనంగా ఎల్1 సిగ్నల్‌ను కూడా ఈ ఉపగ్రహం పరిచయం చేస్తోంది. దీంతో భారత నావిగేషన్ వ్యవస్థ సామర్థ్యాలు మరింత విస్తరిస్తాయి. భారత భూభాగమంతటా, అలాగే దేశ భౌగోళిక సరిహద్దుల వెలుపల మరో 1,500 కిలోమీటర్ల పరిధిలో నావిగేషన్ సేవలు అందించేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

**సాంకేతిక అవరోధాలను అధిగమించేందుకు:** గతంలో ఎదురైన సాంకేతిక సమస్యలు పునరావృతం కాకుండా, ప్రయోగం విజయవంతమయ్యేలా ఇస్రో ఎన్‌విఎస్03 ఉపగ్రహాన్ని మూడు పైరో వాల్వ్‌లు ముందుగానే తెరిచి ఉంచి ప్రయోగించిందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ శనివారం వెల్లడించారు. ఉపగ్రహ ప్రయోగం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ నిర్ణయానికి మాజీ ఇస్రో చైర్మన్ కిరణ్ కుమార్ నేతృత్వంలోని జాతీయ స్థాయి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. కఠినమైన వైబ్రేషన్, షాక్ పరీక్షల అనంతరం ఈ విధానాన్ని ధ్రువీకరించినట్లు వివరించారు. అంతరిక్ష నౌకల ప్రొపల్షన్ వ్యవస్థలో పైరో వాల్వ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. 2025లో ప్రయోగించిన ఎన్‌విఎస్ 02 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యను చేరుకోవడంలో విఫలమైంది. ఆ వైఫల్యంపై ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరిపింది. ఆక్సిడైజర్ లైన్‌లోని పైరో వాల్వ్‌కు ఇంజిన్‌ను పనిచేయించే విద్యుత్ సంకేతం చేరకపోవడమే ప్రధాన కారణమని గుర్తించింది. కనెక్టర్‌లోని కనీసం ఒక కాంటాక్ట్ విడిపోవడం వల్ల ఈ సమస్య తలెత్తి ఉండవచ్చని 2026 ఫిబ్రవరిలో ఇస్రో వెల్లడించింది.

**ప్రధాని మోదీ హర్షం :** స్వదేశీ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ అయిన 'నావిక్' ను బలోపేతం చేసే దిశగా, ఎన్‌విఎస్– 03తో కూడిన జిఎస్‌ఎల్‌వి–ఎఫ్ 18ను విజయవంతంగా ప్రయోగించినందుకు శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను అభినందించారు. అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తలు చేస్తున్న దేశానికి గర్వకారణమన్నారు. మెరుగైన సామర్థ్యాలతో కూడిన ఎన్‌విఎస్–03, కీలక సాంకేతికతలలో భారతదేశ స్వావలంభ సాధనను మరింత ముందుకు తీసుకెళ్తుందని, అలాగే, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే నావిగేషన్ సేవలకు మద్దతు ఇస్తుందని మోదీ అన్నారు. 'ఎన్‌విఎస్–03ను మోసుకెళ్తున్న జిఎస్‌ఎల్‌వి–ఎఫ్18ను విజయవంతంగా 'ఇస్రో' లోని మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అభినందనలు. ఈ ప్రయోగం మన స్వదేశీ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ అయిన 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఒక ముందడుగు' అని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, ప్రతిభ దేశానికి నిరంతరం గర్వకారణంగా నిలుస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. భారతదేశపు స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ 'నావిక్' శుక్రవారం నాలుగు ఉపగ్రహాలతో కూడిన కనీస కార్యాచరణ కాన్ఫిగరేషన్‌కు పునరుద్ధరించబడింది. 'ఇస్రో' తన నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్–03ను జిఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారా నిర్దేశిత ఇంజెక్షన్ కక్ష్యలోకి విజయవంతంగా ప్రయోగించింది. స్వదేశీ, అటామిక్ క్లాక్‌తో కూడిన రెండవ తరం నావిగేషన్ శాటిలైట్ ఎన్‌విఎస్–03, రైళ్లు, వాహనాలు, నౌకలను నిజ సమయంలో ట్రాక్ చేయడం వంటి పౌరవినియోగంతో సహా అనేక రకాల అనువర్తనాలను కలిగి ఉంది.

**సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జిఎస్‌ఎల్‌వి–వి18 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని ప్రశంసించారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవల వంటి కీలక రంగాల్లో ఎన్‌విఎస్03 మెరుగైన సేవలు అందించనుందని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**మంత్రి కోమటిరెడ్డి అభినందనలు:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జిఎస్‌ఎల్‌వి ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్ 03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## మరో తుఫాను

(మొదటి పేజీ తరువాయి)

అదే ప్రాంతంలో వాయుగుండంగా మారింది' అని ఐఎండి ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వాయుగుండం అండమాన్ దీవుల్లోని శ్రీ విజయపురానికి పశ్చిమ నైరుతి దిశలో 330 కిలోమీటర్ల దూరంలో, కార్ నికోబార్‌కు పశ్చిమ వాయవ్య దిశలో 300 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రానున్న 12 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. ఆ తర్వాతి 12 గంటల్లో కూడా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడి తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండి వివరించింది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాత ప్రాంతాల్లో తుఫాను తీవ్రత పెరుగుతుందని అంచనా వేసింది. నవంబర్ 2 సాయంత్రానికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది.

## భారీ ర్యాలీ నేడు

(మొదటి పేజీ తరువాయి)

పోరాడుతున్న సంస్థలకు అండగా నిలుస్తామని ప్రకటించింది. ఇలావుంటే, 'చలో ఢిల్లీ' పేరుతో ఈ ప్రదర్శన ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మింటో రోడ్‌కనాట్ ప్లేస్ కూడలి నుంచి ప్రారంభమై రామ్‌లీలా మైదాన్‌కు చేరుకుంటుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడ బహిరంగ సభ జరుగుతుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి ప్రదర్శన ప్రారంభమయ్యే ప్రాంతానికి ఇండియా కూటమి నేతలు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణిస్తారని సమాచారం. ఈ ర్యాలీకి 10 లక్షల మంది వరకు హాజరవుతారని ఇండియా కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. అయితే, సుమారు 50 వేల మంది వస్తారని ఢిల్లీ పోలీసులు భావిస్తున్నారు. భద్రత, జనసమూహ నియంత్రణ కోసం 4 వేల మందికి పైగా పోలీసు సిబ్బందితోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాల కంపెనీలను మోహరించనున్నారు. ప్రదర్శన మార్గంతోపాటు సభా ప్రాంగణంలోనూ వీరు విధులు నిర్వహిస్తారు. రామ్‌లీలా మైదాన్‌సరు 14 జోన్లుగా విభజించారు. ప్రతి జోన్ బాధ్యతలను అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. నిఘా కోసం 200కు పైగా సిసిటివి కెమెరాలు, డ్రోన్లు, పోలీసుల శరీరాలకు అమర్చే కెమెరాలను వినియోగించనున్నారు. మైదానంలో ప్రత్యేక నియంత్రణ గదిని ఏర్పాటు చేశారు. ఇలావుంటే, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు.

శనివారం ఖర్గే నివాసంలో ఇండియా కూటమి నిర్వహించిన ప్రతీకాత్మక 'ప్రజా అభిశంసన' కార్యక్రమానికి కొనసాగింపుగా ఆదివారం ఈ భారీ ఆందోళన జరగనుంది. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రధాన ఎన్నికల కమిషన్ప ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలతో కూడిన తీర్మానాన్ని ఖర్గే ప్రవేశపెట్టారు. అనంతరం రాహుల్ గాంధీ ముగింపు ప్రసంగం చేశారు. ఆ తర్వాత సభ ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ కార్యక్రమంలో పలు ప్రతిపక్ష పార్టీల నేతలు, పౌర సమాజ ప్రతినిధులు, ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతో ప్రభావితమైన ప్రజలు పాల్గొన్నారు. పార్లమెంటరీ చర్చల తరహాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నల్లగొండకు తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

జానారెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిల నియోజకవర్గాలలో లిఫ్ట్ స్కీమ్లు త్వరితగతిన పూర్తవుతున్నాయని, అయితే ఇతర నియోజకవర్గాలపై వారు దృష్టి సారించడం లేదని విమర్శించారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీళ్లందించే డిండి లిఫ్ట్ స్కీమ్కు ఎదుల్లా నుండి నీటిని విడుదల చేయవద్దంటూ మహబూబ్ నగర్ బిజెపి ఎంపీ డి.కె. అరుణ బాహాటంగా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కృష్ణా బేసిన్లో నల్లగొండకు రావాల్సిన చట్టబద్ధమైన వాటానంతటినీ తాము కోరుతున్నామని, ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదని స్పష్టం చేశారు. న్యాయంగా డిండి లిఫ్టు అందాల్సిన 30 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎంపీ డీకే అరుణ మహబూబ్నగర్ ప్రజలను రెచ్చగొడుతూ జిల్లాల మధ్య వైషమ్యాలు పెంచేలా వ్యవహరిస్తున్నారన్నారు. నీటి విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకారం తెలపడం శుభపరిణామమని పేర్కొన్నారు.

**రాచకొండ లిఫ్ట్ స్కీముకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలి**

సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు నీరందించే రాచకొండ లిఫ్ట్ స్కీమ్కు వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఎత్తులో ఉన్న రాచకొండ ప్రాంతంలో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే సుమారు 65 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, యుద్ధప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని కోరారు. త్వరలోనే సిపిఐ డెలిగేషన్ ముఖ్యమంత్రిని కలసి వివరాలు అందజేస్తుందన్నారు. రాచకొండ లిఫ్ట్ స్కీమ్ సాధించే వరకు సిపిఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలి**

తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా 8 మంది బిజెపి ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి సాధించింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చినట్లే, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా సాధించాలని సూచించారు.ఈ మహాధర్నా కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, నాయకులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, కురిమిద్దె శ్రీనివాస్, దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, ఏఐవైఎఫ్ నాయకులు తీర్పారి వెంకటేశ్వర్లు, నయీమ్, జగన్, సర్పంచులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.













Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com